ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం
శుక్రవారం 24, మే 2024


పంచాయతీ పాలన గాడితప్పింది. గ్రామాలలో మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దాల్సిన వ్యవస్థపై అజమాయిషీ కొరవడింది. ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా, డివిజనల్ పంచాయతీ కార్యాలయాలు ఉన్నా ఎటువంటి ఉపయోగం లేకుండా పోయింది. ఏ కార్యాలయంలో ఎప్పుడు ఏమి జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. కొంతకాలం నుంచి పంచాయతీ కార్యదర్శుల నుంచి జిల్లా కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల వరకు 'అంతా మా ఇష్టం' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళా ఉద్యోగులపై వేధింపులు ఎక్కువయ్యాయి. ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న ఘటనలు చూస్తే పరిస్థితి చేయి దాటిపోయిందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



- డీఎల్‌పీవో ఆఫీసుల్లో ఇష్టారాజ్యం
- మహిళా ఉద్యోగులపై వేధింపులు..
- అయినా పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఒంగోలులో ఉద్యోగులు ఉన్నా పనిచేసేవారు కరువు
- రెగ్యులర్ డీపీవో లేకపోవడంతో అజమాయిషీ కరువు
- మార్కాపురం కార్యాలయంలోనూ ఇదే పరిస్థితి
- మహిళా ఉద్యోగులతో దురుసుగా మాట్లాడిన ఆడియోలు లీక్‌తో అంతటా కలకలం

ఇదేం పంచాయతీ!

వివాదాలకు అడ్డాగా కార్యాలయాలు



ఒంగోలు(కలెక్టరేట్), మే 23 : పంచాయతీ పాలనను పాలకులు గాలికొదిలేశారు. కార్యాలయాలు పనిచేయడం మానేశాయి. ఉన్నతాధికారుల ఉదాసీనతతో వివాదాలకు అడ్డాగా మారుతున్నాయి. ఉద్యోగులపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో వారు తాము అక్రమాలు చేసినా ఏం కాదులే అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. ఒంగోలు, కనిగిరి, మార్కాపురంలలో డివిజనల్ పంచాయతీ కార్యాలయాలు ఉండగా జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఈ కార్యాలయాన్నింటినీ పర్యవేక్షించేందుకు జిల్లా పంచాయతీ కార్యాలయం ఉంది. పేరుకు మాత్రమే కార్యాలయాలు ఉన్నాయే తప్ప అటు ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించే విషయంలోనూ, ఇటు ఉద్యోగులకు ఏదైనా సమస్య వస్తే వాటిని పరిష్కరించే విషయంలోనూ పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. రెండు రోజుల క్రితం మార్కాపురం డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో మహిళా ఉద్యోగుల పట్ల సీనియర్ అసిస్టెంట్ వ్యవహరించిన తీరే ఇందుకు నిదర్శనం. తప్పుచేసిన వారిపై సత్వరమే చర్యలు తీసుకోవాల్సిన అధికారులే అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒంగోలు కార్యాలయంలో గొడవలు

ఒంగోలు డివిజనల్ పంచాయతీ కార్యాలయలోనూ అంతా అస్తవ్యస్తంగా తయారైంది. అక్కడ పనిచేసే ఉద్యోగులు డీఎల్‌పీవోకు సహకరించని పరిస్థితి ఏర్పడింది. కార్యాలయంలో ఏ పనిచేయాలన్న కుదరని పరిస్థితి ఏర్పడిందని ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై కూడా డీపీవో ఉషారాణి ఉద్యోగులను విచారణ చేసినట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఇక్కడ రెగ్యులర్‌గా పనిచేసే డీపీవో నారాయణరెడ్డిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల అధికారిణి ఉషారాణికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. డీపీవో విధుల్లో ఉన్నా ఆమె పెద్దగా పట్టించుకుంటున్న పరిస్థితి లేదు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేసే అధికారులు, ఉద్యోగుల నుంచి క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ కార్యదర్శుల వరకు అందరూ తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మార్కాపురం డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో పనిచేసే ఇరువురు మహిళా ఉద్యోగుల పట్ల అక్కడ పనిచేసే సీనియర్ అసిస్టెంట్ మాట్లాడిన మాటలు ఆడియో రూపంలో బహిర్గతం కావడంతో ప్రజల్లో విస్తృత చర్చకు దారితీసింది. అదే సీనియర్ అసిస్టెంట్ ఒంగోలు డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో ఏడాది క్రితం మహిళా ఉద్యోగులను ఇదేవిధంగా వేధించిన విషయం తెలిసిందే. అప్పట్లో ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి అతనిని మాతృశాఖ అయిన పంచాయతీరాజ్‌కు సరెండర్ చేశారు అయితే ఆ సీనియర్ అసిస్టెంట్ తనకు ఉన్న ఆర్థిక, అంగబలంతో సరెండర్ చేయడాన్ని తప్పుబడుతూ కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేసే ఒకరి ద్వారా మార్కాపురం డీఎల్‌పీవో కార్యాలయానికి బదిలీ చేయించుకున్నారు. అయినా అతని తీరు మారలేదు. అక్కడ కూడా తన పాత నైజాన్ని వదలకుండా మహిళా ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా సభ్యసమాజం తలదించుకునే విధంగా మాట్లాడిన మాటలు బయటకు రావడంతో శాఖలో కలకలం రేగింది. అయినా జిల్లా పంచాయతీ అధికారులు ఇంతవరకు ఈ ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.


డీపీవో కార్యాలయం

మహిళా ఉద్యోగుల వేధింపులపై విచారణ పూర్తి

- కలెక్టర్‌కు నివేదించిన డీపీవో

మార్కాపురం డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో మహిళా ఉద్యోగులను వేధిస్తున్న సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుపై చర్యలకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. మహిళా ఉద్యోగుల ఫిర్యాదు మేరకు విచారణ చేసిన జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి అందుకు సంబంధించిన నివేదికను గురువారం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు పంపారు. కలెక్టర్ ఆ నివేదికను పరిశీలించి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే అదే సీనియర్ అసిస్టెంట్ ఒంగోలు డీఎల్‌పీవో కార్యాలయంలో పనిచేసే సమయంలో మహిళా ఉద్యోగులను వేధిస్తుండటంతో మొదట పంచాయతీరాజ్‌కు సరెండర్ చేసి తర్వాత కోర్టు ఆర్డర్ కారణంగా మార్కాపురానికి బదిలీ చేశారు. అక్కడ కూడా ఇదే విధంగా వ్యవహరించడంతో కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని శాఖలో చర్చ నడుస్తోంది.

లారీ లూటీ

- వాహనాన్ని ఎత్తుకెళ్లి సామగ్రి అపహరణ
- రాళ్లపై బాడీని నిలిపిన వైనం
- యజమానికి రూ.3 లక్షలు నష్టం

పెద్దదోర్నాల, మే 23: హైవే వెంబడి దోపిడీలు సాధారణంగా జరుగుతుంటాయి. అయితే గురువారం దోర్నాలలో వెలుగుచూసిన లూటీ మాత్రం ఒకింత భిన్నమైనదే..!. గ్రామానికి చెందిన పఠాన్ యాసిన్‌ఖాన్ లారీని స్థానికంగా ఓ పెట్రోలు బంకు వద్ద బుధవారం రాత్రి నిలిపి ఉంచారు గురువారం తెల్లవారుజామున వచ్చిచూడగా నిలిపిన చోట లారీ కనిపించలేదు. దీంతో ఆందోళన చెంది తన మనుషులతో పలుచోట్ల వెతికించారు. ఈ క్రమంలో పెద్దారవీడు మండలం గంగుపల్లెకు వెళ్లే రోడ్డులో నిర్మానుష్య ప్రాంతంలో లారీని గుర్తించారు. లారీ ఆకారమైతే ఉంది కానీ, స్పేర్స్ మొత్తం మాయమయ్యాయి. 12 టైర్లు, డిస్కులు అపహరణకు గురయ్యాయి. కిందపడకుండా రాళ్లపై బాడీని నిలబెట్టారు. ఇక లారీలోని 200 లీటర్ల డీజిల్, టార్పాలిన్ పట్టాలు, తాళ్లు, కేబిన్‌లోని విలువైన వస్తువులు కూడా ఎత్తుకెళ్లారు. మొత్తం రూ.3లక్షల విలువైన వస్తువులు దోపిడీకి గురైనట్లు బాధితుడు దోర్నాల పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎస్సై అంకమరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపహరణకు గురైన లారీ


పోస్టల్ ఓట్లు అమ్ముకున్న

ముగ్గురు టీచర్ల సస్పెన్షన్

ఒంగోలు(విద్య), మే 23 : దర్శి నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్లు ఒక రాజకీయపార్టీకి అనుకూలంగా వేసేందుకు లంచం తీసుకున్న ముగ్గురు టీచర్లపై సస్పెన్షన్ వేటుపడింది. జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ ముగ్గురిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి పోస్టల్ బ్యాలెట్ల కొనుగోలు చేస్తూ డబ్బులు పంచుతున్న ఇరువురు వ్యక్తులను దర్శిలో పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించడంతో పోస్టల్ బ్యాలెట్ కోసం ఎవరెవరికి డబ్బులు ఇచ్చింది వెల్లడించారు. కొందరు టీచర్లు, ఉద్యోగులకు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా కూడా డబ్బులు పంపించారు. ఈక్రమంలో దర్శి, ముండ్లమూరు మండలాల్లో పనిచేస్తున్న ముగ్గురు టీచర్లు పోస్టల్ బ్యాలెట్‌కు లంచం తీసుకున్నట్లుగా ఎస్పీ విచారణలో తేలింది. దర్శి మండలం బండివెలిగండ్ల ఎంపీయూపీ స్కూలులో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు, దర్శి మండలం రామచంద్రాపురంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయిని, ముండ్లమూరు మండలం శింగన్నపాలెం ఎంపీయూపీ స్కూలులో ఇంగ్లీషు స్కూలు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు డబ్బులు తీసుకున్నట్లుగా తేలింది. వారి వివరాలను ఎస్పీ తన నివేదికలో కలెక్టర్‌కు సమర్పించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడం, ఓటుకు లంచం తీసుకోవడం అభియోగాలపై ఆ ముగ్గురిని సస్పెండ్ చేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ డీఈవోకు సిఫార్సు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.



పరీక్షలు సజావుగా జరిగేనా?

- నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ
- నిమిషం లేటైనా నోఎంట్రీ

ఒంగోలు(విద్య), మే 23: జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరుగుతాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరీక్షల నిర్వహణలో ఇంటర్ బోర్డు చేసిన విచిత్ర మార్పులు ఈ అనుమానాలకు ఊతమిస్తున్నాయి. పరీక్షల నిర్వహణలో ఇప్పటివరకు ప్రైవేటు కళాశాలల వారిని దూరంగా ఉంచిన బోర్డు ప్రస్తుతం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో వారికే పెద్ద పీట వేయడంతో పారదర్శక నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులుగా ప్రభుత్వ, ఎయిడెడ్ ప్రభుత్వ గురుకుల కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులను మాత్రమే నియమించేవారు. ప్రస్తుత పరీక్షల్లో ఈ విధానాన్ని సడలించి నిర్వహణ అధికారులుగా ప్రైవేటు కళాశాలల వారిని కూడా నియమించడంతో అందరిలో సంశయం నెలకొంది. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు డిపార్ట్‌మెంట్ అధికారులను తొలగించి వారి స్థానంలో అదనపు చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. అదనపు చీఫ్ సూపరింటెండెంట్లుగా ప్రైవేటు కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలకు అక్కడి ప్రిన్సిపాల్స్‌నే నియమించారు. దీంతో ప్రశ్నపత్రాల భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటివరకు పరీక్ష జరిగే సమయంలో కేంద్రాల్లో ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను కానీ, లెక్చరర్లను కానీ అనుమతించేవారు కాదు. ప్రస్తుతం వారు అధికారి హోదాలో వారు కేంద్రాల్లోనే తిష్ఠ వేస్తుండటంతో అనుమానాలు వస్తున్నాయి. డిపార్ట్‌మెంట్ అధికారులుగా ప్రభుత్వ అధికారులను నియమిస్తే వారికి టీఏ, డీఏలు చెల్లించాల్సి వస్తోందని, దీనిని తప్పించుకునేందుకు ఇంటర్ బోర్డు అధికారులు ఈ విధానానికి తెరతీసి పరీక్ష నిర్వహణను గాలి కొదిలేశారన్న విమర్శలున్నాయి. ఈ విధానం చీఫ్‌లపై మరింత భారం పెరగనుంది.

నిమిషం నిబంధన: ఆర్ఐవో

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు నిమిషం లేటైనా అనుమతించేదిలేదని ఆర్ఐవో సైమన్ విక్టర్ తెలిపారు. పరీక్షలకు 22,366 మంది విద్యార్థుల హాజరవుతుండగా వీరిలో 15,291 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు 7,075 మంది ద్వితీయసంవత్సరం విద్యార్థులు హాజరవుతున్నారు. 43 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. కంభం, పెదదోర్నాల, అర్థవీడు, యర్రగొండపాలెం కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను సున్నితమైనవిగా గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారన్నారు. పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్‌ను నిరోధించేందుకు రెండేసి చొప్పున సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని పరీక్షా కేంద్రాలకు సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- అతనికి ఐదు నెలల క్రితమే వివాహం
- నలుగురికి గాయాలు


వెంకటేశ్వరరెడ్డి మృతదేహం

సీఎస్‌పురం(పామూరు), మే 23: కుటుంబసభ్యులతో కలిసి దైవదర్శనం చేసుకొని మరో రెండు గంటల్లో స్వగ్రామానికి చేరుకుంటామనుకుంటున్న తరుణంలో పాలట్యాంకర్ రూపంలో మృత్యువు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను కబళించింది. ఈ సంఘటన నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం చింతలగుంట వద్ద బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. సీఎస్‌పురం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని ఐదుగురు మొక్కులు తీర్చుకునేందుకు కారులో తిరుమలకు వెళ్లారు. దైవదర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో దుత్తలూరు మండలం చింతలగుంట సమీపంలోని ఇటుక బట్టీల వద్దకు వచ్చేసరికి మార్కాపురం నుంచి చిత్తూరుకు పాలతో వెళుతున్న ట్యాంకర్ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పాలగిరి వెంకటేశ్వరరెడ్డి (30) సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కారులో ఉన్న మృతుని భార్య మంజులత, తండ్రి సుబ్బారెడ్డి, అక్క కొడుకు అభిరూప్ నందన్‌రెడ్డితోపాటు మృతుని తల్లి నారాయణమ్మకు గాయాలయ్యాయి. మృతుడికి ఐదు నెలల క్రితమే వివాహమైనట్టు బంధువులు తెలిపారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించగా, మృతదేహాన్ని ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. ప్రమాద సమాచారం తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.


కారును ఢీకొట్టిన పాలవ్యాను

కౌంటింగ్‌కు కట్టుదిట్టం

- సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసు దృష్టి
- కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన వారి కోసం ఆరా
- బాణసంచా విక్రయాలపై నిషేధం

ఒంగోలు(క్రైం), మే 23 : ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో పోలీసులు అప్రమత్తమవుతున్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రధానంగా దృష్టిసారించారు. అదేక్రమంలో నిఘా విభాగాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటూ ఎస్పీ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇప్పటికే నియోజకవర్గ కేంద్రాలలో మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. నిత్యం ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో కార్డన్ సెర్చ్‌లు చేపట్టారు. కొత్త వ్యక్తుల కదలికలపైనా నిఘా పెట్టారు. పేలుడు పదార్థాలు, మారణాయుధాలు నిల్వ ఉంచారా? అనేకోణంలో జల్లెడపడుతున్నారు. అదేక్రమంలో జిల్లాలో సుమారు 26వేల మందిని బైండోవర్ చేశారు. అయితే అధికారపార్టీ వారి వ్యవహారం పోలీసులకు తలనొప్పిగా మారింది.

షీటర్లపై నిఘా అంతంతమాత్రమే

పోలీసుల ముందస్తు చర్యలతో ప్రజలలో కొంతమేరకు భరోసా వచ్చినప్పటికీ రౌడీషీటర్లు, హిస్టరీ షీట్లు ఉన్న వారి కదలికలపై నిఘా కరువైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా అధికారపార్టీ నేతల అండదండలు ఉన్న షీటర్లు యధేచ్ఛగా తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎన్నికలలో పోటీచేసిన వారి వద్ద ఉన్న సెకండ్ కేడర్ నాయకులు దర్జాగా తిరుగుతున్నా పోలీసులు మాత్రం సామాన్యులపై ప్రతాపం చూపిస్తుండడం విమర్శలకు తావిచ్చింది. ఇక ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బాణసంచా విక్రయాలను నిషేధించారు. పెట్రోల్ బంకుల వద్ద బాటిళ్లకు పెట్రోల్ కొట్టకూడదు అనే ఆంక్షలు విధించారు. ఇంకా రాత్రులు పోలీసు అధికారులు పల్లెనిద్ర చేస్తూ రోజుకో గ్రామంలో సమాచారం సేకరిస్తున్నారు.

బైండోవర్ చేసిన వారు కేసుల్లో...

బైండోవర్ చేసిన వారిలో అనేకమంది అధికార పార్టీకి చెందిన వారు కోడ్ ఉల్లంఘించి వివిధ ఘటనలలో పాల్గొన్నారు. అలాగే కేసులు నమోదయ్యాయి. వారిపై విధించిన బీచ్ బాండ్లను రాబట్టే పనిలో పడిన పోలీసులకు ప్రస్తుతం అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని పార్టీల వారిని ఎన్నికల ముందు 26వేల మంది వరకు బైండోవర్ చేశారు. ఆ సమయంలో వారి వద్ద నుంచి రూ.లక్ష బాండ్లను తీసుకున్నారు. ఎలాంటి అల్లరు సృష్టించినా కేసులలో నిందితులుగా ఉన్నా రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రచారం, పోలింగ్ సందర్భంగా జరిగిన కేసులలో బైండోవర్ చేసిన వారిలో వందమందికిపైగా పాల్గొన్నట్లు సమాచారం. దీంతో వారిని తహసీల్దార్ వద్దకు పిలిపించి రూ.లక్ష నగదు చూపించాల్సి ఉంది. ఇందుకు అధికారపార్టీకి చెందిన వారు అడ్డం తిరుగుతున్నారు. తాము తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చేదేమిటి అంటూ పోలీసులనే బెదిరిస్తున్న పరిస్థితి ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా కొంతమంది ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఇది పోలీసులకు ఇబ్బందిగా మారింది. బైండోవర్ చేసిన తర్వాత చట్టప్రకారం ఎలాంటి గొడవలలో తలదూర్చకూడదు. అలా అల్లర్లకు పాల్పడితే వారు ఇచ్చిన బాండ్ విలువను ప్రభుత్వానికి చెల్లించాలి. అధికారుల ఒత్తిడి, అధికార పార్టీ నాయకుల బెదిరింపుల మధ్య పోలీసులు నలిగిపోతున్నారు.


గిద్దలూరులో పోలీసుల మాక్ డ్రిల్

వణికిస్తున్న కార్డన్ సెర్చ్

అన్ని స్టేషన్ పరిధిలో పోలీసులు కార్డన్ సెర్చ్‌కి శ్రీకారం పలికారు. ఆయా ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు నివాసం ఉంటున్నారా? ఎక్కడైనా మారణాయుధాలు, పేలుడు పదార్థాలు ఉన్నాయా? అనే కోణంలో సోదాలు చేస్తున్నారు. అదేసమయంలో బైక్‌లపై తిరిగే వారిని తనిఖీలు చేస్తున్నారు. వారి వద్ద పత్రాలు ఉన్నాయా అని పరిశీలించి అనుమానం ఉంటే బైక్‌ను సీజ్ చేసి రవాణాశాఖకు అప్పగిస్తున్నారు. అక్కడ అధికారులు పత్రాలను పరిశీలించి రూ.5వేల నుంచి రూ.25వేల వరకు జరిమానా విధిస్తున్నారు. ఇది సామాన్యులకు ఇబ్బందిగా మారింది. ఉదాహరణకు కందుకూరు నుంచి ఒంగోలుకు బ్లడ్ ప్యాకెట్ కోసం బైక్‌పై వస్తుండగా మంగమూరు రోడ్డు జంక్షన్‌లో పోలీసులు తనిఖీ పేరుతో ఆపి సీజ్ చేశారు. దీంతో కందుకూరులో ఉన్న పేషెంటుకు సకాలంలో రక్తం చేరలేదు. ఇలాంటివి అనేక ఘటనలు ఉన్నాయి.

మాక్‌డ్రిల్

ఎస్పీ ఆదేశాల మేరకు అన్నీ నియోజకవర్గ కేంద్రాల్లో పోలీసులు మాక్‌డ్రిల్‌ను నిర్వహిస్తున్నారు. ముఖ్య కూడలిని ఎంచుకుని అక్కడ ర్యాలీలు, ధర్నాలు చేయడంతోపాటు రాళ్లు రువ్వడంలాంటి కవ్వింపు చర్యలు, అందుకు తీసుకునే చర్యలను ప్రజలకు అవగాహన కలిగేలా విధంగా పోలీసులు చేస్తున్నారు. అంతేకాకుండా ఫ్లాగ్‌మార్చ్ పేరుతో సమస్యాత్మక ప్రాంతాలలో పర్యటిస్తున్నారు.



ప్రభుత్వ హాస్టల్ పక్కన అధ్వానంగా ఉన్న మురుగుకాలువ

మద్దిపాడులో డ్రైనేజీ అస్తవ్యస్తం

పట్టించుకోని అధికారులు ● ఇబ్బందిపడుతున్న ప్రజలు

మద్దిపాడు, మే 23: మద్దిపాడు పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కాలువల్లో మురుగు నీరు ముందుకు కదలటం లేదు. అనేక చోట్ల డ్రైనేజీ కాలువలు మురుగునీటి కుంటలుగా తలపిస్తున్నాయి. బీసీ, ఎస్సీ, ముస్లింకాలనీల్లో సైడు కాలువలు లేకపోవడంతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. దీనికితోడు మురుగునీటి కాలువలపై అక్రమంగా నిర్మాణాలు కట్టడంతో మురుగునీటి పారుదలకు తీవ్ర అడ్డంకిగా మారుతోంది. గ్రామంలో ఎక్కడ చూసినా డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో మురుగు నీటి కాలువలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దీంతో దోమల బెడదతో ప్రజలు అల్లాడుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు నిధులు లేవని అధికారులు చేతులెత్తేశారు. దోమల తీవ్రత పెరిగి జనం రోగాలు బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మురుగు కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పాతసిండికేట్ బ్యాంకు వద్ద సైడుకాలువలో పెరిగిన జమ్ము



హాస్టల్ పక్కనే పేరుకున్న మురుగు

కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా

ముగిసేందుకు సహకరించాలి

● ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

ఎర్రగొండపాలెం, మే 23: జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో చిన్నచిన్న ఘటనలు మినహా ఈనెల 13న పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎస్పీ గరుడ్ సుమీత్ సునీల్ అన్నారు. జూన్ 4న నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగే విధంగా అన్ని రాజకీయపార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలన్నారు. ఎర్రగొండపాలెంలోని వైష్ణవి గార్డెన్స్ ఆవరణలో గురువారం సాయంత్రం అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులకు, కార్యకర్తలకు అవగాహన సభలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సంఘ విద్రోహులు అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నాలు చేస్తారని, మరికొంత కులమత పార్టీలను అడ్డుపెట్టు ఆలజడులు సృష్టిస్తారన్నారు. అటువంటి వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కేవలం ఒకరిద్దరు చేసే గొడవలకు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. గతంలో గ్రామాల్లో పోలీసులు ఎక్కువగా సంచరించేవారు కాదని, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రతి గ్రామంలో సంచరిస్తూ వాహనాలను తనిఖీ చేస్తున్నారని పేర్కొన్నారు. పోలింగ్ సమయంలో నియోజకవర్గంలోని పుల్లలచెరువు మండలం శతకోడు పోలింగ్ బూత్‌వద్ద ప్రజలు అల్లర్లకు పాల్పడి రాళ్లు రువ్వుకున్నారన్నారు. ఈ ఘటనపై 19 మందిని బైండోవర్ చేశామన్నారు. తహసీల్దారు ఎదుట రూ.లక్ష వంతున ప్రభుత్వానికి చలానా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. గతంలో ఇటువంటి నిబంధనలు ఉండేవి కావని, కేవలం బైండోవర్ మాత్రమే చేసేవారమన్నారు. ప్రస్తుతం చలానా రూపంలో చెల్లించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. బైండోవర్ అయిన వారి జాబితా తహసీల్దారు కార్యాలయం, పోలీసుస్టేషన్‌లలో ఉంటుందని తెలిపారు. మీ పొరుగు నియోజకవర్గంలో గొడవలు చేసి మీ గ్రామాల్లో ఆశ్రయం పొందినట్లు తెలిస్తే పోలీసుస్టేషన్‌కు ఫోన్‌చేయాలని కోరారు. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి విజయోత్సర్యాలీ నిర్వహించుకోవడానికి అధికారులు అనుమతి తీసుకోవాలని తెలిపారు. డీఎస్పీ బందోబస్తు ఏర్పాటు చేస్తారన్నారు. వాట్సాఫ్ గ్రూపుల్లో ఫేక్ పోస్టులు పెట్టేవారిపై కాకుండా గ్రూప్ అడ్మిన్‌లపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీలేఖ, డీఎస్పీ బాలసుందరరావు, సీఐలు రాములునాయక్, ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్.సుబ్బారావు, దాసరి ప్రసాదు, ఎస్ఐ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్

ఆగి ఉన్న బైకును ఢీకొన్న కారు

● ముగ్గురికి తీవ్రగాయాలు

కొనకనమిట్ల, మే 23 : కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే చింతగుంట్ల గ్రామానికి చెందిన చింతగుంట సాల్మన్, ఆయన కుమారుడు కిషోర్, సాల్మన్ బావమరిది బూదాల గురవయ్యలు బైక్‌పై చినారికట్ల గ్రామానికి వెళుతున్నారు. అయితే చినాకట్ల రైస్‌మిల్లు వద్ద చేరుకునే సరికి సాల్మన్‌కు ఫోన్ వచ్చింది. దీంతో బైక్ రహదారికి పక్కన ఆపి ఫోన్ మాట్లాడుతున్నారు. ఈ తరుణంలో కనిగిరి వైపు నుంచి పొదిలి వైపు వెళుతున్న కారు అదుపు తప్పి ఆగి ఉన్న బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న సాల్మన్, కిషోర్, గురవయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి 108 చేరుకొని క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ముగ్గురికి ప్రథమచికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

మాక్‌డ్రిల్‌తో ప్రజలకు అవగాహన



అల్లర్లను అదుపుచేస్తున్న పోలీసులు

ఎర్రగొండపాలెం, మే 23 : ఎర్రగొండపాలెం ప్రధాన కూడలిలో పోలీసులు నిర్వహించిన మాక్‌డ్రిల్ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఎర్రగొండపాలెంలోని అంబేడ్కర్‌కూడలిలో పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. గొడవలు చేసే వ్యక్తులపై లాఠీచార్జ్, ఫైరింగ్ ఆపరేషన్‌ను నిర్వహించారు. అల్లరి మూకలను అదుపు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ప్రధాన కూడలిలో ప్రజలు ఈ మాక్‌డ్రిల్‌ను ఉత్సాహంగా తిలకించారు. గొడవలు చేసే వ్యక్తులకు పోలీసు రియాక్షన్ ఏవిధంగా ఉంటుందో ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించారు. కార్యక్రమంలో సీఐ రాములునాయక్, ఎస్ఐ సుదర్శన్, మాక్‌డ్రిల్ పోలీసు పార్టీలు పాల్గొన్నాయి.

గిద్దలూరుటౌన్ : గిద్దలూరు పట్టణంలో గురువారం పోలీసు, అగ్నిమాపక శాఖలు సంయుక్తంగా మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. అసాంఘీక శక్తుల దాడుల నుంచి ఎదుర్కొనే సన్నివేశాలను ప్రజలకు చూపించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ అశోక్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల ముందు, తరువాత గానీ అల్లర్లు సృష్టించినా, హింసకు పాల్పడితే లాఠీచార్జ్, పొగ బాంబులు, రబ్బర్‌బులెట్లతో కాల్పులు ఉంటాయన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా చర్యలు తీసుకుంటా మన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లు, దాడులను ఈసీ తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు సహకరించాలని కోరారు.

ముమ్మరంగా కౌంటింగ్ ఏర్పాట్లు

● జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 23 : వచ్చేనెల 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపునకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్‌కుమార్ ఓట్ల లెక్కింపు కోసం చేపట్టిన పలు అంశాలను వివరించారు. జిల్లాలోని ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు కూడా ప్రతి సెగ్మెంట్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఒంగోలు నియోజకవర్గానికి ఏడు టేబుల్స్, ఇతర నియోజకవర్గాలకు ఐదు టేబుల్స్ వేస్తున్నట్లు చెప్పారు. ఒంగోలు లోక్‌సభ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ఒకే హాలులో 40 టేబుల్స్ వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫలితాలను ఎప్పటికప్పుడు ఎన్కోర్ వెబ్ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు దినేష్‌కుమార్ తెలిపారు. ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఈనెల 22న ర్యాండమైజేషన్ నిర్వహించామని, జూన్ 3వతేదీన రెండో ర్యాండమైజేషన్ నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ రోజున మూడో విడత ర్యాండమైజేషన్ నిర్వహించి వారు విధులు నిర్వహించే గదులను కేటాయిస్తామని వెల్లడించారు. అంతకుముందు ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఓట్ల లెక్కింపు కోసం తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీలత, జిల్లా ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



స్ట్రాంగ్‌రూం సీలును పరిశీలిస్తూ..

స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఈవీఎంల స్ట్రాంగ్‌రూం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం సాయంత్రం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం స్ట్రాంగ్ రూం సీలును పరిశీలించి రిజిస్టర్‌లో సంతకం చేశారు. అక్కడ పోలీస్ అధికారులతో మాట్లాడారు. నిరంతరం నిఘా కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌ను నెలవారీ వార్షిక తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట పలువురు అధికారులు ఉన్నారు.

నేటి నుంచి పాలిసెట్ అడ్మిషన్ల ప్రక్రియ

● 27నుంచి సర్టిఫికెట్లు పరిశీలన
● జూన్ 7న సీట్ల కేటాయింపు

ఒంగోలు(విద్య), మే 23: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్ అడ్మిషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 27నుంచి విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. వచ్చేనెల 7న విద్యార్థులకు వెబ్ కౌన్సెలింగ్ ఆధారంగా సీట్లు కేటాయింపు పూర్తవుతుంది. ఈ మేరకు గురువారం పాలిసెట్ అడ్మిషన్ల కన్వీనర్ సి.నాగరాణి అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. పాలిసెట్‌కు అర్హులైన విద్యార్థుల అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 పాలిసెట్ ఫీజును శుక్రవారం నుంచి జూన్ 2వతేదీ వరకు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రాసెసింగ్ ఫీజు రశీదు, పాలిసెట్ హాల్ టిక్కెట్, పాలిసెట్ ర్యాంకు కార్డు, పదో తరగతి లేదా తత్సమాన పరీక్ష మార్కుల మెమో, 4నుంచి 10వ తరగతుల స్టడీ సర్టిఫికెట్, రెసిడెన్సి సర్టిఫికెట్, అర్హులైన వారు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఆదాయ ధృవీకరణ పత్రాలు, టీసీ, ఇతర సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలి. పాలిసెట్ అడ్మిషన్లకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 27నుంచి హెల్ప్‌లైన్ సెంటర్లలో ప్రారంభమవుతుంది. ఈనెల 27న 1నుంచి 12వేల ర్యాంకు వరకు, 28న 12,001నుంచి 27వేలవరకు, 29న 27001 నుంచి 43వేల వరకు, 30న 43001 నుంచి 59వేల వరకు, 31వ తేదీన 59001నుంచి 75వేల ర్యాంకు వరకు, జూన్ 1న 75001 నుంచి 92వేల వరకు, 2న 92001 నుంచి 1,08,000 వరకు, 3న 1,08,001నుంచి చివరి ర్యాంకు వరకు అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. ప్రత్యేక కేటగిరీలకు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈనెల 31నుంచి జూన్3 వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన విద్యార్థులు ఈనెల 31నుంచి జూన్ 4 వరకు ఏ పాలిటెక్నిక్‌లో సీటు కావాలో వెబ్‌ఆప్షన్ పెట్టుకోవాలి. 7న సీట్ల కేటాయింపు జరుగుతుంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాలిటెక్నికలో సీటు వచ్చిన వారు రూ.4,700, ప్రైవేటు పాలిటెక్నిక్‌లో సీటు వచ్చిన వారు రూ.25 వేల ట్యూషన్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

రేపు టంగుటూరులో రామస్వామి తిరునాళ్ల

● ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

టంగుటూరు, మే 23 : టంగుటూరులో రామస్వామి తిరునాళ్ల ఈ నెల 25వ తేదీ జరగనుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ నిర్వాహకులు పూర్తి చేశారు. ఏటా ఏప్రిల్‌లో పౌర్ణమికి అటు ఇటు దగ్గరలోని శనివారం తిరునాళ్ల జరపడం ఆనవాయితీగా వస్తుంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈసారి కాస్త జాప్యం జరిగింది. స్థానిక ముదిరాజులు ఏడాదికాలం తమను, తమ కుటుంబాలను, వృత్తులను దీవిస్తున్నందుకు కృతజ్ఞతగా రాముల వారి తిరునాళ్ల జరుపుకుంటుంటారు.

తిరునాళ్ల పూర్వ చరిత్ర

గతంలో టంగుటూరులోని ముదిరాజుల కుటుంబాల్లోని యువకులు పదుల సంఖ్యలో చెన్నైలో చిరుద్యోగాల్లో ఉండేవారు. వీరంతా ఏటా ఏప్రిల్‌లో తిరిగి టంగుటూరు వచ్చే వారు. అదే సమయంలో మరి కొందరు వీరి స్థానాల్లో చెన్నై వెళ్లి ఆ ఉద్యోగాల్లో చేరేవారు. ఈవిధంగా ఒక బ్యాచ్ ఉద్యోగాల నుంచి తిరిగి రావడం, ఇదేసమయంలో మరొక బ్యాచ్ ఇవే ఉద్యోగాలకు వెళ్లి పోవడం చాలాకాలం కొనసాగింది. ఏడాదంతా తమను ఉద్యోగాల్లో కాపాడినందుకు, అలాగే కొత్తగా ఉద్యోగాలకు వెళ్లే వారికి దేవుడు అండగా ఉండాలని కోరుకుంటూ ఈ తిరునాళ్ల జరుపడం ఆనవాయితీగా వస్తుంది. అంతేగాక ముదిరాజుల ప్రధానవృత్తి చేపల వేట. వీరు సమీపంలోని పాలేరు, మూసిలో చేపల వేటకు వెళ్తుంటారు. ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా కాపాడినందుకు కృతజ్ఞతగా తిరునాళ్ల నిర్వహిస్తారు.

విశేషాలు

తిరునాళ్ల సమస్తం ముదిరాజుల గృహాల సముదాయంలోని రాములవారి దేవాలయం వేదికగా కొనసాగుతుంది. పూర్వం ఈదేవాలయం ఒక చిన్న పెంకుటింట్లో ఉండేది. 1984లో దాతల సహకారంతో ఈ దేవాలయాన్ని ఆధునీకరించారు. తిరునాళ్ల నాడు మధ్యాహ్నం 12గంటలకు దేవాలయంలో అఖండజ్యోతిని వెలిగిస్తారు. ఆ సమయానికి భక్తులు దేవాలయం వద్దకు చేరుకొని జ్యోతిని దర్శించుకుంటారు. ఈ జ్యోతి శనివారం రాత్రి గుమ్మటంలో ఊరేగింపుగా వెళ్లి దేవతా విగ్రహాలు తిరిగి దేవాలయానికి చేరుకునే వరకు వెలుగుతూనే ఉంటుంది. జ్యోతి వెలిగించాక వెంటనే కొబ్బరి కాయలు కొడతారు. దీనినే సూరకొట్టుడుగా పిలుస్తారు. రాత్రి 10గంటలప్రాంతంలో విద్యుత్ కాంతులతో అలంకరించిన గుమ్మటంలో రాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయులు విగ్రహాలుంచి ఊరేగిస్తారు. గుమ్మటం ముందు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. తిరునాళ్ల సందర్భంగా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈసారి కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు లేవు.



ముదిరాజుల కాలనీలోని రాములవారి దేవాలయం



రాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడుల మూలవిరాట్‌లు

అన్నమయ్య సంకీర్తనలు ఆధ్యాత్మిక శిఖరాలు

● ఘనంగా జయంతి వేడుకలు

ఒంగోలు(కల్చరల్), మే 23: కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరుని కీర్తిస్తూ తాళ్లపాక అన్నమాచార్య రచించిన సంకీర్తనలు ఆధ్యాత్మికరంగ ఉన్నత శిఖరాలని శ్రీఅన్నమాచార్య సంగీత, సాహిత్య సేవాసమితి అధ్యక్షుడు, ప్రముఖ గాయకుడు ఇనమనమెళ్లూరి మురళీకృష్ణ పేర్కొన్నారు. అన్నమయ్య 616వ జయంతి వేడుకలను గురువారం ఒంగోలు నగరం సంతపేటలోని సాయిబాబా మందిరంలో గల అన్నమాచార్య విగ్రహం వద్ద సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన అర్చకులు సుధాకరశర్మ యాజ్ఞీకంలో అన్నమాచార్యునికి షోడసోపచార పూజ చేశారు. అనంతరం మురళీకృష్ణ మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనలలో కేవలం భక్తిభావన మాత్రమే కాకుండా సామాజిక చైతన్యం సైతం ఉంటుందన్నారు. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే వంటి సంకీర్తనలు ఇందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. ప్రరసం అధ్యక్షుడు పొన్నూరి వేంకటశ్రీనివాసులు మాట్లాడుతూ సాక్షాత్తు శ్రీమహావిష్ణువు నందకమే అన్నమయ్యగా జన్మించి వేంకటేశ్వరుని 32 వేల సంకీర్తనలతో స్వరార్చన చేశారన్నారు. ప్రముఖ వైద్యులు రావిపాటి ప్రసాదరావు, ఆధ్యాత్మికవేత్త షైనంపాటి సాయికుమార్ మాట్లాడుతూ ప్రతి ఏడాది అన్నమయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆయన సంకీర్తనలను ప్రజలకు చేరువ చేస్తున్న మురళీకృష్ణ కృషి కొనియాడారు. సమితి ఆధ్వర్యంలో త్వరలో అన్నమాచార్య సంకీర్తనల ఉచిత శిక్షణా శిబిరం ప్రారంభించనున్నట్లు ఉపాధ్యక్షురాలు కె.త్రిపురసుందరి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో వీహెచ్‌పీ ఉపాధ్యక్షుడు జిల్లెళ్లమూడి వెంకటేశ్వర్లు, మా మూర్తి, పి.జానకిరాం, ఓవీప్రసాద్, మొవ్వా నాగేశ్వరరావు, గుర్రం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అన్నమయ్య పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : సీఐ



సింగరాయకొండలో అవగాహన కల్పిస్తున్న సీఐ రంగనాథ్



చీమకుర్తిలో మహిళలతో మాట్లాడుతున్న పోలీసులు

సింగరాయకొండ, మే 23 : రాజకీయ కక్షలు, విద్వేషాలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ దాచేపల్లి రంగనాథ్ హెచ్చరించారు. గురువారం స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి కందుకూరు రోడ్డు కూడలి వరకు పోలీస్ సిబ్బందితో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అనంతరం సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బాలయోగినగర్‌లో కార్డన్ సెర్చ్ చేశారు. సరైన పత్రాలులేని 13 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. సాయంత్రం కందుకూరు రోడ్డు సెంటర్‌లో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టంగుటూరు ఎస్సై పున్నయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కె.అగ్రహారంలో..

పొన్నలూరు (కొండపి): శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రజలు కూడా సహకరించాలని సీఐ పాండురంగారావు కోరారు. గురువారం ఉదయం మండలంలోని కె.అగ్రహారంలో జరిగిన కార్డన్ సెర్చ్‌లో ఆయన సర్కిల్ పరిధిలోని సిబ్బందితో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేని 26 మోటార్ సైకిళ్లను సీఐ స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు కృష్ణబాజీబాబు, బసవరాజు, రాజేష్ పాల్గొన్నారు.

చీమకుర్తి పట్టణంలో..

చీమకుర్తి : ఎన్నికల ఫలితాలు రానున్న వేళ శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు. చీమకుర్తి పట్టణంలోని ప్రధానమైన ప్రాంతాలలో రోజుకొకటి చొప్పున కార్డన్ అండ్ సెర్చ్ పేరిట విస్తృతస్థాయిలో తనిఖీలు చేపడుతూ అసాంఘీక శక్తులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.గురువారం పట్టణంలోని నెహ్రూనగర్‌లో సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ కృష్ణయ్యల పర్యవేక్షణలో తనిఖీలు జరిపారు. సూర్యానగర్‌లో మహిళలకు అవగాహన కల్పించారు. నేరచరిత్ర కలిగినవారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేశారు. ఎన్నికల ఫలితాలు రాబోయే ముందు, వచ్చిన తర్వాత ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పటం లక్ష్యంగా చీమకుర్తి పోలీసులు శ్రమిస్తున్నారు.

అవీ..ఇవీ..

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు(విద్య), మే 23: జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షకు మొత్తం 3,871మంది విద్యార్థులు హాజరవుతండగా వారి కోసం 22 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు జరుగుతాయి. పరీక్షల్లో కాపీయింగ్‌ను నిరోధించేందుకు నాలుగు ఫ్లయింగ్‌స్క్వాడ్లను నియమించారు. అన్ని పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలుతో పాటు ఆ పరిధిలోని జెరాక్స్ కంప్యూటర్ సెంటర్లను మూసివేస్తారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం పరీక్షా కేంద్రాలకు చేరవేసేందుకు వీలుగా ఆయా రూట్లలో ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడుపుతారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. పరీక్ష సమయంలో విద్యుత్‌కు అంతరాయం కలుగకుండా చూడాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

అక్రమంగా నీటిని తరలిస్తే చర్యలు : ఆర్డీవో

ఒంగోలు(కలెక్టరేట్), మే 23: ఒంగోలు నగర ప్రజలకు తాగునీటి అవసరాల కోసం రామతీర్థం జలాశయం నుంచి విడుదల చేసిన నీటిని అక్రమంగా ఎవరైనా తరలిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రామతీర్థం జలాశయం నుంచి ఒంగోలు సమ్మర్ స్టోరేజీతో పాటు ఇతర నోటిఫైడ్ ట్యాంకులను నింపేందుకు ఈనెల 22వతేదీన నీటిని విడుదల జరిగిందన్నారు. జలాశయం నుంచి వచ్చే నీరు తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించుకోవాలన్నారు. నిరంతరం పర్యవేక్షణతో ట్యాంకులు, చెరువులను నింపాలని ఆదేశించారు. అక్రమంగా నీటిని తరలిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

మద్దిపాడు, మే 23: మల్లవరం శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉత్సవమూర్తులకు విశేషపూజా కార్యక్రమాలు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. అర్చకులు వెంకటాచార్యులు, రాజశేఖర్‌ఆచార్యులు, కొండూరి శ్రీనివాసరాఘవ అయ్యంగార్ నేతృత్వంలో స్వామివారికి మోహిని అలంకరణ చేసి గ్రామోత్సవం చేపట్టారు. ఈవో నాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, మే 23: మోటార్‌సైకిల్ అదుపుతప్పి యువకునికి గాయాలైన సంఘటన ఏడుగుండ్లపాడు సమీపంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. చిన్నగంజాంకు చెందిన పి.శ్రీనివాసరావు మోటార్‌సైకిల్‌పై మేదరమెట్ల వెళ్తున్న క్రమంలో కారును అధిగమించబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఆయనకు గాయాలు కావడంతో ఒంగోలు ఆసుపత్రికి తరలించారు.

గరుడవాహనంపై వేణుగోపాలస్వామి విహారం

నాగులుప్పలపాడు, మే 23: ఉప్పుగుండూరు గ్రామంలో వెంచేసి ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నాలుగవ రోజు గురువారం మధ్యాహ్నం అర్చకులు శ్రీధర్‌బాబు మోహిని అమ్మవారి అలంకరణ చేసి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి గరుడవాహనంపై శ్రీమన్నారాయణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పురవీధుల్లో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థాన ఈవో మినిశెట్టి శ్రీనివాసరావు, చైర్మన్ పెంట్యాల శ్రీనివాసరావు, రంగయ్యపంతులు, సిబ్బంది వేణు, సుబ్బారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతమబుద్ధుని జయంతి

ఒంగోలు(కలెక్టరేట్), మే 23: ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని గాంధీనగర్‌లో గురువారం గౌతమబుద్ధుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. మూడుబొమ్మల సెంటర్ వద్ద ఉన్న గౌతమబుద్ధుడి విగ్రహానికి, అంబేడ్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇండిపెండెంట్ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం మాట్లాడుతూ మానవాళికి బుద్ధుడు బోధించిన మార్గాలను ప్రజలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ బుద్ధిస్ట్ నాగేశ్వరరావు, ఐఎల్‌పీ జిల్లా అధ్యక్షుడు కట్టా వరప్రసాద్, కార్యదర్శి డి.సంగీతరావు, వెంకటేశ్వర్లు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలపై సీఎం స్పందించాలి

ఒంగోలు(కలెక్టరేట్), మే 23: సార్వత్రిక ఎన్నికల రోజున రాష్ట్రంలో జరిగిన హింసాత్మక సంఘటనలపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు వాస్తవాలను చెప్పాలని హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మాచర్ల, చంద్రగిరి, తాడిపత్రిలలో జరిగిన ఘటనలు సాధారణమైనవి కాదన్నారు. పక్కా ప్రణాళిక ప్రకారం ఓడిపోతామనుకున్న చోట ప్రతిపక్ష నేతలను కొట్టడం, ఈవీఎంలను ధ్వంసం చేయడం అన్నీ ఎన్నికల రోజే జరిగాయన్నారు. ముఖ్యమంత్రి అవేమి పట్టించుకోకుండా లండన్ టూర్ వెళ్ళడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా సీఎం ఆ ఘటనలపై నోరు విప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

రేపు ఏపీపీఎస్సీ పరీక్షలు

ఒంగోలు(కలెక్టరేట్), మే 23: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పరీక్ష ఈనెల 25న నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన ఐదు కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఒంగోలులోని నేషనల కౌన్సిల్ ఫర్ చర్చి సోషల్ యాక్షన్ ఇండియా, ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కాలేజీ, పేస్ ఇంజనీరింగ్ కాలేజీ, పెద్దారవీడు మండలం దేవరాజుగుట్టలోని కృష్ణ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మార్కాపురం మండలం దరిమడుగులోని డాక్టర్ శామ్యూల్ జార్జి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులను ఉదయం 7.30నుంచి 8.15 గంటల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులకు గ్రేస్ పీరియడ్ కింద ఉదయం 8.30గంటల వరకు అనుమతి ఉంటుందని, తర్వాత వచ్చే వారిని ఎటువంటి పరిస్థితుల్లో అనుమతించబోమని డీఆర్వో స్పష్టం చేశారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

నాగులుప్పలపాడు, మే 23: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా ముగిశాయి. నాగులుప్పలపాడులోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఆరాధన మహోత్సవాలలో భాగంగా గురువారం శ్రీగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి కళ్యాణం వైభవంగా జరిగింది. అశేష భక్తజనం తరలివచ్చి స్వామి వారి కళ్యాణోత్సవం తిలకించారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో రథోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు. దేవస్థానం వద్ద హరికథలు, పురాణాలు, సినిమా, నాటిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

క్రీడా భారతి జిల్లా అధ్యక్షునిగా పత్తిపాటి

టంగుటూరు, మే 23 : క్రీడా భారతి జిల్లా అధ్యక్షునిగా పత్తిపాటి విజయకుమార్ ఎంపికయ్యారు. క్రీడా భారతి జిల్లా కమిటీ ఎన్నిక గురువారం టంగుటూరులో జరిగింది. ప్రధానకార్యదర్శిగా ఎల్ లావణ్య కోశాధికారిగా కె.రవి, ఉపాధ్యక్షులుగా ఎల్.వెంకట్రావు, పి.సురేష్, టి.రామ్మూర్తి, పి.అమృతరాజు, ఉపకార్యదర్శులుగా డి.గంగయ్య, టి.రవికుమార్, కురిచేటి వెంకట్రావు, జిల్లా కమిటీ సభ్యులుగా ఎం.ఉమామహేశ్వరరావు, పి.వెంకటరెడ్డి, ఎం.ధనలక్ష్మి, కె.కోటేశ్వరి, ఎం.మంజుల, డి.రాజు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ ఎంపికలో క్రీడాభారతి కమిటీ అబ్జర్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయరెడ్డి, తిరుపతి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సురేంద్రరెడ్డిలు పాల్గొన్నారు. ఈసందరకభంగా క్రీడాభారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని డివిజన్ల పరిధిలో క్రీడాభారతి కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.



నూతన కమిటీతో ధనుంజయరెడ్డి, సురేంద్రరెడ్డి

యోగాపై శిక్షణ

కొండపి, మే 23 : కొండపి గ్రంథాలయంలో చిన్నారులకు వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం యోగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యానికి యోగా తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు. యోగాతో మానసిక ఆనందంతోపాటు, శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. అనంతరం చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు.



యోగా చేస్తున్న చిన్నారులు



విచారిస్తున్న డీఎల్‌పీవో హనుమంతరావు

నిధుల దుర్వినియోగంపై విచారణ

ఇంకొల్లు, మే 23 : ఇంకొల్లు పంచాయతీలో రెండేళ్ల కిందట అప్పటి పంచాయతీ కార్యదర్శి మరియదాసు సంతకాన్ని సర్పంచ్ ఏజర్ల ప్రసన్న ఫోర్జరీ చేసి నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు వచ్చిన అభియోగంపై డీఎల్‌పీవో హనుమంతరావు గురువారం ఇంకొల్లులో విచారణ చేపట్టారు. అప్పటిలో కంప్యూటర్ ఆపరేటర్, సర్పంచ్ కుమ్మక్కై కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి బిల్లులు అప్‌లోడ్ చేసి నిధులను డ్రా చేసినట్లు 11వ వార్డు మెంబరు రావి మధు కూడా ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్ ఆఫ్ పంచాయతీరాజ్ ఆదేశాల మేరకు గురువారం డీఎల్‌పీవో విచారణ చేసారు. అప్పటి కార్యదర్శి మరియదాసు, గుమస్తా కృపాచారి, సర్పంచ్ ఏజర్ల ప్రసన్నను విచారించి వివరాలు సేకరించారు. అనంతరం పంచాయతీ కార్మికులు తమకు 3 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే ఇప్పించాలని డీఎల్‌పీవోకు విన్నవించారు. ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే చేపించాలని, కార్మికులకు 2 నెలల జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి కోటి నాగయ్యకు సూచించారు.

నర్సరీ పెంపకానికి లైసెన్సులు తీసుకోవాలి

మార్టూరు, మే 23 : ఈ ఏడాది కొత్తగా నర్సరీలను సాగు చేసే రైతులు తప్పనిసరిగా లైసెన్సులను తీసుకోవాలని ఉద్యాన అధికారి బీ హనుమంతనాయక్ గురువారం ప్రకటనలో కోరారు. మార్టూరు బల్లికురవ సంతమాగులూరు మండలాలలో నూతనంగా నర్సరీలను సాగు చేసే వారు లైసెన్సుల కోసం ఉద్యాన శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. అదేవిధంగా గతంలో నర్సరీలను నిర్వహించే రైతులు రిజిస్టర్లు, బిల్లులు, నారు అమ్మిన వారి వివరాలు, ట్రేలు వినియోగం తదితర వివరాలతో తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. అంతేగాకుండా ఈ నిబంధనలను పాటించాలని గురువారం మార్టూరులోని పలువురు నర్సరీ యజమానులకు హనుమంత నాయక్ నోటీసులను జారీ చేశారు.

ప్రమాదవశాత్తు యువకుడి మృతి

పంగులూరు, మే 23 : పంగులూరుకు చెందిన రమేష్(22) అనే యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో బీసీ కాలనీలో విషాదం నెలకుంది. గ్రామానికి చెందిన రమేష్ అనే యువకుడు హైదరాబాద్‌లో యాక్సిస్ బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం కూకట్‌పల్లి నుంచి మెట్రోలో విధులకు వెళ్తూ ట్రైన్ దిగే సమయంలో ప్రమాదానికి గురై మృతి చెందినట్లు సమాచారం. రమేష్ మృతదేహాన్ని గురువారం పంగులూరుకు తీసుకొచ్చారు.

యువకునికి గాయాలు

పంగులూరులో దాసరి రాంబాబు అనే యువకుడు గ్రామంలో పెయింటింగ్ పని చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సీ కాలనీకి చెందిన చెందిన దాసరి రాంబాబు గురువారం గ్రామంలో ఓ ఇంటికి పెయింటింగ్ వేస్తూ ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. గాయపడిన రాంబాబును కుటుంబ సభ్యులు ఒంగోలుకు తరలించారు.



మాట్లాడుతున్న కొండయ్య

ప్రణాళికాబద్ధంగా పనిచేద్దాం

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య

చీరాల, మే 23 : విజయావకాశాలు పుష్కలంగా మనకే ఉన్నాయి. ఫలితాల అనంతరం ప్రణాళికాబద్ధంగా పనిచేద్దాం. సమిష్టి కార్యాచరణ తో సత్ఫలితాలు సాధిద్దామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే ఎంఎం కొండ య్య అన్నారు. టీడీపీ కార్యాలయంలో గురువారం ముఖ్యనాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కొండయ్య మాట్లాడారు. ఫలితాల అనంతరం పట్టణంలోని, గ్రామాల్లోను అన్ని వార్డుల్లో పర్యటిస్తామన్నా రు. ఆ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణ, అమలుకు సంబంధించి ని ర్దిష్ట అడుగులు వేద్దామన్నారు. గెలుపు మనదేనని నాయకులు కొండయ్యను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు గుద్దంటి చంద్రమౌ ళి, గవిని నారాయణ, జంగిలి రామారావు, గుర్రం వెంకటేశ్వర్లు, లక్ష్మి, నరశింహారావు, వెంగళ భరత్, సజ్జా వెంకట సుబ్బారావు, అవ్వారు సాం బయ్య, తేలప్రోలు నాగేశ్వరరావు, నిమ్మల పిచ్చయ్య, కౌతవరపు జనార్ధనరావు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివార్ల కల్యాణ మహోత్సవం

చెరుకూరు(పర్చూరు), మే 23: పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ అగస్తేశ్వరస్వామి వార్ల వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన స్వామివార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణతో, పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తుల నడుమ కల్యాణ తంతు కనులపండువగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలయ కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.నాగయ్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేదపండితులు



మాట్లాడుతున్న డీఐవో వెంకటేశ్వర్లు

వైద్య వివరాలను వందశాతం నమోదు చేయాలి

అద్దంకిటౌన్, మే 23 : పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న అన్ని వైద్య వివరాలను సంబంధిత పోర్టల్‌లో వంద శాతం నమోదు చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ (డీఐవో) టీ వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం స్థానిక గీతామందిర్‌లో అద్దంకి మోదేపల్లి పీహెచ్‌సీ, అద్దంకి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని హెల్త్ సిబ్బందికి హెల్త్ మేనేజిమెంట్ హెల్త్ సిస్టమ్ (హెచ్‌ఎంఐఎస్) పోర్టల్‌లో వివరాల నమోదు పక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఐవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వానికి వివరాలు పంపించడంలో ఈ హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. దీనిలో చేసిన మార్పులను గుర్తించి తెలుసుకుని వైద్య సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు.జిల్లా గణాంకాధికారి (డీఎస్‌వో) పి.వేణు మాట్లాడుతూ హెచ్‌ఎంఐఎస్ పోర్టలలో పలు మార్పులు చేయడం జరిగిందని వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సీహెచ్‌వోలు ఎన్.మల్లికార్జునరావు, డీ నాగేశ్వరరావు, డాక్టర్ శ్రీ హర్ష, డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..!

» దర్శిలో విజయావకాశాలు కూటమికేనా?

» చెబుతున్న రాజకీయ విశ్లేషకులు

దర్శి, మే 23: దర్శి అసెంబ్లీలో గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. విజయావకాశాలు టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి దక్కుతాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పోలింగ్ జరిగిన తీరు, టీడీపీ కూటమికి వీచిన అనుకూల పవనాలు, అభ్యర్థి కుటుంబనేపథ్యం కలిసి వచ్చే అంశాలుగా విశ్లేషకులు పరిగణిస్తున్నారు. దర్శి నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 90.91శాతం పోలింగ్ నమోదయింది. వైసీపీ ప్రభుత్వం మీద వ్యతిరేకతతో కసిగా వైసీపీని ఓడించాలన్న లక్ష్యంతో ప్రజలు ఓట్లు వేసి ఉంటారని భావిస్తున్నారు. 2019 ఎన్నికల పోలింగ్‌ను విశ్లేషిస్తే ఈవిషయం స్పష్టమవుతుంది. ఆ ఎన్నికల్లో కూడా సుమారు 91శాతం పోలింగ్ నమోదయింది. అత్యధిక శాతం పోలింగ్ నమోదు కావటంతో ఎవరికి వారు తమకు అనుకూలమని భావించినప్పటికి ఆఎన్నికల్లో వైసీపీ అత్యధిక మెజారిటీతో గెలుపొందింది. అప్పటి టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారన్న విషయం స్పష్టమైంది.

ప్రస్తుతం సీన్ రిపీట్ అయింది. ఈ ఎన్నికల్లో ప్రజలు అంతే కసిగా వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా టీడీపీ కూటమి అభ్యర్థికి ఓటు వేసి ఉంటారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈసారి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలో దిగటంతో కలిసి వస్తుందని విశ్లేషిస్తున్నారు. 2014 ఎన్నికల్లో కూడా ఈ మూడు పార్టీలు కలిశాయి. అప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు కూడా ఆ మూడు పార్టీలు కలవటంతో ప్రజలు కూటమి వైపు మొగ్గుచూపారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కుటుంబ నేపథ్యం కూడా బాగా కలిసివచ్చింది. ఆమె తాత దివంగత మాజీమంత్రి గొట్టిపాటి హనుమంతరావు మంత్రిగా, జడ్పీచైర్మన్‌గా, ఎమ్మెల్యేగా ప్రజలకు నిస్వార్థ సేవలు అందించారు. 40 సంవత్సరాల సుదీర్ఘరాజకీయ చరిత్రలో నీతి, నిజాతీయాలకు మారు పేరుగా, మచ్చలేని నాయకుడిగా జిల్లా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. డొట్టిపాటి లక్ష్మి తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే నరసయ్య రెండు దఫాలు ఎమ్మెల్యే నిస్వార్థ సేవలు అందించారు. వారివురు దర్శి నియోజకవర్గ ప్రజలకు సుపరిచితులు. వారి హయాంలో చేసిన అభివృద్ధి పనులు, ఎత్తిపోతల పథకాలు ఇప్పటికీ గుర్తున్నాయి. గొట్టిపాటి లక్ష్మి చిన్నాన్న, అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్ గత 20 ఏళ్లగా ఎమ్మెల్యేగా పనిచేస్తూ వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. ఆయన ఆప్రాంత ప్రజలకు నిస్వార్థ సేవలు అందిస్తున్నారు. ఉద్దండులైన నాయకుల వారసురాలిగా గొట్టిపాటి లక్ష్మి రాజకీయాల్లోకి వచ్చి పోటీ చేయటంతో దర్శి నియోజకవర్గ ప్రజలు ఆమెను విశేషంగా ఆదరించారు. మాతాత, మాతండ్రి వారసురాలిగా నిస్వార్థ సేవలు అందించి వారి పేరు నిలబెడతానని, దర్శి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని గొట్టిపాటి లక్ష్మి స్పష్టంగా చెప్పటంతో ప్రజలు ఆమెను విశ్వసించి అత్యధిక శాతంఓట్లు వేసి ఉంటారని విశ్లేషకులు భావిస్తున్నారు. అన్ని కోణాల్లో ఆమెకు అనుకూల పవనాలు కన్పిస్తుండటంతో ఆమె విజయం తథ్యమని కూటమి శ్రేణులు కూడా ధీమా వ్యక్తం చేస్తున్నరు. అదే సమయంలో వైసీపీ కూడా గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తుంది.

కొండెక్కిన కూరగాయల ధరలు

» మంట పుట్టిస్తున్న మిర్చి

» నోరెళ్ల బెడుతున్న సామాన్య, మధ్య తరగతి ప్రజలు



పచ్చి మిర్చి



మార్కెట్‌లో విక్రయాలకు సిద్ధంగా ఉన్న కూరగాయలు

దొనకొండ, మే 23: మార్కెట్లో కూరగాయలు ధరలు కొండెక్కాయి. మిర్చి మంట పుట్టిస్తోంది. దాదాపు అన్నిరకాల కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే, పెరిగిన కూరగాయల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. ప్రస్తుతం మిర్చి రూ.వంద పలుకుతూ సెంచరీ దాటు తుంది. మిగిలిన కూరగాయలు సహితం కిలో రూ.60 వరకు పలుకుతూ పేద ప్రజలు కొనలేక నోరెళ్ల బెట్టే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు చూసి సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతూ ఏం కొనలేని, తినలేని పరిస్థితులు ఎదురయ్యాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద కుటుంబాలు మాత్రమే కాకుండా, చిరుద్యోగులు, ప్రైవేట్ కొలువులు చేసే మధ్యతరగతి వాళ్లకూ విపరీతంగా పెరిగిన ధరలు భారంగా మారాయి.

దొనకొండకు ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవటంవల్ల ధరలు మరింత భారంగా మారాయి. గతంలో రూ.వంద ఖర్చు పెడితే సంచి నిండా కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం మూడురెట్లు పెరిగి రూ.300 వరకు వెచ్చించాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ధరలు నియంత్రించాలి

- ఎఫ్రాయిమ్(నాని), దొనకొండ

మార్కెట్‌లోకి కూరగాయలు కొనడానికి వెళ్లాలంటే భయమేస్తుంది. పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలు కూరగాయలు కొనలేక పచ్చడి మెతుకులు తినాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. అధికారులు స్పందించి కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు పేద ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా వెంటనే నియంత్రించాలి.

రైతన్నలకు అందని భరోసా

● ఆర్‌బీకేలలో కొన్ని నెలలుగా అందుబాటులో లేని సిబ్బంది

● సాగుకు సిద్ధమవుతున్నా రైతన్నకు అందని భరోసా

మార్కాపురం రూరల్, మే 23: రైతుకు అన్ని విధాల అండగా ఉంటాం. అని ప్రభుత్వం ప్రకటిస్తున్నా.., గ్రామాల్లో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. తొలకరి వర్షాలు పడి రైతన్నలు తమ భూములను సాగు చేసుకునేందుకు సమాయత్తం చేసుకుంటున్నారు. ఇలాంటి కీలక సమయంలోనూ గ్రామాల్లోని ఆర్‌బీకే లలో సిబ్బంది కనిపించడం లేదు.మండలంలోని బొడపాడు, రాయవరం, మాల్య వంతునిపాడు, గజ్జలకొండ గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాలలో గ్రామస్థాయి వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బొడపాడులో రైతు భరోసా కేంద్రం అద్దెరేకుల ఇంట్లో ఏర్పాటు చేశారు. కానీ సుమా రు రెండు మూడు నెలలుగా కేంద్రానికి తాళాలు కూడా తీయలేదని గ్రామస్తు లు తెలిపారు. దరిమడుగులో వ్యవసా య సహాయులు అందుబాటులో లేకపోవడంతో గేట్లు కూడా తీయలేదు. దీంతో పాటు మాల్యవంతునిపాడు, రాయవరం, గజ్జలకొండ గ్రామాలలో కూడా గ్రామ సహాయకులు అందుబాటులో లేక ఇతర గ్రామాల్లో పనిచేస్తున్న వారిని ఇన్‌చార్జులుగా నియమించారు. వారు కూడా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు అప్పుడప్పుడు చుట్టం చూపులా వచ్చి పోతున్నారే గాని రైతులకు అందు బాటులో ఉండడం లేదు. మండలం లో 20 ఆర్‌బీకేలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ వాటిలో ప్రస్తుతం ఒకటి రెండు చోట్ల మాత్రమే అధికారులు అందుబాటులో ఉంటున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి రైతులు భూములను దుక్కు లు దున్నుకొని వ్యవసాయానికి సమాయత్తం చేసుకుంటున్నారు. ఏ పొలంలో ఏ పంట వేయాలనే సలహా లు తీసుకునేందుకు ఆర్‌బీకేలకు వెళ్లి తెలుసుకోవాలనుకుంటే అక్కడ ఎవరు ఉండటం లేదని రైతులు అంటున్నారు.

ఈ ఏడాది భూసార పరీక్షలు కూడా చేయడం లేదు. భూసార పరీక్షలు నిర్వహించి ఏ పంట వేస్తే రైతులకు అధిక దిగుబడులు వస్తాయో ఆ వివరాలను అధికారులు తెలియజేయాలి. కానీ ఈ సంవత్సరం భూసార పరీక్షలు కూడా వ్యవసాయ అధికారులు చేయడం లేదని రైతులు పేర్కొంటు న్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలు కేవలం అలంకార ప్రాయంగా మాత్రమే ఉన్నాయని వాటి వలన రైతులకు ఎటువంటి ఉపయోగం లేదని రైతన్నలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి తిరునాళ్ల

వేలాదిగా తరలివచ్చిన భక్తులు



కల్యాణాన్ని నిర్వహిస్తున్న దంపతులు, హాజరైన భక్తజనం

పావులూరు(ఇంకొల్లు), మే 23 : మండలంలోని శ్రీ పొలిమేర వీరాంజనేయస్వామి 70వ వార్షిక జయంతి మహోత్సవాలు మూడు రోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. చివరి రోజు గురువారం శ్రీ సువర్చలా సహిత శ్రీ వీరాంజనేయ స్వామి వారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. దంపతులు పీటలమీద కూర్చొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని చూసేందుకు మండుటెండను లెక్క చేయకుండా మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లి స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం పలు స్వచ్ఛంద సేవా సంస్థలు మజ్జిగ, తాగు నీరు, అన్నదానం ఏర్పాటు చేశారు. తిరునాళ్లకు చుట్టుపక్కల మండలాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి సన్నిధిలో విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్‌కు సమస్యలు తలెత్తకుండా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరావు తెలిపారు.

కమనీయం లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామి కల్యాణోత్సవం

వేటపాలెం(చీరాల), మే 23 : మండల పరిధిలోని రామన్నపేటలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల కల్యాణ మహోత్సవం గురువారం శాస్త్రోక్తంగా అత్యంత వైభవంగా జరిగింది. పసుపు, కంకుమ వితరణ జరిగింది. కల్యాణ మహోత్సవంలో పృధ్వీ చెంచుసుబ్బారావు, నాగవేణి దంపతులు పీటల మీద కూర్చుని కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, సుజాత దంపతులు పాల్గొని స్వామివారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలను బహూకరించారు. కల్యాణ క్రతవు అనంతరం సుమారు 1800 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. అనంతరం శ్రీ విఘ్నేశ్వర కనక నాగారపమ్మ కోలాట భక్త సమాజం వారిచే కోలాట ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో బులసల సాంబశివరావు, రామలింగం, లక్ష్మీప్రసాదరావు, జడ్పీటీసీ సభ్యుడు బండ్ల తిరుమలాదేవి, బండ్ల బాబు, గమ్మడి సుశీల, పేరిసెట్ల పద్మజ, పిచ్చుక సునీత, సజ్జా రాజ్యలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు బండ్ల సురేంద్రబాబు, ఉమామహేశ్వరరావు, దేవన కిషోర్, బోనసల కిషోర్, బట్టా సురేంద్ర, కర్ల కుమారస్వామి, ఉమ్మిడి భద్రయ్య, సోమశేఖరరావు, వెంకటేశ్వర్లు, బాలసుబ్రమణ్యం, లవకుమార్, యలమందేశ్వరరావు, తులసి బాబు, రామలక్ష్మి, విజయపర్వత రెడ్డి, రేణుక, మాధవి, ప్రసన్నలక్ష్మి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వామి



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో లక్ష తమలపాకుల పూజ

అద్దంకిటౌన్, మే 23: శింగరకొండ ప్రసన్నాంజనేయల స్వామివారికి గురువారం పౌర్ణమి సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నాంజనేయ స్వామికి లక్ష తమలపూలతో ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు (ఇన్‌సెట్లో) మృతురాలు శిరీష

ఘోర రోడ్డు ప్రమాదం

● కనిగిరికి చెందిన వివాహిత మృతి

● అపస్మారక స్థితిలో ఆమె భర్త

● తెనాలికి చెందిన యువకులకు తీవ్ర గాయాలు

వేటపాలెం(చీరాలటౌన్), మే 23 : చీరాల - వేటపాలెం మధ్యలో గల పందిళ్లపల్లి జాతీయ రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వీరిలో కనిగిరికి చెందిన వివాహిత మృతి చెందింది. వివరాల్లోకి వెళితే ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన మన్నేపల్లి టెండూల్కర్ కనిగిరి వెలుగు కార్యాలయంలో రైతు మిత్ర కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. అతని భార్య శిరీష(30)తో బాపట్లలోని బంధువుల ఇంటికి శుభ కార్యానికి వచ్చారు. అనంతరం గురువారం మధ్యాహ్నం కారులో భార్యాభర్తలు వెళుతున్నారు. అదే సమయంలో తెనాలికి చెందిన బాబ్జీ, విజయ్, అనేష్, భరత్, రఘు కారులో రామాపురం సముద్రతీరానికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈ రెండు కార్లు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. దీంతో శిరీష అక్కడిక్కడే మృతిచెందగా, భర్త అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఎదురు కారులోని బాబ్జీ కాలు విరిగింది. మిగిలిన వారికి స్వల్ప రక్త గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించగా బాబ్జీకి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. వేటపాలెం ఎస్‌ఐ సురేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హోమం వద్ద పూజలుచేస్తున్న అర్చకులు

గుంటిగంగలో చండీ హోమం

తాళ్లూరు, మే 23: పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటిగంగ ఆలయ సన్నిధిలో దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం చండీ హోమం నిర్వహించా రు. గుంటూరుకు చెందిన ప్రసిద్ధ అర్చకస్వాములు వంగర శ్రీకాంత్ శర్మ, నడింపల్లి వాసుదేవశర్మ ఆ ధ్వర్యంలో అర్చకస్వాము ల మంత్రోచ్ఛా ణల మధ్య అత్యంత వైభ వంగా చండీ హోమాన్ని నిర్వహించారు. విశేష పూజలు, గణపతి పూజలు నిర్వహించారు. చండీహోమం, లఘుపూర్ణాహుతి, నివేదన, హారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు చండీహోమం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈ వో పి.కార్తిక్, ఆలయకమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, పూజారులు కామేశ్వరశర్మ, ప్రకాశ్ పంతులు, మాజీ చైర్మన్ కటకంశెట్టి శ్రీను, నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షుడు యల్లమందారెడ్డి, స్వామి డాక్టర్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గురుబ్రహ్మం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దొనకొండలో వడగండ్ల వాన

దొనకొండ, మే 23: మండలం లో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. గత నాలుగు నెలలుగా మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగం టి బోర్లల్లో నీరు అందక ప్రజలు తీ వ్ర మంచినీటి ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఇటీవల అడపా దడపా కురిసిన కొద్దిపాటి వర్షాల తో బోర్లలో నీరు చేరితే తమకు మంచినీటి ఇబ్బందులు తొలగుతా యని ప్రజలు భావిస్తున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు

పీసీపల్లి, మే 23: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని కనిగిరి సీఐ దాసరి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని పోతవరం గ్రామంలో గురువారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పోలీసు సిబ్బందితో కలిసి ఇల్లిల్లూ తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని తొమ్మిది ద్విచక్ర వాహనాలను సీజ్‌చేసి పీసీపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఆయన మాట్లాడుతూ ఘర్షణలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై రౌడీషీట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

● ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

గిద్దలూరు, మే 23 : రాచర్ల మండలం గుడిమెట్ట చెరువు నుంచి అక్రమంగా ఇటుక బట్టీల కోసం మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఇరిగేషన్ అధికారులు పట్టుకొని కేసు నమోదు చేశారు. రాచర్ల, కొమరోలు మండలాల్లో చెరువుల్లోని మట్టిని అక్రమార్కులు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వైనం గురించి 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ఇరిగేషన్‌శాఖ అధికారులు గుడిమెట్ట చెరువు వద్దకు వెళ్లగా రెండు ట్రాక్టర్లు చెరువు మట్టితో వెళుతుండడం గమనించి పట్టుకొని కేసు నమోదు చేశారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

● సీఐ మల్లికార్జున్‌రావు


మాట్లాడుతున్న సీఐ

పొదిలి, మే 23 : కౌంటింగ్ సందర్భంగా మండలంలో సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదిలి సర్కిల్ పరిధిలోని పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు మండలాల్లో జూన్ 4వతేదీన కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడవద్దని సూచించారు. ఏ పార్టీ వారైనా గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని అలా కాదని అల్లర్లకు పాల్పడితే చట్టపరంగా కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సర్కిల్ పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండలంలో ఎక్కడ ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతులు లేవన్నారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. ఇప్పటికే మండల నాయకులు, కార్యకర్తలను పిలిచి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈసమావేశంలో ఎస్‌ఐ కోటయ్య ఉన్నారు.

రాజ్యలక్ష్మి కాలనీలో కార్డన్ సెర్చ్


కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ ఆవుల వెంకటేశ్వర్లు

మార్కాపురం, మే 23: పట్టణంలోని పెద్దనాగులవరం రోడ్డులోని రాజ్యలక్ష్మి కాలనీలో మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో గురువారం పట్టణ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి వాహనపత్రాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకపోవడంతో 15 ద్విచక్రవాహనాలను సీజ్ చేసి ఎంవీఐ అధికారులకు అప్పగించారు. అంతేకాక ఆ ప్రాంతంలోని చెడునడత కలిగిన వాళ్లు, స్టేషన్‌లో పలు షీట్‌లు ఉన్నవారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనుమానస్పద వ్యక్తులు ఎవరు ఆ ప్రాంతంలో సంచరించినా వెంటనే పట్టణ పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ, గ్రామీణ ఎస్సైలు అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్వర్లు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్‌లో వాహనాలు సీజ్


కార్డెన్ సెర్చ్‌లో పట్టుబడిన వాహనాలు

కంభం, మే 23 : జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కంభం సీఐ రామకోటయ్య ఆధ్వర్యంలో కంభం, అర్ధవీడు మండలాల్లోని సమస్యాత్మక ప్రాంతాల్లో, కాలనీలలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గురువారం ఉదయం కందులాపురం కాలనీలో సీఐ రామకోటయ్య ఆధ్వర్యంలో సెర్చ్ నిర్వహించినట్లు ఎస్సై పులి రాజేష్ తెలిపారు. సరైన ధ్రువ పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కార్డన్‌సెర్చ్‌లో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

తర్లుపాడు, మే 23: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని పొదిలి సీఐ మల్లికార్జున అన్నారు. మండలంలోని కేతగుడిపిలో కార్డన్‌సెర్చ్ అండ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. క్షణికావేశంలో జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు. ఈ సందర్భంగా గుర్తింపులేని వాహనాలను స్వాధీనం చేసుకుని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తర్లుపాడు ఎస్ఐ వేముల సుధాకర్, ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి, పోలీసు సిబ్బది పాల్గొన్నారు.

అర్బన్‌కాలనీలో కార్డన్ సెర్చ్


కార్డన్‌సెర్చ్‌లో పట్టుబడిన వాహనాలు

గిద్దలూరు టౌన్, మే 23 : పట్టణంలోని పలు ప్రాంతాలలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అర్బన్ సీఐ వి.సోమయ్య ఆధ్వర్యంలో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. పలు ద్విచక్ర వాహనాలకు ధ్రువపత్రాలు లేని కారణంగా పోలీసుస్టేషన్‌కు తరలించారు. సరైన పత్రాలు చూపించి వారి వాహనాలను తీసుకెళ్లవచ్చని సీఐ సోమయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నాయుడు, ఏఎస్సై రంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగి ఉన్న బైకును ఢీకొన్న కారు

● ముగ్గురికి తీవ్రగాయాలు


రోడ్డుప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

కొనకనమిట్ల, మే 23 : కారు మోటర్‌బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే చింతగుంట్ల గ్రామానికి చెందిన చింతగుంట సాల్మన్, ఆయన కుమారుడు కిషోర్, సాల్మన్ బావమరిది బూదాల గురవయ్యలు మోటర్‌బైక్‌పై చినారికట్ల గ్రామానికి వెళుతున్నారు. అయితే చినాకట్ల రైస్‌మిల్లు వద్ద చేరుకునే సరికి సాల్మన్‌కు ఫోన్ వచ్చింది. దీంతో మోటర్ బైక్ రహదారికి పక్కన బైక్ ఆపి ఫోన్ మాట్లాడుతున్నారు. ఈ తరుణంలో కనిగిరి వైపు నుంచి పొదిలి వైపు వెళుతున్న కారు అదుపు తప్పి ఆగి ఉన్న మోటర్‌బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటర్‌బైక్‌పై ఉన్న సాల్మన్, కిషోర్, గురవయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి 108 చేరుకొని క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ముగ్గురికి ప్రథమచికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రైతన్నలకు అందని భరోసా

● ఆర్‌బీకేలలో కొన్ని నెలలుగా అందుబాటులో లేని సిబ్బంది ● సాగుకు సిద్ధమవుతున్న రైతన్నకు అందని సహకారం


దరిమడుగులో మూతపడిన రైతు భరోసా కేంద్రం

మార్కాపురం రూరల్, మే 23: రైతుకు అన్ని విధాల అండగా ఉంటాం. అని ప్రభుత్వం ప్రకటిస్తున్నా.., గ్రామాల్లో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. తొలకరి వర్షాలు పడి రైతన్నలు తమ భూములను సాగు చేసుకునేందుకు సమాయత్తం చేసుకుంటున్నారు. ఇలాంటి కీలక సమయంలోనూ గ్రామాల్లోని ఆర్‌బీకే లలో సిబ్బంది కనిపించడం లేదు.

మండలంలోని బోడపాడు, రాయవరం, మాల్యవంతునిపాడు, గజ్జలకొండ గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాలలో గ్రామస్థాయి వ్యవ సాయ శాఖ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బోడపాడులో రైతు భరోసా కేంద్రం అద్దెరేకుల ఇంట్లో ఏర్పాటు చేశారు. కానీ సుమారు రెండు మూడు నెలలుగా కేంద్రానికి తాళాలు కూడా తీయలేదని గ్రామస్థులు తెలిపారు. దరిమడుగులో వ్యవసాయ సహాయులు అందుబాటులో లేకపోవడంతో గేట్లు కూడా తీయలేదు. దీంతో పాటు మాల్యవంతునిపాడు, రాయవరం, గజ్జలకొండ గ్రామాలలో కూడా గ్రామ సహాయకులు అందుబాటులో లేక ఇతర గ్రామాల్లో పనిచేస్తున్న వారిని ఇన్‌చార్జులుగా నియమించారు. వారు కూడా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు అప్పుడప్పుడు చుట్టం చూపులా వచ్చి పోతున్నారే గాని రైతులకు అందుబాటులో ఉండడం లేదు. మండలం లో 20 ఆర్‌బీకేలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ వాటిలో ప్రస్తుతం ఒకటి రెండు చోట్ల మాత్రమే అధికారులు అందుబాటులో ఉంటున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి రైతులు భూములను దుక్కు లు దున్నుకొని వ్యవసాయానికి సమాయత్తం చేసుకుంటున్నారు. ఏ పొలంలో ఏ పంట వేయాలనే సలహాలు తీసుకునేందుకు ఆర్‌బీకేలకు వెళ్లి తెలుసు కోవాలనుకుంటే అక్కడ ఎవరు ఉండటం లేదని రైతులు అంటున్నారు.

ఈ ఏడాది భూసార పరీక్షలు కూడా చేయడం లేదు. భూసార పరీక్షలు నిర్వహించి ఏ పంట వేస్తే రైతులకు అధిక దిగుబడులు వస్తాయో ఆ వివరాలను అధికారులు తెలియజేయాలి. కానీ ఈ సంవత్సరం భూసార పరీక్షలు కూడా వ్యవసాయ అధికారులు చేయడం లేదని రైతులు పేర్కొంటున్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలు కేవలం అలంకార ప్రాయంగా మాత్రమే ఉన్నాయని వాటి వలన రైతులకు ఎటువంటి ఉపయోగం లేదని రైతన్నలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు సేవలందిస్తున్నాం

మండలంలో మొత్తం 20 రైతుభరోసా కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలో వ్యవసాయ సంబంధిత శాఖ అధికారులను నియమించి సేవ లందిస్తున్నామన్నారు. బోడపాడు, మాల్యవంతుని పాడు, గజ్జలకొండ, రాయవరం రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ శాఖ సిబ్బంది అందు బాటులో లేకపోవడంతో మరొకచోట నుంచి ఇన్‌చార్జులను నియమించాం. వారు రైతులకు వ్యవసాయశాఖ సేవలు కొనసాగిస్తున్నారు. **వ్యవసాయాధికారి శ్రీనివాసులు**

వైశాఖ పౌర్ణమి సందర్భంగా పూజలు


త్రిపురాంతకంలో అమ్మవారికి పూజలు

త్రిపురాంతకం, మే 23: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రాల నడుమ త్రిపురాంతకేశ్వరునికి లక్షబిల్వార్చన, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయాల ప్రధానార్చకులు విశ్వన్నారాయణశాస్త్రి, పాలంక ప్రసాదశర్మలు భక్తులకు తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గరుడ ఉత్సవం

గిద్దలూరు : పట్టణంలోని కొండపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తిరునాళ్ల, బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండవరోజు గురువారం స్వామి వారికి గరుడ ఉత్సవం, ఊంజల్ సేవ నిర్వహించారు. నియోజకవర్గ దేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో భరత నాట్య ప్రదర్శన నిర్వహించగా పలువురిని అలరించింది. భరతనాట్య ప్రదర్శనకు హాజరైన మహిళలకు పట్టుకుంటే పట్టుచీర కార్యక్రమంలో భాగంగా లక్కీడిప్ ద్వారా 20 మందికి చీరలు అందచేశారు.


విశేష అలకరణలో విఘ్నేశ్వరుడు

పెద్దదోర్నాల :దోర్నాలలోని శ్రీ విజయ గణపతి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవ వేడుకలను గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు మూర్తి, మణిశర్మ గణేశునికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు విశేషంగా హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. సాయంత్రం గణపతి ఉత్సవవిగ్రహాన్ని రథంపై ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటి పెద్దలు బీవీఎల్ ప్రసాద్, ప్రసన్న, మొగిలి సుబ్బారావు, పీ రామారావు, బొగ్గరపు రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా సత్యదేవుని రథోత్సవం

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలోని 9వ వార్డులో వెలసిన శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అర్చకులు గౌరిశంకర శర్మ మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యదేవుని ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ పుష్పాలతో అలంకరించి రథంపై ఆశీనులను చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బాసాని సుధాకర్, కార్యదర్శి సుబ్బారావు, సహాయ కార్యదర్శులు నూనె రామిరెడ్డి, ఉమామహేశ్వరరావు, కోశాధికారి కామిశెట్టి సుధాకర్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఎరిక్షన్‌బాబు గెలుపుకోసం పాదయాత్ర


పాదయాత్రను ప్రారంభిస్తున్న ముసలయ్య

త్రిపురాంతకం, మే 23: ఎర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు గెలుపు ను కాంక్షిస్తూ మండలంలోని రామసముద్రం ఎస్సీ కాలనీకి చెందిన పరిశపోగు ముసలయ్య ఆధ్వర్యంలో పలువురు టీడీపీ కార్యకర్తలు నాగార్జునసాగర్‌లోని మేరీమాత గుడికి పాదయాత్ర చేపట్టారు. స్థానిక నాయకుల ఆధ్వ ర్యంలో గురువారం పాదయాత్రను ప్రారంభించగా మండల నాయకులు మల్లెల అల్లూరిరెడ్డి, ఎం.వలరాజు, సీహెచ్.ఆదినారాయణరెడ్డి కార్యకర్తలు వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఎరిక్షన్‌బాబుతోపాటు రాష్ట్రంలోని కూటమి అభ్యర్థులందరూ మంచి మెజారీటీతో గెలవాలని చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, రాష్ట్రం అభివృద్ధి బాటలో సాగాలని ఆకాంక్షించారు.

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం నియోజకవర్గం ఎమ్మెల్యేగా గూడూరి ఎరిక్షన్‌బాబు విజయం సాధించాలని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పదవి వరించాలని త్రిపురాంతకం మండలం రామసముద్రం గ్రామ టీడీపీ కార్యకర్త పరిపోగు ముసలయ్య గురువారం నాగార్జునసాగర్ మేరిమేత గుడి వరకు 95 కి.మీ పాదయాత్ర చేపట్టారు. గురువారం సాయంత్రం ఎర్రగొండపాలెం చేరుకున్న సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. ముసలయ్యను సన్మానించారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు(విద్య), మే 23: జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీ క్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షకు మొత్తం 3,871మంది విద్యార్థులు హాజరువుతండగా వారి కోసం 22 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశా రు. పరీక్షలు ఉదయం 9.30నుంచి మ ధ్యాహ్నం 12.45గంటల వరకు జరుగుతాయి. పరీక్షల్లో కాపీయింగ్‌ను నిరోధించేందుకు నాలుగు ఫ్లయింగ్‌స్కాడ్లను నియ మించారు. అన్ని పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలుతో పాటు ఆ పరిధిలోని జెరాక్స్, కంప్యూటర్ సెంటర్లను మూసివేస్తారు. పరీక్షా కేంద్రాల్లోకి సె ల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం పరీక్షా కేంద్రాలకు చేరవేసేందుకు వీలుగా ఆయా రూట్లలో ప్రత్యేకంగా ఆ ర్టీసీ బస్సులను నడుపుతారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. పరీక్ష సమయంలో విద్యుత్‌కు అంతరాయం కలుగకుండా చూడాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తిచేస్తాం

ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



మాట్లాడుతున్న ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్

ఎర్రగొండపాలెం, మే 23 : జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో చిన్న చిన్న ఘటనలు మినహా ఈ నెల 13న పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎస్పీ గరుడ్ సుమీత్ సునీల్ అన్నారు. జూన్ 4న నిర్వహించే కౌంటింగ్ పక్రియ ప్రశాంతంగా జరిగే విధంగా అన్ని రాజకీయపార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలన్నారు. ఎర్రగొండపాలెంలోని వైష్ణవి గార్డెన్స్ ఆవరణలో గురువారం సాయంత్రం అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులకు, కార్యకర్తలకు అవగాహన సభలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సంఘ విద్రోహులు అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నాలు చేస్తారని, మరికొంత కులమత పార్టీలను అడ్డుపెట్టు అలజడులు సృష్టిస్తారన్నారు. అటువంటి వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కేవలం ఒకరిద్దరు చేసే గొడవలకు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. గతంలో గ్రామాల్లో పోలీసులు ఎక్కువగా సంచరించేవారుకాదని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రతి గ్రామంలో సంచరిస్తూ వాహనాలను తనిఖీ చేస్తున్నారని అన్నారు. పోలింగ్ సమయంలో ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లలచెరువు మండలం శతకోడు పోలింగ్ బూత్‌వద్ద ప్రజలు అల్లర్లకు పాల్పడి రాళ్ల రువ్వుకున్నారన్నారు. ఈ ఘటనపై 19 మందిని బైండోవర్ చేశామన్నారు. తహసీల్దారు ఎదుట 1లక్ష వంతున ప్రభుత్వానికి చలానా చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. గతంలో ఇటువంటి నిబంధనలు ఉండేవి కావని, కేవలం బైండోవర్ మాత్రమే చేసేవారమని అన్నారు. ప్రస్తుతం చలానా రూపంలో చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. బైండోవర్ అయిన వారి జాబితా తహసీల్దారు కార్యాలయం, పోలీసుస్టేషన్‌లలో ఉంటుందని తెలిపారు. మీ పొరుగు నియోజకవర్గంలో గొడవలు చేసి మీ గ్రామాల్లో ఆశ్రయం పొందినట్లు తెలిస్తే పోలీసుస్టేషన్‌కు పోన్‌చేయాలని తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి విజయోత్సర్యాలీ నిర్వహించుకోవడానికి అధికారులు అనుమతి తీసుకోవాలని తెలిపారు. డీఎస్పీ బందోబస్తు ఏర్పాటు చేస్తారని అన్నా రు. వాట్సాప్ గ్రూపుల్లో ఫేక్ పోస్టులు పెట్టేవారిపైకాకుండా గ్రూప్ అడ్మిన్‌లపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీలేఖ, డీఎస్పీ బాలసుందరరావు, సీఐలు రాములునాయక్, ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్ సుబ్బారావు, దాసరి ప్రసాదు, ఎస్.ఐ సుదర్శన్, వివిధ రాజకీయపార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్‌తో ప్రజలకు అవగాహన

ఎర్రగొండపాలెం, మే 23 : ఎర్రగొండపాలెం ప్రధాన కూడలిలో పోలీసులు నిర్వహించిన మాక్‌డ్రిల్ ప్రజలు ఆసక్తిగ తిలకించారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. గొడవలు చేసే వ్యక్తులపై లాఠీచార్జ్, ఫైరింగ్ ఆపరేషన్‌ను నిర్వహించారు. అల్లరి మూకలను అదుపు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ప్రధాన కూడలిలో ప్రజలు ఈ మాక్‌డ్రిల్‌ను ఉత్సాహంగా తిలకించారు. గొడవలు చేసే వ్యక్తులకు పోలీసు రియాక్షన్ ఏవిధంగా ఉంటుందో ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించారు. కార్యక్రమంలో స్థానిక సీఐ రాములు నాయక్, ఎస్.ఐ సుదర్శన్, మాక్‌డ్రిల్ పోలీసు పార్టీలు పాల్గొన్నాయి.


అల్లర్లను అదుపుచేస్తున్న పోలీసులు

గిద్దలూరులో..

గిద్దలూరు టౌన్ : పట్టణంలో గురువారం పోలీసు, అగ్నిమాపక శాఖలు సంయుక్తంగా మాక్‌డ్రిల్‌ను నిర్వ హించారు. అసాంఘీక శక్తుల దాడుల నుంచి ఎదుర్కొనే సన్నివేశాలను ప్రజలకు చూపించారు. అలాగే ప్రజలు కూడా తమను తాము రక్షించుకునే చర్యలపై అవగాహన కల్పించారు. ఏఎస్పీ అశోక్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలు అగ్నిమాపక సిబ్బందితో మాక్‌డ్రిల్ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ అశోక్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల ముందు, తరువాత గానీ అల్లర్లు సృష్టించినా, హింసకు పాల్పడితే లాఠీచార్జ్ పొగ బాంబులు, రబ్బర్ బులెట్లు, కాల్పులు ఉంటాయన్నారు. మాక్‌డ్రిల్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా చర్యలు తీసుకుంటా మన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లు, దాడులను ఈసీ తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో భాగంగా గాలిలోకి రబ్బరు బుల్లెట్లు కాలుస్తున్న పోలీసులు

అవీ..ఇవీ..

నజీర్‌హుస్సేన్‌కు డాక్టరేట్



గిద్దలూరు, మే 23 : గిద్దలూరులోని 108 అంబులెన్స్‌లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న అల్లూరు నజీర్‌హుస్సేన్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటి పిహెచ్‌డి డాక్టరేట్‌ను మంజూరు చేసింది. వొకేషనల్ కాంపిటెన్స్ టీచర్ సెల్ఫ్ ఎఫికెసి ఇన్ రిలేషన్ టు ద వెల్బీయింగ్ ఆఫ్ ప్రి సర్వీస్ టీచర్స్ అనే అంశంపై నజీర్‌హుస్సేన్ పిహెచ్‌డి చేయగా నాగార్జున యూనివర్సిటి డాక్టరేట్‌ను మంజూరు చేసింది. ఆంధ్ర లయోలా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ఎం.ఎస్తేర్‌సునీల గైడ్‌గా వ్యవహరించినట్లు నజీర్‌హుస్సేన్ పేర్కొన్నారు.

రఫీకి చంద్రబాబునాయుడి ప్రశంస



కంభం, మే 23 : గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాలలో టీడీపీ అభ్యర్థులు ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిల గెలుపు కోసం కృషి చేసిన కంభం మండల ఎన్‌ఆర్‌ఐ విభాగం బాధ్యులు సయ్యద్ రఫీని టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అభినందించారు. ఆ మేరకు రఫీని అభినందిస్తూ, ఒక లేఖ రాశారు. టీడీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం సభ్యులు కూడా రఫీని అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

పరిశుభ్రతను ప్రతి ఒక్కరు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న కమిషనర్

పొదిలి, మే 23 : పరిశుభ్రతను ప్రతిఒక్కరూ పాటించాలని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. వ్యాపార సముదాయాలు, నివాస గృహాల వారు ఎవరైనా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన కోరారు. వ్యాపారులు, నివాసగృహాలవారు చెత్తను బజార్లో పడవేయకుండా చెత్త బండిలోనే వేయాలన్నారు. గురువారం పెద్దబస్టాండ్ నుంచి చిన్నబస్టాండ్ వరకు ప్రతిషాపు, ఇళ్లవద్దకు వెళ్లి స్వయంగా పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా కాలువల్లో చెత్తచెదారం వేయకుండా చూడాలన్నారు. పొదిలి మంచి నగరపంచాయతీగా తీర్చిదిద్దే అవకాశం కల్పించాలని అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

కౌంటింగ్ ఏజెంట్ల పాస్‌లకు దరఖాస్తు చేసుకోవాలి


అభ్యర్థులకు సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి రాహుల్‌మీనా

మార్కాపురం, మే 23: సార్వత్రికల ఎన్నికలకు సంబంధించి జూన్ 4న ఒంగోలులో జరిగే కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే ఏజెంట్లకు సంబంధించి సబ్ కలెక్టర్ కార్యాలయంలో పాసులకు దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం మార్కాపురం అసెంబ్లీ బరిలో నిలిచిన అభ్యర్థులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్వో రాహుల్‌మీనా మాట్లాడుతూ ఒంగోలులోని రైజ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలోకి పాస్‌లు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తామన్నారు. ప్రతి అభ్యర్థి ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. ముఖ్యంగా కౌంటింగ్ కేంద్రం వద్ద ఎలాటి గొడవలు, ఘర్షణలు చోటుచేసుకున్నా చట్టపరంగా కఠినచర్యలు ఉంటాయన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుంది కాబట్టి చిన్నపాటి ఘటనకు పాల్పడినా తెలిసిపోతుందన్నారు. ప్రతి అభ్యర్థి నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల సహాయ అధికారి రవికుమార్, పలు పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్లు పాల్గొన్నారు.

కార్మికుల ఉపాధిని దెబ్బతీసే నిర్ణయాలు వద్దు


డీటీకి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పొదిలి, మే 23 : సివిల్ సప్లయ్ గోడౌన్‌లో పనిచేస్తున్న కార్మికులను దెబ్బతీసే నిర్ణయాలు పున ః పరిశీలించాలని సీఐటీయూ జిల్లాకార్యదర్శి సభ్యుడు రమేష్ అన్నారు. గురువారం స్థానిక సివిల్ సప్లయ్ గోడౌన్, తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. జిల్లాలో పౌరసరఫరాలకు సంబంధించి పొదిలి ఎంఎల్ఎస్ పాయింట్ 1979 నుంచి 2018 వరకు అద్దె గదుల్లో కొనసాగిందన్నారు. 2019 ప్రభుత్వ నిధులతో నిర్మించి సొంత గోడౌన్‌లోకి మార్చారన్నారు. ఈ స్టాక్ పాయింట్ పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాలోని 91 చౌకధరల దుఖాణాలకు రేషన్ సరుకులు సరఫరా చేస్తారు. ఈ పాయింట్ వద్ద పనిచేస్తూ, 20 మంది కార్మికులు 30 సంవత్సరాలుగా జీవిస్తున్నారు. గతంలో ఈ పాయింట్‌ను ఎత్తెయాలని అధికారులు ప్రతిపాదించగా జిల్లాకు నడికేంద్రంగా ఉండటం నాలుగు నెలల క్రితమే సొంత భవనంలోకి మారడం కార్మికుల జీవనాధారమైన ఉపాధిని కాపాడాలని కార్మికులు కోరడంతో కొనసాగించారు. అయితే 91 షాపులలో మర్రిపూడి, పొదిలిలోని 18 షాపులను చీమకుర్తికి, కొనకనమిట్ల, పొదిలి మండలంలోని 24 షాపులను కనిగిరికి, కొనకనమిట్లలోని 19 షాపులను మార్కాపురం ఎంఎల్ఎస్ పాయింట్‌కు కేటాయించారు. దీంతో కార్మికులు జీవనోపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక కొత్తగా నిర్మించిన ఈ భవనాన్ని కొనసాగించాలని, కార్మికులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. అనంతరం తహసీల్దార్‌కు గోడౌన్ డీటీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు కాకర్ల వెంకటయ్య, శేషయ్య, హరిష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మ తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ తల్లి

దర్శి, మే 23: దర్శి పట్టణంలో అంకాలమ్మ తిరునాళ్ల ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. ఈసందర్భంగా అమ్మవారికి వేద పండితులు అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పొంగించి అమ్మ వారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


ప్రత్యేక అలంకరణలో మారెళ్ళలోని అంకాలమ్మ తల్లి

మారెళ్లలో.. ముండ్లమూరు, మే 23: మండలంలోని మారెళ్ళ గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత అంకాలమ్మ 61వ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది మే 3వ వారంలో అమ్మవారి జాతర రావటం ఆనవాయితీ. జాతరకు రెండు రోజుల ముందే పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. చివరి రోజు అమ్మవారికి భక్తులు పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని పెద్ద ఎత్తున సమర్పిస్తుంటారు. తమ కోర్కెలు తీర్చాలంటూ దేవాలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అంకాలమ్మ తల్లిని వేడుకుంటారు. ఉదయం గ్రామానికి చెందిన భక్తులందరూ వక్క పొద్దులు ఉండి ఊరేగింపుగా కలశాలను తీసుకొని జలాన్ని తీసుకువచ్చి అమ్మవారికి సమర్పిస్తారు. అక్కడి నుంచి భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యాన్ని ఆలయ పూజారులు కల్పిస్తారు.

అమ్మవారు మహిమ గల తల్లి కావటంతో మారెళ్ళతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, విజయవాడ, గుంటూరు, వినుకొండ, అద్దంకి, దర్శి, ముండ్లమూరు, తాళ్ళూరు ప్రాంతాల నుంచే కాక మారెళ్ళలో పుట్టి పెరిగి హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు ప్రాంతాల్లో ఉంటున్న భక్తులు కూడా వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పాటు ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో తీర్చిదిద్దారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దొనకొండ, మే 23: స్థానిక శ్రీగౌతమి డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల అడ్మిన్ నాని తెలిపారు. బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. పూర్తి వివరాలకు 8333905099 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీఎస్‌పురం(పామూరు), మే 23: పామూరు, సీఎస్‌పురం 132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ జిలాని బాషా ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారు సహకరించాలని కోరారు.

కరువు ప్రాంతంగా వెలిగండ్ల

వెలిగండ్ల, మే 23: గత రబీ సీజన్‌లో వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో వెలిగండ్ల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించినట్టు ఏడీఏ వెంకట రమణ తెలిపారు గురువారం మండలంలోని హుస్సేన్‌పురం రైతు భరోసా కేంద్రంలో రైతులు, వ్యవసాయ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట నష్టపోయిన రైతుల ధ్రువపత్రాలు స్థానిక వ్యవసాయ సిబ్బందికి అందజేయాలన్నారు. రబీ సీజన్‌లో ఈక్రాప్ నమోదు చేసుకున్నా రైతులు మాత్రమే అర్హులని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రంగాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నారాయణ స్వామి వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో నారాయణ స్వామి

ముండ్లమూరు, మే 23 : మండలంలోని తూర్పుకంభంపాడు గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవతామూర్తి నారాయణ స్వామి 8వ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. గ్రామంలోని భక్తులు ఉదయాన్నే తలంటు స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంతో పాటు నూజెండ్లపల్లి, సుంకరవారి పాలెం, భట్లపల్లి, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు వచ్చి తమ కుటుంబాన్ని చల్లగా చూడాలంటూ వేడుకున్నారు. ఆలయం భక్తులతో పోటెత్తింది.

గ్రామానికి చెందిన ఉన్నం ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఉన్నం నరసింహారావు, ఉన్నం రామాంజనేయులు సోదరులు గ్రామంలో ఉన్న రూ.కోటి 30 లక్షలు విలువ చేసే భూమిని గ్రామంలోని దేవాలయాలకు రాసి ఇవ్వటం వారి గొప్ప మనసుకు నిదర్శనమని టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం రాత్రి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో పుట్టి పెరిగి ఉన్నత శిఖరాలకు చేరుకొని విజయవాడలో ఉంటున్న నరసింహారావు సోదరులు గ్రామానికి మేలు చేయాలనే ఉద్దేశంతో కోట్ల రూపాయల విలువ చేసే భూములను గ్రామ దేవతలకు ఇవ్వటం వారి మంచి మనస్సుకు నిదర్శనమన్నారు. గతంలో వారి ట్రస్ట్ ద్వారా దర్శి నియోజక వర్గ ప్రాంత ప్రజలకు వేల మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించటం హర్షించదగ్గ విషయమన్నారు.

పుట్టి పెరిగిన గ్రామాన్ని మరచిపోకుండా సేవా దాతృత్వం కలిగి ఉండటం మంచి విషయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సోమేపల్లి శ్రీనివాసరావు, మానం నరసింహారావు, చాగంటి హనుమంతరావు, రాంబాబు, గోరంట్ల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురంలో.. సీఎస్‌పురం(పామూరు), మే 23: సీఎస్‌పురం మండలం తూర్పుకంభంపాడు గ్రామంలోని శ్రీనారాయణస్వామి వారి 9వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారి కైంకర్యములకు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని శేషగిరిరావు ఆహ్వానం మేరకు మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థాన వంశస్థులు, వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, వెంకట్రావును ఆచారం ప్రకారం ఆలయ అర్చకులు కొమ్మినేని నాగేశ్వరరావు చేతులమీదుగా పూజలు చేయించారు. కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులకు స్వామివార్ల తీర్థప్రసాదాలు పంపిణీచేశారు.

నేటినుంచి పాలిసెట్ అడ్మిషన్ల ప్రక్రియ

- 27నుంచి సర్టిఫికెట్ల పరిశీలన
- జూన్ 7న సీట్ల కేటాయింపు

ఒంగోలు(విద్య), మే 23: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్ అడ్మిషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 27నుంచి విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. వచ్చేనెల 7న విద్యార్థులకు వెబ్ కౌన్సిలింగ్ ఆధారంగా సీట్లు కేటాయింపు పూర్తవుతుంది. ఈ మేరకు గురువారం పాలిసెట్ అడ్మిషన్ల కన్వీనర్ సి.నాగరాణి అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. పాలిసెట్‌కు అర్హులైన విద్యార్థుల అడ్మిషన్ల కౌన్సిలింగ్‌లో పాల్గొనేందుకు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 పాలిసెట్ ఫీజును శుక్రవారం నుంచి జూన్ 2వతేదీ వరకు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రాసెసింగ్ ఫీజు రశీదు, పాలిసెట్ హాల్ టిక్కెట్, పాలిసెట్ ర్యాంకు కార్డు, పదో తరగతి లేదా తత్సమాన పరీక్ష మార్కుల మెమో, 4నుంచి 10వ తరగతుల స్టడీ సర్టిఫికెట్, రెసిడెన్సీ సర్టిఫికెట్, అర్హులైన వారు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఆదాయ ధృవీకరణ పత్రాలు, టీసీ, ఇతర సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలి. పాలిసెట్ అడ్మిషన్లకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 27నుంచి హెల్ప్‌లైన్ సెంటర్లలో ప్రారంభమవుతుంది.

ఈనెల 27న 1నుంచి 12వేల ర్యాంకు వరకు, 28న 12,001నుంచి 27 వేలవరకు, 29న 27001 నుంచి 43వేల వరకు, 30న 43001నుంచి 59వేల వరకు, 31వ తేదీన 59001నుంచి 75వేల ర్యాంకు వరకు, జూన్ 1న 75001 నుంచి 92వేల వరకు, 2న 92001 నుంచి 1,08,000 వరకు, 3న 1,08,001నుంచి చివరి ర్యాంకు వరకు అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. ప్రత్యేక కేటగిరిలకు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెకినక్‌లో ఈనెల 31నుంచి జూన్3 వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. ఈ కేటగిరిల్లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన విద్యార్థులు ఈనెల 31నుంచి జూన్ 4 వరకు తమకు ఏ పాలిటెక్నిక్‌లో సీటు కావాలో వెబ్‌ఆప్షన్ పెట్టుకోవాలి. జూన్ 7న అభ్యర్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుంది.

ప్రభుత్వ, ఎయిడెడ్ పాలిటెక్నిక్‌లో సీటు వచ్చిన వారు రూ.4,700, ప్రైవేటు పాలిటెక్నిక్‌లో సీటు వచ్చిన వారు రూ.25వేల ట్యూషన్ ఫీజు చెల్లించాలని అడ్మిషన్ల కన్వీనర్ పేర్కొన్నారు.

'నుచ్చుపొద'కు నీటి కష్టాలు

- అసంపూర్తిగా పథకం
- పట్టించుకోని అధికారులు
- గ్రామస్థులకు తప్పని ఇబ్బందులు


విద్యుత్ సౌకర్యంలేక నిరుపయోగంగా ఉన్న బోరు


సాగర్ వాటర్ కోసం నిర్మించిన సంప్

పామూరు, మే, 23: గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు నేషనల్ రూరల్ డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు పథకం కింద మంజూరైన నీటి పథకాలు పాలకుల అలసత్వంతో వృథాగా పడిఉన్నాయి. పామూరు మండలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో తొమ్మిది గ్రామాల్లో మంచినీటి పథకాల నిర్మాణాలకు రూ.1.73 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మండలంలో నుచ్చుపొదకు రూ.రెండు లక్షల 23వేలు, పాబోలువారి పల్లికి రూ.22 లక్షలు, బొట్లగూడూరుకు రూ.18 లక్షలు, రేణిమడుగుకు రూ.28 లక్షలు, బసిరెడ్డి పల్లికి రూ.16 లక్షలు, గుమ్మలంపాడుకు రూ.16 లక్షలు, సట్టుమడుగుకు రూ.12 లక్షలు, పడమట కట్టకిందపల్లికి రూ.23 లక్షలు, మీరాపురానికి రూ.16 లక్షల నిధులు విడుదలయ్యాయి. ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించి, బోర్లు వేసి పైప్‌లైన్ ద్వారా ఇంటింటికి కొళాయిలు ఏర్పాటుచేసి రక్షిత నీటిని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూపకల్పన చేసింది.

మిగతా గ్రామాల్లో నీటి పథకాలు పూర్తి చేసినప్పటికీ నుచ్చుపొద గ్రామంలో మాత్రం వినియోగంలోకి రాలేదు. ఓవర్‌హెడ్ ట్యాంకు, సాగర్ నీటి కోసం నీటి సంప్ నిర్మాణం, పైప్‌లైన్ పనులు పూర్తిచేశారు. విద్యుత్ మీటర్ కోసం కనెక్షన్ ఏర్పాటు చేయకుండా, గ్రామపంచాయతికి నీటి పథకాన్ని అప్పగించకుండా కాంట్రాక్టర్ వెళ్లిపోయాడు. దాంతో సాగర్ నీరు వదిలినప్పుడు సంపు నుంచి ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీరును ఎక్కించడానికి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో పథకం దిష్టిబొమ్మలా దర్శనమిస్తుంది. విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయడంలో అటు పాలకులు, ఇటు పంచాయతి అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబించడంతో ఓవర్‌హెడ్ ట్యాంకు వినియోగంలోకి రాకుండా వృథాగా పడిఉంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, మోటారు ఏర్పాటుతో పాటు నీటి పథకం నిర్వహణకు సిబ్బందిని నియమించి నీటి కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించలేదు

- కె.రామకృష్ణ, గ్రామ వార్డు మెంబర్



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నీటి పథకానికి సంబంధించిన పనులు అధికారుల నిర్లక్ష్యంతో అసంపూర్తిగా మిగిలింది. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చినా స్పందించేవారే కరువయ్యారు.


నుచ్చుపొదలో వృథాగా ఉన్న ఓవర్‌హెడ్‌ట్యాంక్

నీటి పథకం ఉన్నా ఉపయోగంలేదు

- తాతపూడి రూతమ్మ, ఎస్సీ పాలెం



ఓవర్ హెడ్ ద్వారా ఇంటింటికి నీళ్ల వస్తాయని ఎంతో ఆశపడ్డాం. వైసీపీ ప్రభుత్వంలో కేవలం విద్యుత్ కనెక్షన్, మోటారు ఏర్పాటు చేయలేకపోయారు. దాంతో నీటి కష్టాలు ఎదుర్కొంటున్నాం.

కొండెక్కిన కూరగాయల ధరలు

- మంట పుట్టిస్తున్న మిర్చి
- నోరెళ్ల బెడుతున్న సామాన్య, మధ్య తరగతి ప్రజలు


పచ్చి మిర్చి

దొనకొండ, మే 23: మార్కెట్లో కూరగాయలు ధరలు కొండెక్కాయి. మిర్చి మంట పుట్టిస్తోంది. దాదాపు అన్నిరకాల కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే, పెరిగిన కూరగాయల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. ప్రస్తుతం మిర్చి రూ.వంద పలుకుతూ సెంచరీ దాటు తుంది. మిగిలిన కూరగాయలు సహితం కిలో రూ.60 వరకు పలుకుతూ పేద ప్రజలు కొనలేక నోరెళ్ళ బెట్టే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు చూసి సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతూ ఏం కొనలేని, తినలేని పరిస్థితులు ఎదురయ్యాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద కుటుంబాలు మాత్రమే కాకుండా, చిరుద్యోగులు, ప్రైవేట్ కొలువులు చేసే మధ్యతరగతి వాళ్లకూ విపరీతంగా పెరిగిన ధరలు భారంగా మారాయి.


మార్కెట్‌లో విక్రయాలకు సిద్ధంగా ఉన్న కూరగాయలు

దొనకొండకు ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవటంవల్ల ధరలు మరింత భారంగా మారాయి. గతంలో రూ.వంద ఖర్చు పెడితే సంచి నిండా కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం మూడురెట్లు పెరిగి రూ.300 వరకు వెచ్చించాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరలు నియంత్రించాలి

- ఎఫ్రాయిమ్(నాని), దొనకొండ



మార్కెట్‌లోకి కూరగాయలు కొనడానికి వెళ్లాలంటే భయమేస్తుంది. పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలు కూరగాయలు కొనలేక పచ్చడి మెతుకులు తినాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. అధికారులు స్పందించి కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు పేద ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా వెంటనే నియంత్రించాలి.

ముమ్మరంగా కౌంటింగ్‌కు ఏర్పాట్లు

ఒంగోలు(కలెక్టరేట్), మే 23 : వచ్చేనెల 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపునకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికా రైన కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ని ర్వహించారు. ఈ సందర్భంగా దినేష్‌కుమార్ ఓట్ల లెక్కింపు కోసం చేపట్టిన పలు అంశాలను వివరి ంచారు. జిల్లాలోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు కూడా ప్రతి సెగ్మెంట్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఒంగోలు నియోజకవర్గా నికి ఏడు టేబుల్స్, ఇతర నియోజకవర్గాలకు ఐదు టేబుల్స్ వేస్తున్నట్లు చెప్పారు.

ఒంగోలు లోక్‌సభ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ఒకే హాలులో 40 టేబుల్స్ వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫలితాలను ఎప్పటికప్పుడు ఎన్కోర్ వెబ్ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు దినేష్‌కుమార్ తెలిపారు. ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే సిబ్బం దికి ఈనెల 22న ర్యాండమైజేషన్ నిర్వహించామని, జూన్ 3వతేదీన రెండో ర్యాండమైజేషన్ నిర్వహి స్తామన్నారు. కౌంటింగ్ రోజున మూడో విడత ర్యా ండమైజేషన్ నిర్వహించి వారు విధులు నిర్వహించే గదులను కేటాయిస్తామని వెల్లడించారు. అంతకు ముందు ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఓట్ల లెక్కింపు కోసం తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీలత, జిల్లా ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇ తర అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశా లలోని ఈవీఎంల స్ట్రాంగ్‌రూం, ఓట్ల లెక్కింపు కేం ద్రాలను కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం సాయం త్రం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

అనం తరం స్ట్రాంగ్ రూం సీలును పరిశీలించి రిజిస్టర్‌లో సంతకం చేశారు. అక్కడ పోలీస్ అధికారులతో మా ట్లాడారు. నిరంతరం నిఘా కొనసాగే విధంగా చ ర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముం దు మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌ను నెలవా రీ వార్షిక తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట పలువురు అధికారులు ఉన్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..!

- దర్శిలో విజయావకాశాలు కూటమికేనా?
- ఔనంటున్న రాజకీయ విశ్లేషకులు

దర్శి, మే 23: దర్శి అసెంబ్లీలో గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. విజయావకాశాలు టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి దక్కుతాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పోలింగ్ జరిగిన తీరు, టీడీపీ కూటమికి వీచిన అనుకూల పవనాలు, అభ్యర్థి కుటుంబనేపథ్యం కలిసి వచ్చే అంశాలుగా విశ్లేషకులు పరిగణిస్తున్నారు. దర్శి నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 90.91శాతం పోలింగ్ నమోదయింది. వైసీపీ ప్రభుత్వం మీద వ్యతిరేకతతో కసిగా వైసీపీని ఓడించాలన్న లక్ష్యంతో ప్రజలు ఓట్లు వేసి ఉంటారని భావిస్తున్నారు. 2019 ఎన్నికల పోలింగ్‌ను విశ్లేషిస్తే ఈవిషయం స్పష్టమవుతుంది. ఆ ఎన్నికల్లో కూడా సుమారు 91శాతం పోలింగ్ నమోదయింది. అత్యధిక శాతం పోలింగ్ నమోదు కావటంతో ఎవరికి వారు తమకు అనుకూలమని భావించినప్పటికి ఆఎన్నికల్లో వైసీపీ అత్యధిక మెజారిటీతో గెలుపొందింది. అప్పటి టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారన్న విషయం స్పష్టమైంది.

ప్రస్తుతం సీన్ రిపీట్ అయింది. ఈ ఎన్నికల్లో ప్రజలు అంతే కసిగా వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా టీడీపీ కూటమి అభ్యర్థికి ఓటు వేసి ఉంటారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈసారి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలో దిగటంతో కలిసి వస్తుందని విశ్లేషిస్తున్నారు. 2014 ఎన్నికల్లో కూడా ఈ మూడు పార్టీలు కలిశాయి. అప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు కూడా ఆ మూడు పార్టీలు కలవటంతో ప్రజలు కూటమి వైపు మొగ్గుచూపారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కుటుంబ నేపథ్యం కూడా బాగా కలిసివచ్చింది. ఆమె తాత దివంగత మాజీమంత్రి గొట్టిపాటి హనుమంతరావు మంత్రిగా, జడ్పీచైర్మన్‌గా, ఎమ్మెల్యేగా ప్రజలకు నిస్వార్థ సేవలు అందించారు. 40 సంవత్సరాల సుదీర్ఘరాజకీయ చరిత్రలో నీతి, నిజాతీయాలకు మారు పేరుగా, మచ్చలేని నాయకుడిగా జిల్లా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. గొట్టిపాటి లక్ష్మి తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే నరసయ్య రెండు దఫాలు ఎమ్మెల్యే నిస్వార్థ సేవలు అందించారు. వారివురు దర్శి నియోజకవర్గ ప్రజలకు సుపరిచితులు. వారి హయాంలో చేసిన అభివృద్ధి పనులు, ఎత్తిపోతల పథకాలు ఇప్పటికీ గుర్తున్నాయి. గొట్టిపాటి లక్ష్మి చిన్నాన్న, అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్ గత 20 ఏళ్లుగా ఎమ్మెల్యేగా పనిచేస్తూ వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. ఆయన ఆప్రాంత ప్రజలకు నిస్వార్థ సేవలు అందిస్తున్నారు. ఉద్దండులైన నాయకుల వారసురాలిగా గొట్టిపాటి లక్ష్మి రాజకీయాల్లోకి వచ్చి పోటీ చేయటంతో దర్శి నియోజకవర్గ ప్రజలు ఆమెను విశేషంగా ఆదరించారు. మాతాత, మాతండ్రి వారసురాలిగా నిస్వార్థ సేవలు అందించి వారి పేరు నిలబెడతానని, దర్శి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని గొట్టిపాటి లక్ష్మి స్పష్టంగా చెప్పటంతో ప్రజలు ఆమెను విశ్వసించి అత్యధిక శాతంఓట్లు వేసి ఉంటారని విశ్లేషకులు భావిస్తున్నారు. అన్ని కోణాల్లో ఆమెకు అనుకూల పవనాలు కన్పిస్తుండటంతో ఆమె విజయం తథ్యమని కూటమి శ్రేణులు కూడా ధీమా వ్యక్తం చేస్తున్నరు. అదే సమయంలో వైసీపీ కూడా గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తుంది.

రోడ్డు ప్రమాదంలో కనిగిరి వాసి మృతి


మృతురాలు గ్లోరి (ఫైల్)

కనిగిరి, మే 23: కనిగిరి పట్టణంలోని పాతూరు ఎస్సీ కాలనీకి చెందిన మన్నెపల్లి గ్లోరి(28) చీరాల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. స్థానిక మన్నేపల్లి టెండూల్కర్ (సన్నీ)కి మూడేళ్ళ క్రితం బాపట్లకు చెందిన గ్లోరితో వివాహమైంది. టెండూల్కర్ స్థానిక వైకేపీ కార్యాలయంలో ఫార్మర్ మిత్ర (ఎఫ్ఎం)గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవలే ఎస్సీ కార్పొరేషన్ కోటాలో కారు సబ్సిడీపై పొందారు. ఫార్మర్ మిత్రగా పనిచేస్తూ కారు బాడుగకు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

ఈక్రమంలో తన భార్య గ్లోరి సోదరుడి కుమారుడి పుట్టినరోజు సందర్భంగా బాపట్లకు మంగళవారం వెళ్ళారు. బుధవారం పుట్టినరోజు కార్యక్రమం ముగిసిన అనంతరం గురువారం కనిగిరికి బయలుదేరారు. ఈక్రమంలో చీరాల వద్ద ఎదురుగా మరోకారు వచ్చి ఢీకొట్టడంతో గ్లోరి అక్కడికక్కడే మృతి చెందింది. టెండూల్కర్‌కు కుడికాలు, వెన్నుపూసకు బలమైన గాయాలవటంతో ఒంగోలు కిమ్స్‌కు తరలించినట్లు బంధువులు తెలిపారు. ప్రమాద విషయం కనిగిరిలో బంధువులకు సమాచారం అందటంతో పాతూరు ఎస్సీ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

వసతులు లేక ఉద్యోగినుల అవస్థలు

కనిగిరి, మే 23: పేరుకే ప్రభుత్వ కార్యాలయాలు.. ఎక్కడా స్వీపర్‌లు లేరు. దీంతో ప్రతి కార్యాలయం చెత్త కుప్పలతో దర్శనమిస్తున్నాయి. టాయిలెట్స్ కూడా లేని ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళలు నానా ఇబ్బందులుపడుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. స్థానిక అగ్రికల్చర్, వైకేపీ ఉపాధి, సబ్‌రిజిస్ట్రార్ లాంటి కార్యాలయాల్లో టాయిలెట్స్ సరిగా లేకపోవటంతో అధికారులు, సిబ్బంది పడరానిపాట్లు పడుతున్నారు. కొన్ని కార్యాలయాల్లో టాయిలెట్స్ ఉన్నా వాటర్, పారిశుధ్య సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాల్లో దుర్వాసన మధ్యనే అధికారులు విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనిగిరి ఉద్యానశాఖ కార్యాలయం పాడుపడిన గృహాన్ని తలపిస్తుంది. ఆ కార్యాలయానికి కనీసం టాయిలెట్ కూడా లేదు. దీంతో ఉద్యోగినులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల్లో టాయిలెట్స్‌తో పాటు, నీరు సక్రమంగా ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.


స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు

పీసీపల్లి, మే 23: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని కనిగిరి సీఐ దాసరి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని పోతవరం గ్రామంలో గురువారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పోలీసు సిబ్బందితో కలిసి ఇల్లిల్లూ తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని తొమ్మిది ద్విచక్ర వాహనాలను సీజ్‌చేసి పీసీపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఆయన మాట్లాడుతూ ఘర్షణలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై రౌడీషీట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీసీపల్లి, కనిగిరి ఎస్ఐలు రమేష్‌బాబు, త్యాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటిగంగలో చండీ హోమం


హోమం వద్ద పూజలుచేస్తున్న అర్చకులు

తాళ్లూరు, మే 23: పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటిగంగ ఆలయ సన్నిధిలో దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం చండీహోమం నిర్వహించారు. గుంటూరుకు చెందిన ప్రసిద్ధ అర్చకస్వాములు వంగర శ్రీకాంత్ శర్మ, నడింపల్లి వాసుదేవశర్మ ఆధ్వర్యంలో అర్చకస్వాముల మంత్రోచ్ఛరణల మధ్య అత్యంత వైభవంగా చండీ హోమాన్ని నిర్వహించారు. విశేష పూజలు, గణపతి పూజలు నిర్వహించారు. చండీహోమం, లఘుపూర్ణాహుతి, నివేదన, హారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు చండీహోమం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.కార్తిక్, ఆలయకమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, పూజారులు కామేశ్వరశర్మ, ప్రకాశ్ పంతులు, మాజీ చైర్మన్ కటకంశెట్టి శ్రీను, నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షుడు యల్లమందారెడ్డి, స్వామి డాక్టర్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గురుబ్రహ్మం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దొనకొండలో వడగండ్ల వాన

దొనకొండ, మే 23: మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. గత నాలుగు నెలలుగా మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి బోర్లల్లో నీరు అందక ప్రజలు తీవ్ర మంచినీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల అడపాదడపా కురిసిన కొద్దిపాటి వర్షాలతో బోర్లలో నీరు చేరితే తమకు మంచినీటి ఇబ్బందులు తొలగుతాయని ప్రజలు భావిస్తున్నారు.

శాంతి భద్రతలకు సహకరించాలి

పొన్నలూరు (కొండపి), మే 23 : శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రజలు కూడా సహకరించాలని సీఐ పాండురంగారావు కోరారు. గురువారం ఉదయం మండలంలోని కె.అగ్రహారంలో జరిగిన కార్డన్ సెర్చ్‌లో ఆయన సర్కిల్ పరిధిలోని సిబ్బందితో పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 24 మే 2024



ఛలో మాచర్ల.. హై అలర్ట్

- పోలీసుల కవాతు.. దుకాణాల మూత
- 144 సెక్షన్ కొనసాగింపు.. అదుపులో టీడీపీ నేతలు
- పరారీలో ఉన్న ఎమ్మెల్యే పిన్నెల్లి కోసం ఎనిమిది బృందాల గాలింపు
- పిన్నెల్లి లొంగిపోతారని ప్రచారం.. నరసరావుపేటలో పోలీసుల పహారా



మాచర్లలో నిర్మానుష్యంగా ఉన్న



బస్టాండ్ సెంటర్, నాగులేటి వంతెన



మాచర్లలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



మాచర్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న టీడీపీ నేతలు



మాచర్లలో మూతపడ్డ దుకాణాలు



నరసరావుపేట కోర్టు వద్ద మోహరించిన పోలీసులు

నరసరావుపేట, మాచర్ల టౌన్, మాచర్ల రూరల్, రెంటచింతల, కారంపూడి, దాచేపల్లి, పిడుగురాళ్ల, నరసరావుపేట లీగల్, సత్తెనపల్లి, గుంటూరు, మే 23: వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టుపై వస్తోన్న కథనాలు.. టీడీపీ ఛలో మాచర్ల నేపథ్యంలో గురువారం పోలీసులు అప్రమత్తమయ్యారు. పోలింగ్ రోజు, మరుసటి రోజు మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ మూకల దాడిలో గాయపడిన టీడీపీ నేతల పరామర్శ కోసం గురువారం టీడీపీ ఛలో మాచర్లకు పిలుపిచ్చింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ టీడీపీ నేతలు మాచర్లకు రాకుండా నిర్బంధించారు. మాచర్లలో 144 సెక్షన్ కొనసాగించారు. పట్టణంలో పోలీసులు సీఐ బొప్పన బ్రహ్మయ్య, ట్రైనీ డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యాన కవాతు నిర్వహించారు. ఛలో మాచర్ల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దుకాణాలను మూసివేయించారు. రాయవరం జంక్షన్, కొత్తపల్లి జంక్షన్, రింగురోడ్డు, నెహ్రూనగర్, మున్సిపల్ కార్యాలయం వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రెంటచింతల మండల పరిధిలోని పలు గ్రామాలకు సీఆర్‌పీఎఫ్ బలగాలు రంగ ప్రవేశం చేశాయి. 11 గ్రామాలతో పాటు తుమ్మకోటకు శివారు గ్రామమైన కొత్తగంగరాజు పల్లెలో పర్యటించి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కారంపూడిలో 144 సెక్షన్ కొనసాగుతోంది. పోలీసులు ముందుజాగ్రత్తగా తనిఖీలు చేపట్టారు. దుకాణాలు మూతపడ్డాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ సెంటర్, నాగులేటి వంతెన తదితర ప్రాంతాలు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. గురజాలలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిన పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు.

నోటీసులు.. నిర్బంధాలు

పల్నాడులో నెలకొన్న పరిస్థితుల రీత్యా ఎవరూ అటు వెళ్లడానికి వీల్లేదని పోలీసు అధికారులు బుధవారమే హెచ్చరికలు జారీ చేశారు. టీడీపీ నేతలు తలపెట్టిన ఛలో మాచర్ల కార్యక్రమాన్ని పోలీసులు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. టీడీపీ ముఖ్య గురువారం మాచర్ల తరలివెళ్తారనుకున్న టీడీపీ నేతలకు నోటీసులు అందజేశారు. అయినా ముందుజాగ్రత్తగా ఎక్కడికక్కడ నేతలను అదుపులోకి తీసుకు న్నారు. మరికొన్ని దగ్గర్ల హౌస్‌అరెస్టులు చేశారు. పోలింగ్ అనంతరం నుంచి గుంటూరులో గృహ నిర్బంధంలో ఉన్న మాచర్ల కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఇంటి వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశా రు. ఎన్నికల సందర్భంగా పల్నాడులో చలరేగిన ఘటనలపై టీడీపీ ఏర్పాటు చేసిన కమిటీలో సభ్యులుగా ఉన్న మాజీ మంత్రి నక్కా ఆనం దబాబు ఇంటి వద్ద పోలీసులు మోహరించారు. గుంటూరులోని ఆయన కు నోటీసులు అందజేశారు. దీనిపై ఆనందబాబు సీరియస్ అయ్యారు. పాల్వాయి గేటు బాధితుడు శేషగిరికి తోడుగా నిలిచిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావుపై కూడా పోలీసులు దృష్టి సారించారు. గురువారం ఉదయం ఆయన ఇంటి వద్ద పోలీసులు మో హరించి ఆయన ఎటూ వెళ్లకుండా నిర్బంధించారు. అయితే పోలీసుల కన్నుగప్పి ఆయన ఆనందబాబు ఇంటికి చేరుకున్నారు. ఆనందబాబును నిర్బంధించారన్న సమాచారంతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టాబత్తిన చిట్టిబాబు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ వడ్లమూడి పూర్ణచం ద్రరావు, నేతలు యాగంటి దుర్గారావు, పాటిబండ్ల బలరాం కోటపాటి రాంబాబు ఆయనింటి వద్దకు చేరుకుని పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మాచర్లలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొ మెర దుర్గారావు, తెలుగు యువత జిల్లా కార్యదర్శి కొమెర శివ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మున్నా రాంబాబు, మంజుల అంజి, కంభంపాటి దానంబాబులను పోలీసులు అదుపులోకి తీసుకుని పట్టణ పో లీస్ స్టేషన్‌కు తరలించారు. పిడుగురాళ్ల పట్టణ, రూరల్ పరిధిలో 25 మందికి పైగా నేతలకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. దాచేప ల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి శ్రీనివాసరావు, టీడీపీ మం డల యూత్ అధ్యక్షుడు షేక్ నాయబ్ అబ్దుల్లా తదితరులను పోలీ సులు హౌస్ అరెస్టు చేశారు. గురజాలలో ఎనిమిది మందికి నోటీసులు, ఆరుగురిని హౌస్ అరెస్ట్‌చేసినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.

ప్రజాస్వామ్యంపై పిన్నెల్లికి గౌరవం లేదు : జూలకంటి

చట్టం, ప్రజాస్వామ్యంపై మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి గౌరవం లేదని జూలకంటి బ్రహ్మారెడ్డి విమర్శించారు. గంటలో మాచర్ల వస్తానన్న ఆయన.. ఇప్పుడెక్కడ దాక్కున్నారని ఎద్దేవా చేశారు. ఆయన పరారీ వెనక సజ్జల వంటి పెద్దల సహకారం ఉందని ఆరోపించారు. పోలీసులు కూడా ఆయన పరారీకి అన్నివిధాలా సహకరించారన్నారు. పాల్వాయి, కేపీగూడెం, మాచర్ల దాడులపై నామమాత్రపు సెక్షన్లతో కేసులేంటని ప్రశ్నించారు. కేపీగూడెంలో టీడీపీ ఏజెంట్లుగా కూర్చున్న గిరిజనుల్ని కొట్టారని తెలిపారు. గాయపడిన వారిని పరామర్శించేందుకు వెళ్తుంటే పోలీసులు తనను అడ్డుకున్నారని మండిపడ్డారు. అతి త్వరలోనే మాచర్ల వెళ్లి బాధితులను కలిసి న్యాయం చేస్తామన్నారు.

పోలీసులకు పిన్నెల్లి సవాల్

ఈవీఎం ధ్వంసం చేసి అరాచకం సృష్టించి పరారీలో ఉన్న మాచర్ల వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు పోలీసులకు సవాల్‌గా మారింది. రెంటచింతల మండలం పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను ధ్వంసం చేసిన కేసులో పిన్నెల్లి ఏ 1 నిందితుడిగా ఉన్నారు. తెలంగాణలోని సంగారెడ్డి సమీపంలో పిన్నెల్లి పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్నారు. ఎమ్మెల్యే కారును గుర్తించి గన్‌మాన్, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. విదేశాలకు పారిపోకుండా ఇప్పటికే లుకౌట్ నోటీసులు కూడా జారీ చేశారు. ఎస్పీ మల్లికాగార్గ్ నేతృత్వంలో ఏఎస్పీ, డీఎస్పీ, నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో ఎనిమిది బృందాలు పిన్నెల్లి కోసం గాలిస్తున్నాయి. పిన్నెల్లి నరసరావుపేట కోర్టులో లొంగిపోతారన్న ప్రచారం నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం అయ్యారు. గురువారం రాత్రి వరకు పిన్నెల్లి అచూకీ పోలీసులకు లభించలేదు. ఈసీ ఆదేశాలతో పిన్నెల్లి కోసం గాలింపును ముమ్మరం చేశారు. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు పిన్నెల్లి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అతడిని పట్టుకునేందుకు పోలీసులు కూడా అదే స్థాయిలో వేటాడుతున్నారు. పోలీసు బృందాలు హైదరాబాద్, దాని చుట్టుపక్కల తెలంగాణ జిల్లాల్లో విస్తృతంగా గాలిస్తున్నాయి. పిన్నెల్లి నరసరావుపేట కోర్టులో లొంగిపోవచ్చన్న అనుమానంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పిన్నెల్లి లొంగిపోతారన్న అనుమానంతో పోలీసులు నరసరావుపేట కోర్టు ఆవరణలో భారీ సంఖ్యలో మోహరించారు. ప్రత్యేక భద్రతా చర్యలు కూడా తీసుకున్నారు.

నాడు భయం.. నేడు తెగింపు

పోలింగ్ రోజు పాలువాయిగేట్ 202 బూత్‌లోకి ప్రవేశించి ఎమ్మెల్యే పీఆర్కే ఈవీఎంను ధ్వంసం చేశారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు ఈవీఎంను ధ్వంసం చేశారని పీవో, ఏపీవో సహ జిల్లా పంచాయతీ అధికారి అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే తాము ఇబ్బంది పడతామనే భావంతో ఎన్నికల విధుల్లోని ఉద్యోగులు భయంతో పిన్నెల్లి దుశ్చర్యను దాచారు. ఆ తర్వాత ఈ నెల 21 సాయంత్రం ఈవీఎం ధ్వంసం వీడియో బయటకొచ్చింది. ఏకంగా ఎమ్మెల్యేనే ఈవీఎం ధ్వంసం చేయడంతో ఆ వీడియో వైరల్‌గా మారి కలకలం సృష్టించింది. తొలుత ఈ విషయాన్ని దాచి పెట్టిన అధికారుల్లో కొందరు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది.. తమకు ఏమీ కాదనే తెగింపుతో వీడియోను లీక్ చేసి ఉంటారని సమాచారం. ఇదే అభిప్రాయాన్ని పలువురు ఓటర్లు, వివిధ వర్గాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

వెలుగుచూస్తున్న అరాచకాలు.. అరెస్టులు

- నరసరావుపేటలో పోలీసుల సమక్షంలోనే దాడులు
- మాచర్లలో దాడులు.. హత్యాయత్నాలు

పోలింగ్ రోజు వైసీపీ అరాచకాలు తాజాగా వెలు గు చూ స్తోన్నాయి. రెండు రోజుల క్రితం పోలింగ్ బూత్‌లో ఈవీఎంను పగలకొట్టిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి దుశ్చర్య విషయం తెలిసిందే. తాజాగా నరసరావుపేటలో పోలింగ్ రోజు వైసీపీ మూకల హింసాకాండ వెలుగులోకి వచ్చింది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసుల సమక్షంలోనే టీడీపీ కార్యకర్తలు, నేతలపై వైసీపీ రౌడీలు దాడి చేసిన వీడియో దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పట్టణంలోని పల్నాడు రోడ్డు మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ బూత్ వద్ద వైసీపీ మూకలు కర్రలు, రాడ్లతో టీడీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డాయి. టీడీపీ నేతలకు చెందిన కార్లను ధ్వంసం చేశారు. టీడీపీ అభ్యర్థిపై కూడా దాడికి యత్నించారు. ఆయన ఉన్న కారును కూడా ధ్వంసంచేశారు. దాడిలో టీడీపీ నేతలు గాయపడ్డారు. ఈ దాడుల వీడియో దృశ్యాలు సిట్ బృందానికి కూడా టీడీపీ నేతలు ఇచ్చారు.

వెలుగులోకి పిన్నెల్లి అకృత్యాలు..

ఎమ్మెల్యే పిన్నెల్లి అరాచకాలు కూడా ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. పాలువాయిగేటులోని 202 పోలింగ్ బూత్‌లోకి రామకృష్ణారెడ్డి దూరి ఈవీఎం ధ్వంసం చేసి అడ్డుకునేందుకు ప్రయత్నించిన టీడీపీ ఏజెంట్ శేషగిరిరావు తల పగలకొట్టి, ఓ మహిళను హెచ్చరించిన సంఘటన ఇటీవల వెలుగుచూసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పిన్నెల్లి అకృత్యాలు మరికొన్ని ఆయన సొంత మండలమైన వెల్దుర్తి పరిధిలోని కొత్తపుల్లారెడ్డిగూడెంలో జరిగిన సంఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి.

పిన్నెల్లి ఆదేశాలతో కొత్తపుల్లారెడ్డిగూడెం 118, 119, 120 పోలింగ్ బూత్‌లలో, రాయవరం పోలింగ్ బూత్‌లపై వైసీపీ మూకలు దాడులు చేశారు. పోలింగ్ కేంద్రంలో ఉన్న టీడీపీ ఏజెంట్లపై హత్యాయత్నం చేశారు. ఆ బూత్‌ల్లో టీడీపీ ఏజెంట్లుగా ఉన్న కేతావత్ రేఖ్యానాయక్, హనుమంతునాయక్, బాణావత్ చిన మంత్రియానాయక్, మల్లునాయక్, మూఢావత్ అంజినాయక్, తులస్యానాయక్, సంతోష్‌నాయక్‌లపై అక్కడ వేసిన టెంట్లు పడేసి ఆ కర్రలతోనే దాడికి పాల్పడ్డారు. ఈ లోగా ఎమ్మెల్యే పీఆర్కే తన రౌడీ గ్యాంగ్‌తో అక్కడకు చేరుకుని టీడీపీ ఏజెంట్లను బలవంతంగా కార్లో ఎక్కిస్తుండగా రేఖ్యానాయక్ పారిపోగా మాజీ సర్పంచ్ కేతావత్ పాండు, జడ్పీటీసీ రూప్లీబాయి భర్త బాలు, వైసీపీ రౌడీ మూకలు వెంటపడి దాడి చేసి గాయపరిచారు. రేఖ్యానాయక్ మినహా మిగిలిన టీడీపీ ఏజెంట్లను పీఆర్కే తన వాహనంలో మాచర్ల పట్టణానికి తీసుకొచ్చి వదిలివేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రేఖ్యానాయక్‌ను బంధువులు మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై టీడీపీ నేతలు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. మాపైనే ఫిర్యాదు చేస్తారా.. అంటూ వైసీపీ గూండాలు టీడీపీ వర్గీయులపై బరిసెలతో మూకుమ్మడి దాడులు చేశారు. ఈ వీడియోలను టీడీపీ వర్గీయులు బయటపెట్టారు. పోలింగ్ రోజున మాచర్ల మండలం రాయవరం గ్రామంలో 51వ పోలింగ్ బూత్‌లో టీడీపీ ఏజెంట్లు గాలి చంద్రశేఖర్, జాజుల నాగేశ్వరరావు, గాజుల కొండలు ఏజెంట్లుగా కూర్చున్నారు. వైసీపీ రౌడీ మూకలు దొంతగాని జగపతి, ఎంపీటీసీ మట్టా శైలజ భర్త వెంకటేశ్వర్లు, అమరేష్ శ్రీనివాస్‌లు పోలింగ్ బూతుల్లో దూరి తలుపులు వేసి మరీ బెదిరించి, దౌర్జన్యానికి దిగారు. స్పందించిన పోలీసులపై కూడా ఆ ముగ్గురు దుర్భాషలకు దిగి పోలింగ్ ప్రక్రియకు ఆటంకం కలిగించారు. పోలీసులు బలవంతంగా వైసీపీ మూకలను అక్కడి నుంచి పంపివేశారు.

84 మందికి రిమాండ్

ఎన్నికల సందర్భంగా జిల్లాలో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలకు సంబంధించి గురువారం 84 మందికి రిమాండ్ విధిస్తూ స్థానిక ప్రధాన జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఆర్ ఆశీర్వాదంపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. దాచేపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఇరుపక్షాలకు చెందిన 33 మంది, పిడుగురాళ్లలో 50 మంది, నరసరావుపేట మొదటి పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక్కరిని అరెస్టు చేసి గురువారం గురజాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, పిడుగురాళ్ళ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల ఇన్‌చార్జ్ న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్ ఎదుట హాజరు పరచగా రిమాండ్ విధించారు. కోర్టు ఆవరణలో మొదటి పట్టణ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి, పిడుగురాళ్ల సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐలు సంధ్యారాణి, పఠాన్‌రబ్బానీ ఖాన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



రాయవరంలో పోలింగ్ బూత్ మూసివేసి పోలీసులపై సైతం దుర్భాషలాడుతున్న వైసీపీ మూకలు

కొట్టించుకున్న మాపైనే కేసులా?

పోలింగ్ రోజు తంగెడ గ్రామంలో జరిగిన పెట్రో బాంబుల దాడి కేసులో 32 మందిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్‌ఐ శివనాగరాజు తెలిపారు. గ్రామంలోని మెయిన్ స్కూల్ వద్ద పెట్రో బాంబులు, రాళ్ల, కర్రలతో జరిగిన దాడికి సంబంధించి వైసీపీకి చెందిన 22 మందిపై టీడీపీకి చెందిన 11 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. వైసీపీ మూకల దాడిలో టీడీపీకి చెందిన ఇద్దరు దివ్యాంగుల దుకాణాలు కాలిపోయాయని, పలువురు గాయపడ్డారని అయినా తమను అరెస్టు చేయడంపై టీడీపీ నాయకులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దెబ్బలు తిన్నది మేమే.. బాంబులు వేయించుకుంది మేమే.. కేసులు కూడా మాపై పెట్టడం ఎంతవరకు సబబు అంటూ మండిపడ్డారు.



నరసరావుపేటలో పోలీసుల సమక్షంలోనే టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకల దాడి

భావదేవా.. పాహిమాం

- భావదేవ నామస్మరణతో పులకించిన భావపురి
- కనుల పండుగగా భావదేవుని రథోత్సవం





శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజన దృశ్యం

బాపట్ల, మే 23: బాపట్ల పట్టణంలో చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి 1431వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం బావయ్య వైశాఖ పౌర్ణమి సందర్భంగా స్వామి వారి దివ్యరథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించి రథం బజారు నుంచి సూర్యలంకరోడ్డులోని శ్రీప్రపత్యాంజనేయస్వామి దేవాలయం వరకు రథాన్ని ఉత్సవంగా తీసుకెళ్ళి తిరిగి ఆలయానికి చేర్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి రథాన్ని లాగేందుకు ఆసక్తి చూపారు. భావనామస్మరణతో భావపురి పులకరించింది. బాపట్ల పరిసర ప్రాంతాల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా భక్తజనం విశేష సంఖ్యలో తరలివచ్చారు. భావదేవ పాహిమాం.. రాజ్యలక్ష్మీ రక్షమాం, శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి బహుపరాక్, గోవిందా.. గోవిందా అంటూ భక్తులు చేసిన నినాదాలతో రథంబజారు, సూర్యలంకరోడ్డు మార్మోగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారిని ఉంచి పండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

పూజలలో పాల్గొన్న నాయకులు

భావదేవుని రథోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి రమాదేవి దంపతులతోపాటు పార్టీశ్రేణులు పాల్గొని పూజలు చేశారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకులు అన్నం సతీష్ ప్రభాకర్ తెలుగుదేశంపార్టీ నాయకులతో కలిసి ఉత్సవంలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. వేలాదిమంది భక్తుల నడుమ కన్నులపండుగగా జరిగిన రథోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీనాయకులు ఇనగలూరి మాల్యాద్రి, అట్లప్రసాదరెడ్డి, కోకి రాఘవరెడ్డి, తెలుగుదేశపార్టీ నాయకులు ఇనగంటి గాంధీ, గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు. అదేవిధంగా బాపట్ల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా అంజిబాబు, భావన్నారాయణస్వామి రథోత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బందోబస్తు ఏర్పాటు...

బాపట్ల తిరునాళ్ళ సందర్భంగా భావదేవుని రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. భావన్నారాయణస్వామి దేవాలయం దగ్గర నుంచి సూర్యలంకరోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం వరకు వాహనాలు అడ్డురాకుండా బారికేట్లు పెట్టారు. భక్తులు మాత్రమే కాలినడకన వేడుకలలో పాల్గొనే ఏర్పాట్లు చేశారు.

సాగుకు.. సాకులు



నరసరావుపేట ప్రాంతంలో పొలం దుక్కి దున్నుతున్న రైతు

- ప్రణాళికే సిద్ధం చేయని వ్యవసాయశాఖ
- ఎన్నికల పేరుతో పట్టించుకోని అధికారులు
- రైతులు సమాయత్తమవుతున్నా అందుబాటులో లేని విత్తనాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. ఖరీఫ్‌లో సాధారణం కన్నా ఎక్కువగా వర్షపాతం నమోదు అవుతుందని వాతావరణ శాఖ చెప్తోంది. వాతావరణ శాఖ చెప్పినట్లే ముందుగానే తొలకరి వర్షాలు మొదలయ్యాయి. వర్షాలతో సాగుకు రైతులు సిద్ధం అంటున్నారు. అయితే వ్యవసాయ శాఖ మాత్రం ఓ అడుగు వెనకే ఉన్నానంటోంది. ఎన్నికల పేరుతో వ్యవసాయశాఖ తాను నిర్వహించాల్సిన బాధ్యతలను విస్మరించింది. ఎన్నికలకు, వ్యవసాయశాఖకు సంబంధం ఏమిటో అర్థం కావడంలేదని రైతులు వాపోతున్నారు. గత ఏడాది తీవ్ర వర్షాభావంతో పంటలు సాగు చేయలేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది ఆశాజనకంగా వర్షాలు పడతాయన్న వాతావరణశాఖ తీపికబురు, వారం నుంచి కురుస్తున్న వర్షాలతో రైతులు కోటి ఆశలతో సాగు సిద్ధమయ్యారు. దుక్కులు దున్నే పనులు చురుగ్గా సాగుతున్నాయి. సాగుకు వేళాయినా ఇందుకు వ్యవసాయ శాఖ సన్న ద్ధంగా లేదు. సాగు ప్రణా ళికే ఇంకా సిద్ధం చేయ లేదు. విత్తన సరఫరాపై దృష్టి సారించలేదు. ఎన్నికల సాకు చూపుతూ వ్యవసాయ శాఖ సాగు విషయంలో ముందస్తు చర్యలు తీసుకోకుం డా మిన్నకు న్నది. ఎన్నిక లకు వ్యవసా యానికి ఎ టువంటి సం బంధం లే దు. అయినా వ్యవసాయ యంత్రాంగం ఇప్పటి వరకు ఖరీ ఫ్ సాగుకు సంబంధించి కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. గత ఏడాది సాగు కోల్పోయిన రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుండటం వారిని ఆందోళనకు గురిచేస్తోంది.

ఇండెంట్లు కోరని అధికారులు

వివిధ పంటల సాగుకు అవసరమైన విత్తనాలకు సంబంధించి రైతుల నుంచి ఇప్పటికీ వ్యవసాయ శాఖ అధికారులు ఇండెంట్లు సేకరించలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఖరీఫ్‌లో రైతులు ఏఏ పంటలు ఎన్నెన్ని ఎకరాల్లో సాగు చేస్తారు.. ఏఏ విత్తనాలు అవసరం ఎంత అనే దాని గురించే అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. సకాలంలో సాగు పనులు చేపట్టకపోతే.. పంట చేతికొచ్చే వేళ ప్రకృతి వైపరీత్యాలు నష్టాన్ని కలిగిస్తాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వరి, మిరప, పత్తి గణనీయంగా సాగు చేస్తారు. వీలైనంత త్వరగా విత్తనాలు అందిస్తే.. విత్తేందుకు పొలాలను రైతులు సిద్ధం చేస్తున్నారు. ముందుగా విత్తన సరఫరాకు అధికారులు ముందడుగు వేయాల్సిన అవసరం ఉంది. సాగులో కీలకమైన భూసార పరీక్షల నిర్వహణలో కూడా అధికారులు ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు న్నాయి.

గత ఖరీఫ్‌లో బీళ్లుగా 2.88 లక్షల ఎకరాలు

గత ఖరీఫ్ కరువు కాలగర్భంలో కలసిపోయింది. పల్నాడు జిల్లాలో 2.88 లక్షల ఎకరాల్లో పంటలే సాగు చేయలేదు. పదేళ్లలో సాగు 41 శాతానికి పడిపోవడం గత ఏడాదే ప్రథమం. పత్తి, వరి సాగు గణనీయంగా పడిపోయింది. జిల్లాలో పంటల సాగు సాధారణ విస్తీర్ణం 4,85,360 ఎకరాలు కాగా 1,96,633 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. 1.55 లక్షల ఎకరాల్లో పత్తి, 1.03 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయలేదు. వరి సాగు రికార్డు స్థాయిలో తగ్గింది. గత ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం, సాగునీటి కరువుతో సాగును కోల్పోయిన రైతులు ప్రస్తుత ఖరీఫ్‌పై ఆశలు పెట్టుకున్నారు. జూన్‌లో పత్తి సాగుకు పొలాలను రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. పత్తి విత్తనాలు, వరి సాగు చేసే భూములకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు. పచ్చిరొట్టె విత్తనాలు పంపిణీ చేస్తున్నామని జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళి తెలిపారు. జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను 50 శాతం రాయితీపై పంపిణీ చేపట్టామన్నారు. 421 ఆర్‌బీకేల ద్వారా పచ్చిరొట్టె విత్తనం పంపిణీ చేస్తున్నామన్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు (ఇన్‌సెట్లో) మృతురాలు శిరీష

ఘోర రోడ్డు ప్రమాదం

- కనిగిరికి చెందిన వివాహిత మృతి
- అపస్మారక స్థితిలో ఆమె భర్త
- తెనాలికి చెందిన యువకులకు తీవ్ర గాయాలు

వేటపాలెం(చీరాలటౌన్), మే 23 : చీరాల - వేటపాలెం మధ్యలో గల పందిళ్లపల్లి జాతీయ రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వీరిలో కనిగిరికి చెందిన వివాహిత మృతి చెందింది. వివరాల్లోకి వెళితే ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన మన్నేపల్లి టెండూల్కర్ కనిగిరి వెలుగు కార్యాలయంలో రైతు మిత్ర కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. అతని భార్య శిరీష(30)తో బాపట్లలోని బంధువుల ఇంటికి శుభ కార్యానికి వచ్చారు. అనంతరం గురువారం మధ్యాహ్నం కారులో భార్యాభర్తలు వెళ తున్నారు. అదే సమయంలో తెనాలికి చెందిన బాబ్జీ, విజయ్, అనేష్, భరత్, రఘు కారులో రామాపురం సముద్రతీరానికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈ రెండు కార్లు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. దీంతో శిరీష అక్కడిక్కడే మృతిచెందగా, భర్త అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఎదురు కారులోని బాబ్జీ కాలు విరిగింది. మిగిలిన వారికి స్వల్ప రక్త గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించగా బాబ్జీకి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. వేటపాలెం ఎస్ఐ సురేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కారును ఢీ కొట్టిన పాలవ్యాను (ఇన్‌సెట్లో) మృతుడు వెంకటేశ్వరరెడ్డి

ముంచుకొచ్చిన మృత్యువు

- కారును ఢీకొన్న పాల ట్యాంకర్ ● ఒకరు మృతి.. నలుగురికి గాయాలు

సీఎస్‌పురం(పామూరు), మే 23: కుటుంబసభ్యులతో కలిసి దైవదర్శనం చేసుకొని మరో రెండుగంటల్లో స్వగ్రామానికి చేరుకుంటామనుకుంటున్న తరుణంలో పాలట్యాంకర్ రూపంలో మృత్యువు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను కబలించింది. ఈ సంఘటన నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం చింతలగుంట వద్ద బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. సీఎస్‌పురం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని ఐదుగురు మొక్కులు తీర్చుకునేందుకు కారులో తిరుమలకు వెళ్లారు. దైవదర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో దుత్తలూరు మండలం చింతలగుంట సమీపంలోని ఇటుక బట్టీల వద్దకు వచ్చేసరికి మార్కాపురం నుంచి చిత్తూరుకు పాలతో వెళుతున్న ట్యాంకర్ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పాలగిరి వెంకటేశ్వరరెడ్డి (30) సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కారులో ఉన్న మృతుని భార్య మంజులత, తండ్రి సుబ్బారెడ్డి, అక్క కొడుకు అభిరూప్ నందన్‌రెడ్డితోపాటు మృతుని తల్లి నారాయణమ్మకు గాయాలయ్యాయి. మృతుడికి ఐదు నెలల క్రితమే వివాహమైనట్టు బంధువులు తెలిపారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించగా, మృత దేహాన్ని ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. ప్రమాద సమాచారం తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకొన్నాయి.



లారీని అపహరించి టైర్లు ఊడదీసి తీసుకెళ్లిన దుండగులు

నిలువుదోపిడీ

- లారీని ఎత్తుకెళ్లి టైర్లు, సామగ్రి అపహరణ
- రాళ్లపై బాడీని నిలిపిన వైనం
- యజమానికి రూ.3 లక్షలు నష్టం

పెద్దదోర్నాల, మే 23: హైవే వెంబడి దోపిడీలు సాధారణంగా జరుగుతుంటాయి. అయితే గురువారం దోర్నాలలో వెలుగుచూసిన లూటీ మాత్రం ఒకింత భిన్నమైనదే..!. గ్రామానికి చెందిన పఠాన్ యాసిన్‌ఖాన్ లారీని స్థానికంగా ఓ పెట్రోలు బంకు వద్ద బుధవారం రాత్రి నిలిపి ఉంచారు గురువారం తెల్లవారుజామున వచ్చిచూడగా నిలిపిన చోట లారీ కనిపించలేదు. దీంతో ఆందోళన చెంది తన మనుషులతో పలుచోట్ల వెతికించారు. ఈ క్రమంలో పెద్దారవీడు మండలం గంగుపల్లెకు వెళ్లే రోడ్డులో నిర్మానుష్య ప్రాంతంలో లారీని గుర్తించారు. లారీ ఆకారమైతే ఉంది కానీ, స్పేర్స్ మొత్తం మాయమయ్యాయి. 12 టైర్లు, డిస్కులు అపహరణకు గురయ్యాయి. కిందపడకుండా రాళ్లపై బాడీని నిలబెట్టారు. ఇక లారీలోని 200 లీటర్ల డీజిల్, టార్పాలిన్ పట్టాలు, తాళ్లు, కేబిన్‌లోని విలువైన వస్తువులు కూడా ఎత్తుకెళ్లారు. మొత్తం రూ.3లక్షల విలువైన వస్తువులు దోపిడీకి గురైనట్లు బాధితుడు దోర్నాల పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎస్సై అంకమరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు

విఘాతాలకు పాల్పడితే కఠిన చర్యలు

చీరాలటౌన్, మే 23 : ఎన్నికల నేపథ్యంలో విఘాతాలు సృష్టించేందుకు ఆయుధాలు, ఇతర వస్తువులు అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం సీఐ ఆధ్వర్యంలో దండుబాట, వైకుంఠపురం, హరిప్రసాద్ నగర్, ఈపూరుపాలెం ప్రాంతాలలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పలు అనుమానిత ప్రదేశాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇప్పటికే అధికారులు ప్రమాదాలు చోటుచేసుకోకుండా పలు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ వెంట పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇదేం పంచాయతీ!

- వివాదాలకు అడ్డాలుగా కార్యాలయాలు
- డీఎల్‌పీవో ఆఫీసుల్లో ఇష్టారాజ్యం
- మహిళా ఉద్యోగులపై వేధింపులు..
- అయినా పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఒంగోలులో ఉద్యోగులు ఉన్నా పనిచేసేవారు కరువు
- రెగ్యులర్ డీపీవో లేకపోవడంతో అజమాయిషీ కరువు
- మార్కాపురం కార్యాలయంలోనూ ఇదే పరిస్థితి
- మహిళా ఉద్యోగులపై దురుసుగా మాట్లాడిన ఆడియోలు లీక్‌తో అంతటా కలకలం

పంచాయతీ పాలన గాడితప్పింది. గ్రామాలలో మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దాల్సిన వ్యవస్థపై అజమాయిషీ కొరవడింది. ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా, డివిజనల్ పంచాయతీ కార్యాలయాలు ఉన్నా ఎటువంటి ఉపయోగం లేకుండా పోయింది. ఏ కార్యాలయంలో ఎప్పుడు ఏమి జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. గత కొంతకాలం నుంచి పంచాయతీ కార్యదర్శుల నుంచి జిల్లా కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల వరకు అంతా మా ఇష్టం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మహిళా ఉద్యోగులపై వేధింపులు ఎక్కువయ్యాయి. ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న ఘటనలు చూస్తే పరిస్థితి చేయి దాటిపోయిందన్న అనుమానాలు వ్యక్తంఅవుతున్నాయి.



ఒంగోలు(కలెక్టరేట్), మే 23 : పంచాయతీ పాలనను పాలకులు గాలికొదిలేశారు. కార్యాలయాలు పనిచేయడం మానేశాయి. ఉన్నతాధికారుల ఉదాసీనతతో వివాదాలకు అడ్డాలుగా మారుతున్నాయి. ఉద్యోగులపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో వారు తాము అక్రమాలు చేసినా ఏం కాదులే అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. ఒంగోలు, కనిగిరి, మార్కాపురంలలో డివిజనల్ పంచాయతీ కార్యాలయాలు ఉండగా జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఈ కార్యాలయాన్నింటిని పర్యవేక్షించేందుకు జిల్లా పంచాయతీ కార్యాలయం ఉంది. కానీ పేరుకు మాత్రమే కార్యాలయాలు ఉన్నాయే తప్ప అటు ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించే విషయంలోనూ, ఇటు ఉద్యోగులకు ఏదైనా సమస్య వస్తే వాటిని పరిష్కరించే విషయంలోనూ పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. తాజాగా రెండు రోజుల క్రితం మార్కాపురం డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో మహిళా ఉద్యోగుల పట్ల సీనియర్ అసిస్టెంట్ వ్యవహరించిన తీరే ఇందుకు నిదర్శనం. తప్పుచేసిన వారిపై సత్వరమే చర్యలు తీసుకోవాల్సిన అధికారులే అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సీనియర్ అసిస్టెంట్ ఆడియో వైరల్

మార్కాపురం డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో పనిచేసే ఇరువురు మహిళా ఉద్యోగుల పట్ల అక్కడ పనిచేసే సీనియర్ అసిస్టెంట్ మాట్లాడిన మాటలు ఆడియో రూపంలో బహిర్గతం కావడంతో ప్రజల్లో విస్తృత చర్చకు దారితీసింది. అదే సీనియర్ అసిస్టెంట్ ఒంగోలు డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో ఏడాది క్రితం మహిళా ఉద్యోగులను ఇదేవిధంగా వేధించిన విషయం తెలిసిందే. అప్పట్లో ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి అతనిని మాతృశాఖ అయిన పంచాయతీరాజ్‌కు సరెండర్ చేశారు అయితే ఆ సీనియర్ అసిస్టెంట్ తనకు ఉన్న ఆర్థిక, అంగబలంతో సరెండర్ చేయడాన్ని తప్పుబడుతూ కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేసే ఒకరి ద్వారా మార్కాపురం డీఎల్‌పీఓ కార్యాలయానికి బదిలీ చేయించుకున్నారు. అయినా అతని తీరు మారలేదు. అక్కడ కూడా తన పాత నైజాన్ని వదలకుండా మహిళా ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా సభ్యసమాజం తలదించుకునే విధంగా మాట్లాడిన మాటలు బయటకు రావడంతో శాఖలో కలకలం రేగింది. అయినా జిల్లా పంచాయతీ అధికారులు ఇంతవరకు ఈ ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఒంగోలు కార్యాలయంలో గొడవలు

ఇక ఒంగోలు డివిజనల్ పంచాయతీ కార్యాలయలోనూ అంతా అస్తవ్యస్తంగా తయారైంది. అక్కడ పనిచేసే ఉద్యోగులు డీఎల్‌పీఓకు సహకరించని పరిస్థితి ఏర్పడింది. కార్యాలయంలో ఏ పనిచేయాలన్న కుదరని పరిస్థితి ఏర్పడిందని ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై కూడా జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి ఉద్యోగులను విచారణ చేసినట్లు సమాచారం. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఇక్కడ రెగ్యులర్‌గా పనిచేసే డీపీవో నారాయణరెడ్డిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల అధికారిణి ఉషారాణికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. డీపీఓ విధుల్లో ఉన్నా ఆమె పెద్దగా పట్టించుకుంటున్న పరిస్థితి లేకుండా పోయింది. దీంతో జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేసే అధికారులు, ఉద్యోగుల నుంచి క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ కార్యదర్శు ల వరకు అందరూ తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మహిళా ఉద్యోగుల వేధింపులపై విచారణ పూర్తి

- కలెక్టర్‌కు నివేదించిన డీపీవో

మార్కాపురం డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో మహిళా ఉద్యోగులను వేధిస్తున్న సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుపై చర్యలకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. మహిళా ఉద్యోగుల ఫిర్యాదు మేరకు విచారణ చేసిన జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి అందుకు సంబంధించిన నివేదికను గురువారం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు పంపారు. కలెక్టర్ ఆ నివేదికను పరిశీలించి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఆదే సీనియర్ అసిస్టెంట్ ఒంగోలు డీఎల్‌పీవో కార్యాలయంలో పనిచేసే సమయంలో మహిళా ఉద్యోగులను వేధిస్తుండటంతో మొదట పంచాయతీరాజ్‌కు సరెండర్ చేసి తర్వాత కోర్టు ఆర్డర్ కారణంగా మార్కాపురానికి బదిలీ చేశారు. అక్కడ కూడా ఇదేవిధంగా వ్యవహరించడంతో కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని శాఖలో చర్చ నడుస్తోంది.

పరీక్షలు సజావుగా జరిగేనా?

- నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు
- నిమిషం లేటైనా నోఎంట్రీ

ఒంగోలు(విద్య), మే 23: జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరుగుతాయన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పరీక్షల నిర్వహణలో ఇంటర్ బోర్డు చేసిన కొన్ని మార్పులు ఈ అనుమానాలకు ఊతమిస్తున్నాయి. పరీక్షల నిర్వహణలో ఇప్పటి వరకు ప్రైవేటు కళాశాలల వారిని దూరంగా ఉంచిన బోర్డు ప్రస్తుతం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో వారికే పెద్దపీట వేయడంతో పరీక్షలు పారదర్శక నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులుగా ప్రభుత్వ, ఎయిడెడ్ ప్రభుత్వ గురుకుల కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులను మాత్రమే నియమించేవారు. ప్రస్తుత పరీక్షల్లో ఈ విధానాన్ని సడలించి నిర్వహణ అధికారులుగా ప్రైవేటు కళాశాలల వారిని కూడా నియమించడంతో అందరిలో సంశయం నెలకొంది. ప్రస్తుత అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు డిపార్ట్‌మెంట్ అధికారులను తొలగించి వారి స్థానంలో అదనపు చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. అదనపు చీఫ్ సూపరింటెండెంట్లుగా ప్రైవేటు కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలకు అక్కడి ప్రిన్సిపాల్స్‌నే నియమించారు. దీంతో ప్రశ్నపత్రాల భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు పరీక్ష జరిగే సమయంలో కేంద్రాల్లో ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను కానీ, లెక్చరర్లను కానీ అనుమతించేవారు కాదు. ప్రస్తుతం వారు అధికారి హోదాలో వారు కేంద్రాల్లోనే తిష్ట వేస్తుండటంతో అనుమానాలు వస్తున్నాయి. డిపార్ట్‌మెంట్ అధికారులుగా ప్రభుత్వ అధికారులను నియమిస్తే వారికి టీఏ, డీఏలు చెల్లించాల్సి వస్తోందని, దీనిని తప్పించుకునేందుకు ఇంటర్ బోర్డు అధికారులు ఈ కొత్త విధానానికి తెరతీసి పరీక్ష నిర్వహణను గాలికొదిలేశారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విధానం చీఫ్‌లపై మరింత భారం పెరగనుంది.



నిమిషం నిబంధన: ఆర్ఐవో

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు నిమిషం లేటైనా అనుమతించేదిలేదని ఆర్ఐవో సైమన్ విక్టర్ తెలిపారు. పరీక్షలకు 22,366 మంది విద్యార్థుల హాజరవుతుండగా వీరిలో 15,291 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు 7,075 మంది ద్వితీయసంవత్సరం విద్యార్థులు హాజరవుతున్నారు. అందుకోసం 43 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. కంభం, పెదదోర్నాల, అర్థవీడు, యర్రగొండపాలెం కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను సున్నితమైనవిగా గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారన్నారు. పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్‌ను నిరోధించేందుకు రెండేసి చొప్పున సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయడంతోపాటు అన్ని పరీక్షా కేంద్రాలకు సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్లు అమ్ముకున్న ముగ్గురు టీచర్ల సస్పెన్షన్

ఒంగోలు(విద్య), మే 23 : దర్శి నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్లు ఒక రాజకీయపార్టీకి అనుకూలంగా వేసేందుకు లంచం తీసుకున్న ముగ్గురు టీచర్లపై సస్పెన్షన్ వేటుపడింది. జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ ముగ్గురిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర గురువారం ఉత్తర్వులు జారీచేశారు. దర్శి ముండ్లమూరు మండలాల్లో పనిచేస్తున్న ముగ్గురు టీచర్లు పోస్టల్ బ్యాలెట్‌కు లంచం తీసుకున్నట్లుగా ఎస్పీ విచారణలో తేలింది. దర్శి మండలం బండివెలిగండ్ల ఎంపీయూపీ స్కూలులో పనిచేస్తున్న ఎస్జీటీ , దర్శి మండలం రామచంద్రాపురంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న లేడీ టీచర్, ముండ్లమూరు మండలం శింగన్నపాలెం ఎంపీయూపీ స్కూలులో ఇంగ్లీషు స్కూలు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టీచర్ పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు డబ్బులు తీసుకున్నట్లుగా తేలింది. వారి వివరాలను ఎస్పీ తన నివేదికలో కలెక్టర్‌కు సమర్పించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడం, ఓటుకు లంచం తీసుకోవడం అభియోగాలపై ఆ ముగ్గురిని సస్పెండ్ చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ డీఈవోకు సిఫార్సు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

కౌంటింగ్‌కు కట్టుదిట్టం

- సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసు దృష్టి
- కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన వారి కోసం ఆరా
- బాణసంచా విక్రయాలపై నిషేధం



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(క్రైం), మే 23 : ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో పోలీసులు అప్రమత్తమవుతున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రక్రియ సజావుగా జరిగే విధంగా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రధానంగా దృష్టిసారించారు. అదేక్రమంలో నిఘా విభాగాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటూ ఎస్పీ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇప్పటికే నియోజకవర్గ కేంద్రాలలో మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటుగా భరోసాను కల్పిస్తున్నారు. నిత్యం ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో కార్డన్ సెర్చ్‌లు చేపట్టారు. కొత్త వ్యక్తుల కదలికలపైనా నిఘా పెట్టారు. పేలుడు పదార్థాలు, మారణాయుధాలు నిల్వ ఉంచారా? అనే కోణంలో జల్లెడపడుతున్నారు. అదేక్రమంలో జిల్లాలో సుమారుగా 26వేల మందిని బైండోవర్ చేశారు. అయితే అధికారపార్టీ వారి వ్యవహారం పోలీసులకు తలనొప్పిగా మారింది.

షీటర్లపై నిఘా అంతంతమాత్రమే

పోలీసుల ముందస్తు చర్యలతో ప్రజలలో కొంతమేరకు భరోసా వచ్చినప్పటికీ రౌడీ షీటర్లు, హిస్టరీ సీట్లు ఉన్న వారి కదలికలపై నిఘా కరువైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా అధికారపార్టీ నేతల అండదండలు ఉన్న షీటర్లు యథేచ్ఛగా తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎన్నికల లో పోటీచేసిన వారి వద్ద ఉన్న సెకండ్ కేడర్ నాయకులు దర్జాగా తిరుగుతున్నారు. ఎక్కువ వివాదాలకు కారణం అలాంటివారే అవుతున్నారు. కాని పోలీసులు సామాన్యులపై ప్రతాపం చూపిస్తున్నారు. దీంతో ప్రజలలో పోలీసులపై అసహనం ఏర్పడుతుంది. అంతేకాకుండా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బాణసంచా విక్రయాలను నిషేధించారు. పెట్రోల్ బంకుల వద్ద బాటిళ్లకు పెట్రోల్ కొట్టకూడదు అనే ఆంక్షలు విధించారు. ఇంకా రాత్రులు పోలీసు అధికారులు పల్లెనిద్ర చేస్తూ రోజుకో గ్రామంలో సమాచారం సేకరిస్తున్నారు.

బైండోవర్ చేసిన వారు కేసులో పాల్గొన్నారు

బైడోవర్ చేసిన వారిలో అనేకమంది అధికార పార్టీకి చెందిన వారు కోడ్ ఉల్లంఘించి వివిధ ఘటనలలో పాల్గొన్నారు. అలాగే కేసులు నమోదయ్యాయి. వారిపై విధించిన బీచ్ బాండ్లను రాబట్టే పనిలో పడిన పోలీసులకు ప్రస్తుతం అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని పార్టీల వారిని ఎన్నికల ముందు 26వేల మంది వరకు బైడోవర్ చేశారు. ఆ సమయంలో వారి వద్ద నుంచి రూ.లక్ష బాండ్లను తీసుకున్నారు. ఎలాంటి అల్లరు సృష్టించినా కేసులలో నిందితులుగా ఉన్నా రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుంది. కాగా ఎన్నికల ప్రచారం, పోలింగ్ సందర్భంగా జరిగిన కేసులలో బైడోవర్ చేసిన వారిలో వందమందికిపైగా పాల్గొన్నట్లు సమాచారం. దీంతో వారిని తహసీల్దార్ వద్దకు పిలిపించి రూ.లక్ష నగదు చూపించాల్సి ఉంది. ఇందుకు అధికారపార్టీకి చెందిన వారు అడ్డం తిరుగుతున్నారు. తాము తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చేదేమిటి అంటూ పోలీసులనే బెదిరిస్తున్న పరిస్థితి ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా కొంతమంది ఇతర ప్రాంతాలకు వెళ్లారు. దీంతో ఇది పోలీసులకు ఇబ్బందిగా మారింది. బైండోవర్ చేసిన తర్వాత చట్టప్రకారం ఎలాంటి గొడవలలో తలదూర్చకూడదు. అలా అల్లర్లకు పాల్పడితే వారు ఇచ్చిన బాండ్ విలువను ప్రభుత్వానికి చెల్లించాలి. కాగా అధికారుల వత్తిడి, అధికార పార్టీ నాయకుల బెదిరింపుల మధ్య పోలీసులు నలిగిపోతున్నారు.

వణికిస్తున్న కార్డన్ సెర్చ్

అన్ని స్టేషన్ పరిధిలో గత వారంరోజులుగా పోలీసులు కార్డన్ సెర్చ్‌కి శ్రీకారం పలికారు. ఆయాప్రాంతాల్లో కొత్త వ్యక్తులు నివాసం ఉంటున్నారా? ఎక్కడైనా మారణాయుధాలు, ప్రేలుడు పదార్థాలు ఉన్నాయా? అనే కోణంలో సోదాలు చేస్తున్నారు. అదేసమయంలో బైక్‌లపై తిరిగే వారిని తనిఖీలు చేస్తున్నారు. వారి వద్ద పత్రాలు ఉన్నాయా అని పరిశీలించి అనుమానం ఉంటే బైక్‌ను సీజ్ చేసి రవాణాశాఖకు అప్పగిస్తున్నారు. అక్కడ అధికారులు పత్రాలను పరిశీలించి రూ.5వేల నుంచి రూ.25వేల వరకు జరిమానాలు విధిస్తున్నారు. ఇది కొంత సామాన్యులకు ఇబ్బందిగా మారింది. ఉదాహరణకు కందుకూరు నుంచి ఒంగోలుకు బ్లడ్ ప్యాకెట్ కోసం బైక్‌పై వస్తుండగా మంగమూరు రోడ్డు జంక్షన్‌లో పోలీసులు తనిఖీల పేరుతో ఆపి సీజ్ చేశారు. దీంతో కందుకూరులో ఉన్న పేషెంటుకు సకాలంలో రక్తం చేరలేదు. ఇలాంటివి అనేక ఘటనలు ఉన్నాయి.

మాక్‌డ్రిల్

ఎస్పీ ఆదేశాల మేరకు అన్నీ నియోజకవర్గ కేంద్రాల్లో పోలీసులు మాక్‌డ్రిల్‌ను నిర్వహిస్తున్నారు. ముఖ్య కూడలిని ఎంచుకుని అక్కడ ర్యాలీలు, ధర్నాలు చేయడంతోపాటుగా రాళ్లు రువ్వడంలాంటి కవ్వింపు చర్యలు, అందుకు తీసుకునే చర్యలను ప్రజలకు అవగాహన కలిగేలా విధంగా పోలీసులు చేస్తున్నారు. అంతేకాకుండా ప్లాగ్‌మార్చ్ పేరుతో సమస్యాత్మక ప్రాంతాలలో పర్యటిస్తున్నారు.



మృతిచెందిన రేఖాప్రియాంక

రోడ్డు ప్రమాదంలో కారంచేడు మహిళ మృతి

- భర్త, పిల్లలకు తీవ్ర గాయాలు
- నల్గొండ జిల్లాలో ఘటన

కారంచేడు(పర్చూరు), మే 23 : నల్గొండ జిల్లాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారంచేడుకు చెందిన పొత్తూరి రేఖా ప్రియాంక వివాహిత మృతి చెందగా, భర్త పొత్తూరి వెంకట సుబ్రహ్మణ్యంకు తీవ్రగాయాలయ్యాయి. తిరుమలేశ్వరుని దర్శనం చేసుకొని కారులో హైదరాబాద్‌కు వెళుతుండగా ప్రమాదానికి గురయ్యారు. కారంచేడుకు చెందిన సుబ్రహ్మణ్యం కుటుంబం వ్యాపారం నిమిత్తం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. కుమారుని పుట్టు వెంట్రుకలు తీయించుకునేందుకు కారులో తన భార్య రేఖా ప్రియాంక, కుమారులు నిక్షిత్, తేజవర్ధన్‌తో తిరుమలకు వెళ్లారు. గురువారం వేకువ జామున కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రేఖా ప్రియాంక అక్కడికక్కడే మృతి చెందగా, భర్తకు తీవ్రగాయాలయ్యాయి. కారులో ఉన్న పిల్లలు స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

కారంచేడులో విషాదం...

సుబ్రహ్మణ్యం కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురికావడం, ప్రియాంక మృతి చెందడంతో కారంచేడు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

రేపు డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పరీక్ష

ఒంగోలు(కలెక్టరేట్), మే 23: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పరీక్ష ఈనెల 25న నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన ఐదు కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఒంగోలులోని నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చి సోషల్ యాక్షన్ ఇండియా, ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కాలేజీ, పేస్ ఇంజనీరింగ్ కాలేజీ, పెద్దారవీడు మండలం దేవరాజుగుట్టలోని కృష్ణ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మార్కాపురం మండలం దరిమడుగులోని డాక్టర్ శామ్యూల్ జార్జి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులను ఉదయం 7.30నుంచి 8.15 గంటల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులకు గ్రేస్ పిరియడ్ కింద ఉదయం 8.30 గంటల వరకు అనుమతి ఉంటుందని, తర్వాత వచ్చే వారిని ఎటువంటి పరిస్థితుల్లో అనుమతించబోమని డీఆర్వో స్పష్టం చేశారు.

శిథిలావస్థలో కొణిదెన ఆలయాలు

- పడిపోతున్న గోడలు
- పూజలకు వెళ్లాలంటే భయపడుతున్న భక్తులు
- పట్టించుకోని దేవదాయ, పురావస్తు శాఖ అధికారులు
- చోళరాజుల కట్టడాలు కనుమరుగయ్యే ప్రమాదం
- అభివృద్ధి చేయాలని గ్రామస్థుల విజ్ఞప్తి


చెన్నకేశవ స్వామి దేవాలయం

బల్లికురవ, మే 23 : క్రీస్తు శకం 11వ శతాబ్దపు నాటి పురాతన దేవాలయాలు ఇప్పుడు శిథిలావస్థకు చేరాయి. కొంత కాలానికి పూర్తిస్థాయిలో కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. దేవాలయాలకు భక్తితో వెళ్లాల్సిన భక్తులు ప్రతి రోజు భయం భయంతో వెళుతున్నారు. ఏ సమయంలో ఎటువైపు గోడలు పడిపోతాయో అని ఆందోళనలో ఉన్నారు. ఎంతో విలువ కలిగిన భూములు ఉన్న దేవాలయాల గురించి మాత్రం దేవదాయ శాఖ, పురావస్తు శాఖ అధికార్లు పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ప్రసిద్ధ దేవాలయాల గురించి ఎన్ని మార్లు ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టీపట్టనట్లు ఉన్నారని వారు ఆరోపిస్తున్నారు.

బల్లికురవ మండలం అంటే గుర్తుకు వచ్చేది చోళరాజులు పరిపాలించిన కొణిదెన గ్రామం. ఇక్కడ అప్పట్లో రాజులు 101 బావి, కోటి ఒక్క శిలను ప్రతిష్ఠించారు. అప్పట్లోనే గ్రామంలో రోజులు వేణుగోపాలస్వామి, చెన్నకేశవస్వామి దేవాలయాలను ప్రతిష్ఠించారు. వందల సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన రెండు దేవాలయాలు ఇప్పుడు శిథిలావస్థకు చేరాయి. అలానే ఈ గ్రామంలో ఎన్నో శాసనాలు కూడా ఉన్నాయి. పలు మార్లు పురావస్తు శాఖ అధికారులు కూడా ఈ గ్రామాన్ని సందర్శించి ప్రసిద్ధ దేవాలయాలను అభివృద్ధి చేస్తామని గ్రామస్థులకు చెప్పారు. అయినప్పటికీ ఇంత వరకు ఈ దేవాలయాల అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. దీంతో దేవాలయాల గోడలు పడిపోతున్నాయి. దేవాలయంలో ప్రశాంతంగా కూర్చుని పూజలు చేయాలన్న భక్తులు భయాందోళన చెందుతున్నారు. దేవదాయ శాఖ, పురావస్తు శాఖ అధికారులు ఒకరిపై ఒకరు అభివృద్ధి పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆరు మసాల కిందట పడిపోయిన చెన్నకేశవ స్వామి దేవాలయ గోడ నిర్మాణానికి ఇంత వరకు ప్రతిపాదనలు కూడా పంపలేదని ప్రజలు ఆరో


శిథిలావస్థలో వేణుగోపాలస్వామి మందిరం


కూలిన చెన్నకేశవస్వామి ఆలయ గోడలు

పిస్తున్నారు. ఇటీవల గ్రామ ప్రజలు ఇదే గ్రామంలో చోళరాజుల కాలంనాటి బ్రహ్మ గుండంను విరాళాలతో అభివృద్ధి చేపట్టారు. దేవాలయాలను నిర్మించాలంటే నిధులు పెద్ద ఎత్తున కావాలని ప్రభుత్వం వెంటనే స్పందించి పురాతన దేవాలయాలను అభివృద్ధి పరచాలని ప్రజలు కోరుతున్నారు. దేవాలయాల అర్చక స్వాములు కూడా దేవాలయాలను అభివృద్ధి పరచాలని ఇప్పటికే గ్రామ ప్రజలను కలిసి పలుమార్లు విన్నపాలు కూడా చేశారు. దేవాలయాలకు గతంలో వందల ఎకరాల భూములు ఉన్నాయని ఇప్పుడు అభూములు కొన్ని అక్రమణలో ఉన్నాయని తక్షణమే ప్రభుత్వం రికార్డు ప్రకారం దేవాలయాల భూములను వెలికి తీసి దేవాలయాలను అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఆలయానికి వెళ్లాలంటే భయంగా ఉంది



మా గ్రామంలో పురాతన కాలంలో చోళరాజులు ఏర్పాటు చేసిన ప్రసిద్ధ దేవాలయాలు ఇప్పుడు శిథిలావస్థకు చేరాయి. సుమారు 11 వందల సంవత్సరాల కాలం నాటి దేవాలయాలు కావడంవలన గోడలు పడిపోతున్నాయి. భక్తులు ఆలయానికి వెళ్లాలంటే భయపడుతున్నారు. వెంటనే దేవాదాయ శాఖ పురాతన దేవాలయాలను అభివృద్ధి చేయాలి. అలానే గ్రామంలో ఉన్న శాసనాలను భద్రపరచాలి.

- గుత్తి శ్రీనివాసరావు, కొణిదెన

అధికారులకు చెప్పాం



పురాతన దేవాలయాలు దెబ్బతిన్న విషయాన్ని అధికారులకు చెప్పాం. గతంలో కూడా వేణుగోపాల స్వామి దేవాలయం గోడ దెబ్బతినగా వెంటనే ఈ విషయాన్ని గ్రామస్థులకు అధికారులకు సమాచారం అందించాం. అలానే ఇప్పుడు కొండ మీద ఉన్న చెన్నకేశవ స్వామి దేవాలయం గోడలు పడిపోతున్నాయి. అధికారులు వెంటనే స్పందించాలి. పూ జలు చేసే సమయంలో లోపల ఉండే భక్తులు భయపడుతున్నారు.

- అయినవోలు శోభనాచార్యులు, దేవాలయాల అర్చక స్వామి


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో లక్ష తమలపాకుల పూజ

అద్దంకిటౌన్, మే 23: శింగరకొండ ప్రసన్నాంజనేయల స్వామివారికి గురువారం పౌర్ణమి సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నాంజనేయస్వామికి లక్ష తమలపూలతో ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

కమనీయం లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామి కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వామి

వేటపాలెం(చీరాల), మే 23 : మండల పరిధిలోని రామన్నపేటలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల కల్యాణ మహోత్సవం గురువారం శాస్త్రోక్తంగా అత్యంత వైభవంగా జరిగింది. పసుపు, కుంకుమ వితరణ జరిగింది. కల్యాణ మహోత్సవంలో పృథ్వీ చెంచుసుబ్బారావు, నాగవేణి దంపతులు పీటల మీద కూర్చుని కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, సుజాత దంపతులు పాల్గొని స్వామివారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలను బహూకరించారు. కల్యాణ క్రతవు అనంతరం సుమారు 1800 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. అనంతరం శ్రీ విఘ్నేశ్వర కనక నాగారపమ్మ కోలాట భక్త సమాజం వారిచే కోలాట ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో బులసల సాంబశివరావు, రామలింగం, లక్ష్మీప్రసాద రావు, జడ్పీటీసీ సభ్యుడు బండ్ల తిరుమలాదేవి, బండ్ల బాబు, గమ్మడి సుశీల, పేరిసెట్ల పద్మజ, పిచ్చుక సునీత, సజ్జా రాజ్యలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు బండ్ల సురేంద్ర బాబు, ఉమామహేశ్వరరావు, దేవన కిషోర్, బోనసల కిషోర్, బట్టా సురేంద్ర, కర్ణ కుమారస్వామి, ఉమ్మిడి భద్రయ్య, సోమశేఖరరావు, వెంకటేశ్వర్లు, బాలసుబ్రమణ్యం, లవకుమార్, యలమందేశ్వరరావు, తులసి బాబు, రామలక్ష్మి, విజయపర్వత రెడ్డి, రేణుక, మాధతి, ప్రసన్న లక్ష్మి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


విచారిస్తున్న డీఎల్‌పీవో హనుమంతరావు

నిధుల దుర్వినియోగంపై విచారణ

ఇంకొల్లు, మే 23 : ఇంకొల్లు పంచాయతీలో రెండేళ్ల కిందట అప్పటి పంచాయతీ కార్యదర్శి మరియదాసు సంతకాన్ని సర్పంచ్ ఏజర్ల ప్రసన్న ఫోర్జరీ చేసి నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు వచ్చిన అభియోగంపై డీఎల్‌పీవో హనుమంతరావు గురువారం ఇంకొల్లులో విచారణ చేపట్టారు. అప్పటిలో కంప్యూటర్ ఆపరేటర్, సర్పంచ్ కుమ్మక్కై కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి బిల్లులు అప్‌లోడ్ చేసి నిధులను డ్రా చేసినట్లు 11వ వార్డు మెంబరు రావి మధు కూడా ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్ ఆఫ్ పంచాయతీరాజ్ ఆదేశాల మేరకు గురువారం డీఎల్‌పీవో విచారణ చేసారు. అప్పటి కార్యదర్శి మరియదాసు, గుమస్తా కృపాచారి, సర్పంచ్ ఏజర్ల ప్రసన్నను విచారించి వివరాలు సేకరించారు. అనంతరం పంచాయతీ కార్మికులు తమకు 3 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే ఇప్పించాలని డీఎల్‌పీవోకు విన్నవించారు. ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే చేపించాలని, కార్మికులకు 2 నెలల జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి కోటి నాగయ్యకు సూచించారు.

నర్సరీ పెంపకానికి లైసెన్సులు తీసుకోవాలి

మార్టూరు, మే 23 : ఈ ఏడాది కొత్తగా నర్సరీలను సాగు చేసే రైతులు తప్పనిసరిగా లైసెన్సులను తీసుకోవాలని ఉద్యాన అధికారి బీ హనుమంతనాయక్ గురువారం ప్రకటనలో కోరారు. మార్టూరు బల్లికురవ సంతమాగులూరు మండలాలలో నూతనంగా నర్సరీలను సాగు చేసే వారు లైసెన్సుల కోసం ఉద్యాన శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. అదేవిధంగా గతంలో నర్సరీలను నిర్వహించే రైతులు రిజిస్టర్లు, బిల్లులు, నారు అమ్మిన వారి వివరాలు, ట్రేలు వినియోగం తదితర వివరాలతో తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. అంతేగాకుండా ఈ నిబంధనలను పాటించాలని గురువారం మార్టూరులోని పలువురు నర్సరీ యజమానులకు హనుమంత నాయక్ నోటీసులను జారీ చేశారు.

నేటి నుంచి టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ

అద్దంకిటౌన్, మే 23 : పదివ తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. టెన్త్ సప్లిమెంటరీ ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరుగుతాయని ఎంఈవో-2 బీ సుధాకరరావు తెలిపారు. కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగనున్నాయని, మొత్తం 85 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వివరించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయని అధికారి రాజేశ్వరమ్మ తెలిపారు. అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, విశ్వభారతి జూనియర్ కళాశాలలోని కేంద్రాలలో జరుగుతాయని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి 43 మంది రాయనున్నారని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ద్వితీయ సంవత్సరానికి 45 మంది విద్యార్థులు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు.

మార్టూరులో..

మార్టూరు : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. మార్టూరులో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు పరీక్షా కేంద్రాన్ని కేటాయించారు. మార్టూరులోని శ్రీహర్షిణి, రాయల్ జూనియర్ కాలేజీ, వలపర్లలోని ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థులు, బల్లికురవ, యద్దనపూడి, మార్టూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఈ కేంద్రంలో పరీక్షలు రాయనున్నారు. వారితో పాటు బెటర్ మెంట్ మార్కులు కోసం రాసే విద్యార్థులు కూడా ఇక్కడే పరీక్షలు రాయనున్నారు. అందుకు సంబంధించి పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు 13 గదులను కేటాయించామని, వాటిలో వసతులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డీవీ శ్రీనివాసరావు తెలిపారు.

ఆటో ఢీకొట్టడంపై ఫిర్యాదు

మార్టూరు, మే 23 : మండలంలో వలపర్ల కోనంకి గ్రామాల మధ్య రహదారిలో ద్విచక్రవాహనంపై ఇద్దరు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టినట్లు గురువారం పోలీస్ స్టేషన్‌లో బొనిగల చరణ్ తేజ అనే యువకుడు ఫిర్యాదు చేశాడు. ఈ ప్రమాదంలో గాయపడిన చరణ్‌తేజ వారం రోజులుగా చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని ఫిర్యాదు మేరకు గత శుక్రవారం రాత్రి వలపర్ల గ్రామానికి చెందిన చరణ్ తేజ స్నేహితుడు దిబ్బయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై కోనంకి గ్రామానికి వస్తున్నారు. అదే సమయంలో బల్లికురవ మండలం వల్లాపల్లి గ్రామానికి చెందిన ఆటో వాలా ఎదురుగా వస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దాంతో ద్విచక్ర వాహనం రోడ్డుపై పడి పోగా చరణ్‌తేజ కాలికి చేతికి గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మహిళపై దాడి చేశారని ఫిర్యాదు

మార్టూరు, మే 23 : మార్టూరు గ్రామ పంచాయతీలోని సుగాలి కాలనీలో శ్రీను నాయక్‌తో పాటు 6గురు వ్యక్తులు బుధవారం రాత్రి తనపై దాడి చేశారని కేశా వతు లక్ష్మీబాయి గురువారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదులో తన ఇంటి నిర్మాణానికి ఇసుక తోలించుకున్న విషయంపై శ్రీను నాయక్‌తో వివాదం జరగగా ఈ విషయమై సోదరునితో కలిసి శ్రీనునాయక్‌తో మాట్లాడుతుండగా శ్రీనునాయక్‌తో పాటు అదేకాలనీకి చెందిన మరో 6 గురు వ్యక్తులు తనపై దాడి చేశారని పేర్కొనటం జరిగింది. ఈ విషయమై పోలీసులు వి చారణ చేస్తున్నారు.

శాంతిభద్రతలకు సహకరించండి



మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపతిరావు

పంగులూరు, మే 23 : మండల ప్ర జలు శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఎస్ఐ కేకే తిరుపతిరావు కోరారు. రేణంగివరం పోలీస్ స్టేషన్లో ఎస్ఐ తిరుపతిరావు గురువారం విలే కరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అ మలులో ఉన్నందున నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు మాత్రమే పెట్రోలు విక్రయించాలని బాటిల్స్‌లో కానీ, క్యాన్‌లలోగానీ పెట్రోలు విక్రయాలు చేయరాదని బంక్ నిర్వాహకులకు సూచించారు. క్రాకర్స్ విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలలో అనుమతి లే కుండా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించా రు. గ్రామాలలో ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదని రాజకీయ పార్టీలకు ఎస్ఐ సూ చించారు.

అత్తపై కోడలు, మనవడు దాడి

అద్దంకిటౌన్, మే 23 : అత్తపై కోడలు, మనవడు దాడి చేసి గాయపరిచిన సంఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రత్నకుమారి తెలిపారు. మండలంలోని నాగులపాడు గ్రామానికి చెందిన మంగమూరి లక్ష్మిపై కోడలు సుశీల, మనుమడు నవదీప్ బుధవారం దాడి చేసి గాయపరిచారని లక్ష్మి ఇచ్చిన ఫిర్యారు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రత్నకుమారి తెలిపారు.

ప్రమాదవశాత్తు యువకుడి మృతి

పంగులూరు, మే 23 : పంగులూరుకు చెందిన రమేష్(22) అనే యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో బీసీ కాలనీలో విషాదం నెలకుంది. గ్రామానికి చెందిన రమేష్ అనే యువకుడు హైదరాబాద్‌లో యాక్సిస్ బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం కూకట్‌పల్లి నుంచి మెట్రోలో విధులకు వెళ్తూ ట్రైన్ దిగే సమయంలో ప్రమాదానికి గురై మృతి చెందినట్లు సమాచారం. రమేష్ మృతదేహాన్ని గురువారం పంగులూరుకు తీసుకొచ్చారు.

యువకునికి గాయాలు

పంగులూరులో దాసరి రాంబాబు అనే యువకుడు గ్రామంలో పెయింటింగ్ పని చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సీ కాలనీకి చెందిన చెందిన దాసరి రాంబాబు గురువారం గ్రామంలో ఓ ఇంటికి పెయింటింగ్ వేస్తూ ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. గాయపడిన రాంబాబును కుటుంబ సభ్యులు ఒంగోలుకు తరలించారు.


మాట్లాడుతున్న డీఐవో వెంకటేశ్వర్లు

వైద్య వివరాలను వందశాతం నమోదు చేయాలి

అద్దంకిటౌన్, మే 23 : పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న అన్ని వైద్య వివరాలను సంబంధిత పోర్టల్‌లో వంద శాతం నమోదు చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ (డీఐవో) టీ వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం స్థానిక గీతా మందిర్‌లో అద్దంకి మోదేపల్లి పీహెచ్‌సీ, అద్దంకి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని హెల్త్ సిబ్బందికి హెల్త్ మేనేజిమెంట్ హెల్త్ సిస్టమ్ (హెచ్ఎంఐఎస్) పోర్టల్‌లో వివరాల నమోదు ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఐవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వానికి వివరాలు పంపించడంలో ఈ హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. దీనిలో చేసిన మార్పులను గుర్తించి తెలుసుకుని వైద్య సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. దీని ద్వారా ఆ యా ఆరోగ్య కేంద్రాలలో జరుగుతున్న అన్ని ఆరోగ్య సేవలను వారికి శిక్షణ ఇచ్చిన పోర్టల్‌లో విధిగా నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా గణాంకాధికారి (డీఎస్‌వో) పి.వేణు మాట్లాడుతూ హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో పలు మార్పులు చేయడం జరిగిందని వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాటిలో గర్భిణిల నమోదు, కాన్పుల వివరాలు, రక్తహీనత వివరాలు, వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ , ప్రభుత్వ పాఠశాల ఆ రోగ్య కార్యక్రమాలు, సేవల వంటివి హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు ఎన్. మల్లికార్జునరావు, డీ నాగేశ్వరరావు, డాక్టర్ శ్రీ హర్ష, డాక్టర్ హరికృష్ణ, ఎంపీహెచ్‌వో నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ నరసింహుని ఊరేగింపు


ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

అద్దంకిటౌన్, మే 23 : అద్దంకిలోని శ్రీ మాధవస్వామి ఆలయంలో లక్ష్మీ నరసింహస్వామి జయంతి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి స్వామివారి ఉత్సవ మూర్తులును అద్దంకి పట్టణంలోని పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామివారి హారతులు ఇచ్చి స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదం పొందారు.

ట్రాక్టర్‌ని ఢీకొన్న లారీ

ఒకరు మృతి, మరొకరికి గాయాలు

అద్దంకిటౌన్, మే 23 : మొక్కజొన్న విత్తనాల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక వైపున వస్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొట్టగా ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిలోని శ్రీనివాసనగర్ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడుకు చెందిన రావులపల్లి రవి, కల్లూరి జగదీష్ ట్రాక్టర్‌లో మొక్కజొన్న విత్తనాలతో అద్దంకి మండలం ఉప్పలపాడు గ్రామానికి వెళ్తున్నారు. శ్రీనివాసనగర్ వద్దకు వచ్చే సరికి వెనుక వస్తున్న లారీ ట్రాక్టర్‌ను ఢీకొంది. ట్రాక్టర్ నడుపుతున్న రవికి గాయాలు కాగా పక్కన కూర్చున కల్లూరి జగదీష్(25) రోడ్డుపై పడగా అతని తలపై నుంచి లారీ వెళ్లినట్లు తెలుస్తుంది. దీంతో జగదీష్ మృతి చెందాడు. గాయపడిన రవిని 108లో నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైభవంగా ఆంజనేయస్వామి తిరునాళ్ల

వేలాదిగా తరలివచ్చిన భక్తులు


కల్యాణాన్ని నిర్వహిస్తున్న దంపతులు, హాజరైన భక్తజనం

పావులూరు(ఇంకొల్లు), మే 23 : మండలంలోని శ్రీ పొలిమేర వీరాంజనేయస్వామి 70వ వార్షిక జయంతి మహోత్సవాలు మూడు రోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. చివరి రోజు గురువారం శ్రీ సువర్చలా సహిత శ్రీ వీరాంజనేయ స్వామి వారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. దంపతులు పీటలమీద కూర్చొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని చూసేందుకు మండుటెండను లెక్క చేయకుండా మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లి స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం పలు స్వచ్ఛంద సేవా సంస్థలు మజ్జిగ, తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేశారు. తిరునాళ్లకు చుట్టుపక్కల మండలాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి సన్నిధిలో విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్‌కు సమస్యలు తలెత్తకుండా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరావు తెలిపారు.


మాట్లాడుతున్న కొండయ్య

ప్రణాళికాబద్ధంగా పనిచేద్దాం

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య

చీరాల, మే 23 : విజయావకాశాలు పుష్కలంగా మనకే ఉన్నాయి. ఫలితాల అనంతరం ప్రణాళికాబద్ధంగా పనిచేద్దాం. సమిష్టి కార్యాచరణతో సత్ఫలితాలు సాధిద్దామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. టీడీపీ కార్యాలయంలో గురువారం ముఖ్యనాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కొండయ్య మాట్లాడారు. ఫలితాల అనంతరం పట్టణంలోని, గ్రామాల్లోను అన్ని వార్డుల్లో పర్యటిస్తామన్నారు. ఆ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణ, అమలుకు సంబంధించి నిర్దిష్ట అడుగులు వేద్దామన్నారు. గెలుపు మనదేనని నాయకులు కొండయ్యను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు జీ చంద్రమౌళి, గవిని నారాయణ, జంగిలి రామారావు, గుర్రం వెంకటేశ్వర్లు, లక్ష్మి, నరశింహారావు, వెంగళ భరత్, సజ్జా వెంకట సుబ్బారావు, అవ్వారు సాంబయ్య, తేలప్రోలు నాగేశ్వరరావు, నిమ్మల పిచ్చయ్య, కౌతవరపు జనార్ధనరావు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివార్ల కల్యాణ మహోత్సవం


కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేదపండితులు

చెరుకూరు(పర్చూరు), మే 23: పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ అగస్త్యేశ్వరస్వామి వార్ల వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన స్వామివార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణతో, పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తుల నడుమ కల్యాణ తంతు కనులపండువగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యాక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎలాంటి అసౌక ర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.నాగయ్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


విశేష అలంకరణలో స్వామిఅమ్మవార్లు


కనులపండువగా లలితాపరమేశ్వరి కల్యాణోత్సవం

చినగంజాం, మే 23 : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో వేంచేసిన లలితాపరమేశ్వరి సమేత రామకోటేశ్వర స్వామి దేవస్థానంలో లలితాపరమేశ్వరి అమ్మవారి 30వ వార్షిక కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు హనుమంతరావు స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలను ప్రత్యేకంగా గావించారు. లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు నూతన వస్త్రాలను ధరించి, వివిధ రకాల పూలమాలలతో విశేష అలంకరణ చేశారు. వేద మంత్రోచ్చరణతో దంపతులతో శాస్త్రోక్తంగా అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి తరించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో విశేష అలంకరణతో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి మేళతాళాలు, మహిళల కోలాట ప్రదర్శనలతో సోపిరాల గ్రామంలోని పురవీధులలో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏకాంత సేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

పంగులూరు, మే 23 : పంగులూరులో శ్రీ భీమలింగేశ్వరస్వామి దేవస్థాన 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు స్వామి వారి ఏకాంత సేవతో గురువారం ముగిసాయి. బలిహరణ, వసంతసేవ, త్రిశూలస్నానం, పూర్ణాహుతి కార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గరటయ్య ప్రారంభించారు. సాయంత్రం ధ్వజారోహణ, మౌనబలి, ఏకాంతసేవ కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ శైవాగమ పండితులు పేటేటి ఉదయ భాస్కర శర్మ నేతృత్వంలో సాగిన కార్యక్రమాల్లో అర్చక స్వాములు చందలూరి సునీల్ కుమార్ శర్మ, కారంచేటి సాంబశివరావు, పలువురు గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 24 మే 2024





దారుణంగా ఉన్న గాంధీనగర్ రోడ్డు



నెల్లూరులోని అపోలో ఆసుపత్రికి వెళ్లే రహదారి దుస్థితి



గుంతలమయంగా నగరంలోని పొదలకూరు రహదారి

టెండర్లతోనే సరి..

పనులు చేయరు మరి !

- జిల్లాలో ఎక్కడ చూసినా గుంతల రోడ్లే...!
- మూడేళ్లుగా అవస్థలు పడుతున్న ప్రజలు
- కనీసం ప్యాచ్ వర్కులు కూడా చేయని ప్రభుత్వం
- బిల్లులివ్వకపోవడంతో ముందుకు రాని కాంట్రాక్టర్లు

నెల్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాజీవనంలోనూ, అభివృద్ధి క్రమంలోనూ రోడ్లు ఎంతో కీలకం. రహదారులు ఎంత బాగుంటాయో, ఆ ప్రాంతం అంత అభివృద్ధి చెందిందని అర్థం. కానీ జిల్లాలోని రోడ్లను చూస్తే ఎంత దారుణంగా ఉన్నాయో తెలుస్తుంది. ఇక ఆరోడ్లపై నిత్యం ప్రయాణమంటే నరకం కళ్ల ముందు కనిపిస్తుంది. జిల్లా కేంద్రం మొదలు చిన్న గ్రామం వరకు రహదారులను పరిశీలిస్తే ఏమున్నది గర్వకారణం అనిపిస్తుంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి రెండేళ్లు కొంత బాగున్న రోడ్లు... ఆ తర్వాత వరదలు, భారీ వర్షాలకు దారుణంగా దెబ్బతిన్నాయి. కానీ అప్పటి నుంచి వీటిని పట్టించుకున్న వారు లేరు. రోడ్డు మొత్తాన్ని బాగు చేయడం అటుంచితే కనీసం గుంతలు పూడ్చే పనులు కూడా చేపట్టలేదు. గత ప్రభుత్వంలో టెండర్లు పిలిచిన ఏఐబీ పనులు కూడా ఇంకా పూర్తి కాలేదంటేనే ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక మూడేళ్ల క్రితం పిలిచిన ఎన్డీబీ వర్కులయితే డబ్బుల్లేక ఆగిపోయాయి. ఆఖరుకు నెల్లూరులో కీలకమైన పొదలకూరు రోడ్డును కూడా అభివృద్ధి చేయలేకపోయారు.

ప్యాచ్ వర్కులు కూడా చేయలేదు..

ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్ల మొత్తాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వం వద్ద నిధుల్లేవు. ఒకవేళ ప్రభుత్వం టెండర్లు పిలిచినా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడంలేదు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. దీంతో జిల్లాలోని ఆర్అండ్‌బీ రోడ్లకు కనీసం ప్యాచ్‌లయినా వేయాలని ఎన్నికలకు ముందు రూ.10 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. నెల్లూరు, కావలి డివిజన్లకు రూ.5 కోట్లు, గూడూరు డివిజన్‌కు మరో రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో జనవరిలో ఆర్అండ్‌బీ అధికారులు సుమారు వంద ప్యాచ్ వర్కులకు టెండర్లు పిలిచారు. ఒక్కో వర్కు విలువ సరాసరి రూ.10 లక్షలుగా ఉంది. అయితే ఏ ఒక్క పనికీ కాంట్రాక్టర్లు టెండర్లు వేయలేదు. దీంతో ఫిబ్రవరిలో రెండోసారి టెండర్లు పిలిచారు. ఎన్నికల సమయంలో ఇబ్బందులు వస్తాయని భావించిన వైసీపీ నాయకులు, కొందరు కాంట్రాక్టర్లపై ఒత్తిళ్లు తేవడంతో కొన్ని పనులకు మాత్రమే టెండర్లు దాఖలయ్యాయి. కానీ వారిలో కొంతమంది అగ్రిమెంటు చేసుకున్నారు. ఇంకొంత మంది చేసుకోవాల్సి ఉంది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఒక్క ప్యాచ్ వర్కు కూడా పూర్తి చేయలేదు.

అత్యవసర పనులకూ దిక్కులేదు...

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగినప్పుడు ఐప్యాక్ టీం సర్వే చేసింది. ఆ సర్వే ప్రకారం రోడ్లు గుంతలమయంగా ఉండడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని గుర్తించారు. దీంతో జిల్లాలో కనీసం 23 ప్రధాన కనెక్టివిటీ రోడ్లను అత్యవసరంగా బాగు చేయాలని ఐప్యాక్ టీం ప్రభుత్వానికి సూచించింది. ఈ క్రమంలో ఆ రోడ్లను బాగు చేసేందుకు రూ.87 కోట్లకు గతేడాది జూలైలో అనుమతులు మంజూరు చేశారు. అయితే అప్పటికే భారీగా బిల్లులు పెండింగ్ ఉండడం, ప్రభుత్వ తీరుతో విసిగి వేసారిన కాంట్రాక్టర్లు ఆ వర్కులకు టెండర్లు వేయకూడదని అసోసియేషన్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో ప్రభుత్వ పెద్దలు కాంట్రాక్టర్లతో సమావేశమై పెండింగ్ బిల్లులను విడతల వారీగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఐప్యాక్ వర్కులకు టెండర్లు వేయాలని కోరారు. దీన్ని నమ్మిన కాంట్రాక్టర్లు జిల్లాలో ఆ 23 వర్కు లకు టెండర్లు వేశారు.

గుంతలమయంగా గ్రామీణ రోడ్లు

కానీ ఇచ్చిన మాట ప్రకారం ప్రభు త్వమేమో పెండింగ్ బిల్లులు చెల్లించ లేదు. దీంతో అగ్రి మెంట్లు చేసుకో కుండా ఆగిపో యారు. అయితే ఈ దఫా నిబంధ నలను తెరమీదకు తెచ్చి అగ్రిమెంట్లు చేసుకోకపోతే బ్లాక్ లిస్టులో పెడతామని కాంట్రాక్టర్లను బెదిరించారు. దీంతో విధిలేక కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ చేసుకు న్నారు. కానీ పనులు మాత్రం మొదలు పెట్టలేదు. ఇటీవల రెండు, మూడు రోడ్ల పనులు మాత్రం మొదలుపెట్టారు. ఈ ప్రభావం ప్రజలపై తీవ్రంగా పడుతోంది. రోడ్డు మొత్తాన్ని బాగు చేయడం అటుం చితే కనీసం భారీ గుంతలను పూడ్చా లని వేడుకుం టున్న ప్రజలకు మరికొన్ని రోజులు ఆ కష్టం కూడా తీరేలా కనిపించడం లేదు.

రెండేళ్లక్రితం పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తు న్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ రోడ్లను రూ.1100 కోట్ల అగ్రికల్చరల్ మార్కెటింగ్ నిధులు(ఏఎంసీ)తో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో 195 రోడ్ల అభివృద్ధికి రూ.155.60 కోట్లతో టెండర్లు పిలిచారు. 591 కిలోమీటర్లను 34 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవగా, కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. మూడు సార్లు టెండర్లు పిలవగా కేవలం ఎనిమిది ప్యాకేజీలకు మాత్రమే టెండర్లు దాఖలయ్యాయి. అప్పటికే భారీగా బిల్లులు పెండింగ్ ఉండడం, పనులు చేస్తే బిల్లులు ఇస్తారో లేదోనన్న భయం ఉండడంతో రోడ్ల వర్కులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. అప్పుడు కూడా రాష్ట్ర అధికారులు, ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చినా వారు టెండర్లు వేయలేదు. దీంతో పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధి అనేది ప్రచార ఆర్భాటానికే పరిమితమైంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో తాజాగా మరోసారి ఈ వర్కులకు టెండర్లు పిలిచారు. గతేడాది ఎవరూ టెండర్లు వేయకపోవడంతో కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారం అంచనా విలువ పెరిగింది. ఇలా కూడా ప్రభుత్వ ఖజానాపై భారం పడింది. అయినా ఈ రోడ్లను అభివృద్ధి చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. గ్రామాల్లో ప్రధాన లింకు రోడ్లుగా ఈ రోడ్లు గుంతలతో దారుణంగా ఉన్నాయి. నిత్యం ఈ రోడ్లపై ప్రభుత్వాన్ని తిట్టుకుంటూ ప్రజలు ప్రయాణిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



పెంచలకోనలో గురువారం రాత్రి నిర్వహించిన శ్రీవారి రథోత్సవం

- కనులపండువగా కల్యాణోత్సవం
- స్వామివారి కల్యాణంతోపాటు సామూహిక వివాహాలు
- గజవాహనంపై క్షేత్రోత్సవం

వైభవంగా
శ్రీవారి రథోత్సవం

రాపూరు(డక్కిలి), మే 23 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో గురువారం ఉదయం చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత పెంచలస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. ముందుగా కల్యాణ మండపాన్ని శోభాయమానంగా అలంకరించి, వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నమధ్య స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోత్తంగా నిర్వహించారు. ఆలయ అధికారులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామి కల్యాణంతోపాటు పలు జంటలు సాముహిక వివాహాలు చేసుకొని ఒక్కటయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని తిలకించారు.కాగా వివిధ మండపాల్లో జరిగే విశేష పూజాకార్యక్రమాలను భారీ స్క్రీన్ల ద్వారా భక్తులు వీక్షించే అవకాశం కల్పించారు. కల్యాణం అనంతరం ఆలయ అర్చకులు చేపట్టిన ఎదుర్కోలు ఉత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఏసీ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, డీసీ కే విజయసాగర్ సాగరబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరీష్, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, శశికుమార్ స్వామి, గుండ్లూరు సీతారామయ్య, పెంచలయ్య, బాలాజీ, మధు స్వామి పాల్గొన్నారు.

● వైభవంగా రథోత్సవం

గురువారం రాత్రి ఉభయ దేవేరులతో కలిసి పెంచలస్వామి తిరుత్తేరుపై ఊరేగు తూ భక్తులకు దర్శనమిచ్చారు.ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను కొలువు దీర్చి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారి ఆలయం నుంచి కోన ముఖద్వారం వరకు భక్తులు రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గజవాహనంపై క్షేత్రోత్సవం నిర్వహించారు.

● నేడు తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8.30 గంటలకు వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం, 10 గంటలకు అశ్వవాహనసేవ, రాత్రి 11.30 గంటలకు ధ్వాజావరోహణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ డీసీ సాగర్‌బాబు తెలిపారు.

● కోనంతా జనమే జనం

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కోనంతా జనసంద్రంగా మారింది. కొనుగోలు దారులతో దుకాణాలన్నీ కిటకిటలాడాయి. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాపూరు ఎస్ఐ మాలాద్రి తెలిపారు.



తేరుపై వేదగిరీశుడి విహారం

నెల్లూరురూరల్: వేదగిరిపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామి గురువారం ఉభయ దేవేరులతో కలిసి మెట్ల మార్గాన నరసింహ పురానికి చేరుకుని రథంపై ఊరేగారు. విశేషంగా తరలి వచ్చిన భక్తులు గోవిందా... గోవిందా... అంటూ రథాన్ని ముందుకు లాగారు. బిందెలతో నీళ్ల నేలపై పోస్తూ కర్పూర హారతులతో జనం రథోత్సవానికి స్వాగతం పలికారు. నరసింహపుర వీధుల్లో 1.30 గంటల పాటు రథోత్సవం సాగింది.

● వేడుకగా కూర్మ జయంతి

కూర్మ జయంతిని పురస్కరించుకుని గురువారం కూర్మ అవ తారంలోని స్వామివారి విగ్రహం వద్ద అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో స్వామి, అమ్మ వార్లను మెట్ల మార్గంలో తిరిగి ఆలయంలోకి తోడ్కొని వెళ్లారు. కాగా వేదగిరి బ్రహ్మోత్సవాల్లో దాతలు పోటీ పడి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను జిల్లా దేవదా యశాఖ అధికారి శ్రీనివా సురావు, ఆలయ ఈవో గిరికృష్ణ పర్యవేక్షించారు.

నరసింహపురం వీధుల్లో సాగుతున్న వేదగిరీశుడి రథోత్సవం, (ఇన్‌సర్ట్‌లో) రథంపై కొలువుతీరిన స్వామి, అమ్మవార్లు



కోనలో పెంచలోరి కల్యాణం

ఓట్ల లెక్కింపు
ప్రశాంతంగా జరిగేలా...!

- గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్
- జిల్లావ్యాప్తంగా కార్డన్ సెర్చ్
- సమస్యాత్మక గ్రామాల్లో ఎస్పీ ముఖాముఖి

నెల్లూరు(క్రైం), మే 23: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ముందు పోలీసుశాఖ నిరంతరం నిఘా ఉంచడం సర్వసాధారణం. అయితే ఈసారి పోలింగ్ ముగిశాక కూడా పోలీసులు, కేంద్రసాయుధ బలగాలు గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఫ్లాగ్‌మార్చ్‌లు, కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నారు. పోలింగ్ తరువాత రాష్ట్రంలో జరిగిన హింసాకాండ దృష్ట్యా ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేలా చూసేందుకు వారు ఈ చర్యలు చేపట్టారు. అంతేకాక సమస్యాత్మక, సున్నితమైన గ్రామాల్లో జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ పర్యటిస్తూ గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహిస్తున్నారు. అల్లర్లు, వివాదాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. జూన్4న ఓట్ల లెక్కింపును ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసుకుంది. అందులో భాగంగా కృష్ణాపట్నం నుంచి ఉలవపాడు వరకు ఉన్న మత్స్యకారులతో జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ ముఖాముఖి నిర్వహిస్తున్నారు. గ్రామకాపులు, పెద్దలు, గ్రామస్థులతో సమావేశం నిర్వహించి ఓట్ల లెక్కింపునకు సహకరించారని విజ్ఞప్తి చేస్తున్నారు. అల్లర్లకు, గొడవల జోలికి వెళితే సహించేది లేదని హెచ్చరిస్తున్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహిస్తున్నారు.



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు(ఫైల్)

జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తూ, విధ్వంసానికి ప్రయత్నించే అల్లరిమూకలను అణిచి వేసేందుకు, అత్యవసర సమయాల్లో పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చేలా ప్రత్యేక టీములను ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు.

● ప్రతిరోజూ కార్డన్ సెర్చ్

కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని పోలీసుస్టేషన్ల వారీగా కార్డన్‌సెర్చ్ ఆపరేషన్లను పోలీసులు నిర్వహిస్తున్నారు. వారం రోజులుగా రోజూ ఏదో ఒకచోట కార్డన్‌సెర్చ్ జరుగుతూనే ఉంది. ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్న పోలీసులు సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు. పరారీలో ఉన్న నేరస్థులను అదుపులోకి తీసుకోవడంతో పాటు, అనుమానితులను కూడా అదుపులోకి తీసుకుంటున్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

- జూన్ 4న ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్
- 17 టేబుళ్లలో నిర్వహణ
- ఈవీఎంలకు 14, పోస్టల్ బ్యాలెట్లకు 2, ఆర్వోకి ఒకటి చొప్పున ఏర్పాటు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్

నెల్లూరు '(హరనాథపురం), మే 23: జిల్లాలో ఓట్ల లెక్కింపును ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ సజావుగా పూర్తయ్యేందుకు పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు సహకరించాలన్నారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు గంట కంటే ముందే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్ లేదా అభ్యర్థి సమక్షంలో ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూముల సీల్ ఓపెన్ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఓట్ల లెక్కింపును పరిశీలించేందుకు నలుగురు కౌంటింగ్ పరిశీలకులను ఈసీ నియమించిందన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు అనుమతించమని చెప్పారు. కౌంటింగ్ కేంద్రం బయట జడ్పీ హైస్కూల్లో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశామని చెప్పారు.

● లెక్కింపునకు 17 టేబుళ్లు


జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఒక్కొక్క నియోజకవర్గానికి ఓట్ల లెక్కింపునకు 14 ఈవీఎం టేబుళ్లతోపాటు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు రెండు టేబుళ్లు, ఆర్వోకి ఓ టేబుల్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మొత్తం 17 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నెల్లూరు పార్లమెంటు సెగ్మెంటుకు సంబంధించి 14 ఈవీఎం టేబుళ్లు, ఆర్వోకి ఓ టేబుల్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నెల్లూరు పార్లమెంటుకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు విడిగా జరుగుతుం దన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఆరు టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఒక్కొక్క టేబుల్ దగ్గర కౌంటింగ్ సూపర్ వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. జూన్ ఒకటోతేదీ సాయంత్రం ఐదుగంటల్లోగా కౌంటింగ్ ఏజెంట్లకు సంబంధించి ఫామ్-18 ను ఆర్వోలకు అందించాలని రాజకీయ పక్షాలను కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, వైసీపీ నుంచి సుబ్బారావు, టీడీపీ నుంచి సురేంద్ర బాబు, బీజేపీ నుంచి శ్రీనివాస్, సీపీఎం నుంచి అజయ్, కాంగ్రెస్ నుంచి బాలసుధాకర్, బీఎస్పీ నుంచి శ్రీరామ్, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ధరణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● స్ట్రాంగ్ రూముల పరిశీలన

నెల్లూరు శివార్లలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ గురువారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూములను సీసీటీవీల ద్వారా మానిటరింగ్ చేస్తున్న కంట్రోల్ రూమును కూడా వారు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రచారంలో పాల్గొన్న
ఏఆర్ హెచ్‌సీ సస్పెన్షన్

నెల్లూరు(క్రైం): ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్(హెచ్‌సీ) మధుసూదన్ రావును జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ సస్పెండ్ చేశారు. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరు రూరల్ పరిధిలోని 41వడివిజన్ కార్పొరేటర్ కొవ్వా కొల్లు విజయలక్ష్మి భర్త మధుసూదన్‌రావు సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు రూరల్ వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారని జిల్లా కలెక్టర్‌తో పాటు ఈసీకి ఫిర్యాదులు అందాయి. ఇందుకు సంబంధించి ఫొటోలను, సాక్ష్యాలను టీడీపీ నేతలు అధికారులకు సమర్పించారు. విచారణ చేపట్టిన ఎన్నికల అధికారులు మధుసూదన్‌ను సస్పెండ్ చేయాలని ఎస్పీని ఆదేశించారు. దీంతో ఎస్పీ ఈ నెల 20న ఆయన్ను సస్పెండ్ చేశారు. నిబంధనలు అతి క్రమించి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కావడమనే రెండు కారణాలతో సస్పెండ్ చేశారు.



నత్తనడకన నాడు-నేడు పనులు



ఉదయగిరి ఉన్నత పాఠశాలలో చెట్ల కిందే పాఠాలు వింటున్న విద్యార్థులు (ఫైల్)



అసంపూర్తిగా అదనపు తరగతి గదుల నిర్మాణం

- చెట్ల కిందే విద్యార్థుల చదువులు
- బడులు తెరిచేలోపు పనులు పూర్తయ్యేనా?

ఉదయగిరి రూరల్, మే 23: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతాం.. నాడు-నేడు పనులతో పాఠశాలల రూపు రేఖలు మార్చేస్తామంటూ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నత్తనకడన సాగుతున్నాయి. నిధుల కొరతతో పనులు అర్ధాం తరంగా నిలిచిపోతున్నాయి. ఫలితంగా అరకొర వసతులు, అసంపూర్తి గదుల్లో తరగతుల నిర్వహణతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని గడ్డంవారిపల్లి, కృష్ణంపల్లి, బిజ్జంపల్లి, ఉదయగిరి, అప్పసముద్రం ఉన్నత పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా మిగిలి పోవడంతో విద్యార్థులకు ఉపాధ్యాయులు చెట్ల కింద విద్యాబోధన చేయాల్సిన దుస్థితి నెలకొంది. విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తయి తమ కష్టాలు తీరుతాయో లేదోనని ఎదురుచూస్తున్నారు.

ఉదయగిరి మండలంలో..

నాడు-నేడు పథకం కింద రెండోవిడత మరమ్మతులు చేపట్టేందుకు 25 పాఠశాలను ఎంపిక చేశారు. వీటిలో రూ.10.48 కోట్లతో పనులు చేపట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పనులకు సంబంధించి ఇప్పటి వరకు రూ.4.23 కోట్లు నిధులు మంజూరు చేయగా, మరో రూ.4.09 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక నిర్మాణాలకు సిమెంట్, మరుగదొడ్లకు అవసరమైన సామగ్రిని ప్రభుత్వమే మంజూరు చేస్తుంది. కొంతమంది ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బులు మరమ్మతుల కోసం వినియోగించి 80శాతం పనులు పూర్తి చేయించారు. ప్రభుత్వం నిధులు సకాలంలో విడుదల చేస్తే పనులు త్వరితగతిన పూర్తవు తాయని వారు చెబుతున్నారు. ఉదయగిరి ఉన్నత పాఠశాలలో 600మంది విద్యార్థులు చదు వుతున్నారు. ఈ పాఠశాలకు రూ.1.51 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కానీ ఇప్పటివరకు ఇచ్చింది కేవలం రూ.67.19లక్షలు మాత్రమే. ఉన్న పది తరగతి గదులు సైతం శిథిలావస్థకు చేరాయి. వారికి సరిపడా తరగతి గదులు లేకపోవడంతో ఉపాధ్యాయులు చెట్ల కింద విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాల క్రీడామైదానం ఆవరణలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణం చివరిదశలో నిలిచాయి. గడ్డంవారిపల్లి, కృష్ణంపల్లి, బిజ్జంపల్లి, అప్పసముద్రం తదితర పాఠశాలల్లో అదనపు తరగతుల నిర్మాణం, ఇతరత్రా పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవస్థ లు తప్పడంలేదు. ప్రభుత్వం స్పందించి నిధులు త్వరితగతిన మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం..

షేక్ మస్తాన్‌వలి, ఎంఈవో, ఉదయగిరి

మండలంలో మనబడి నాడు-నేడు పథకం కింద రెండోవిడతలో మంజూరైన పనులు త్వరితగతిన పూర్తి చేసి విద్యా సంవత్సరం ప్రారంభానికి పూర్తయ్యేలా చర్యలు చేపడతాం. అదనపు తరగతి గదుల నిర్మాణం 80 శాతం పనులు పూర్తయ్యాయి.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు

సంగం, మే 23: సర్కిల్ పరిధిలోని సంగం, ఏఎస్ పేట, చేజర్ల మండలాల్లో పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సంగం సీఐ రవినాయక్ హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కౌటింగ్ రోజు ర్యాలీలు, సభలు నిర్వహించరాదన్నారు. బాణాసంచా కల్చడాన్ని నిషేధిస్తూ ఎన్నికల సంఘం ఆదేశించింది. ఇందులో ఎవరికీ ఎలాంటి అనుమతులు లేవన్నారు. కౌటింగ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉన్నందున నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థుల సర్వే

ఉదయగిరి రూరల్ మే 23: మండలంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల సర్వేను గురువారం భవితకేంద్రం ఐఆర్పీలు శివనందిని, సుభాష్‌చంద్రబోస్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏపీడీ ఉషారాణి ఆదేశాలతో సచివాలయాల పరిధిలో సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా గుర్తించిన విద్యార్థులకు భవిత కేంద్రంలో ప్రవేశం కల్పించి ప్రతేక అలెవెన్స్‌లు కల్పిస్తామన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు, మంచానికి పరిమితమైన వారికి ఇంటి వద్దే బోధన, హోమ్ అలెవెన్స్‌లు ఇవ్వడం జరుగుతుందని వివరించారు.

200ఎకరాల్లో పండ్లతోటల సాగు లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీడీ గాయత్రిదేవి

ఉదయగిరి రూరల్ మే 23: ఈ ఆర్థిక సంవత్సరంలో మండలంలో 200ఎకరాల్లో పండ్లతోటల సాగు లక్ష్యంగా నిర్ణయించామని ఉపాధిహామీ ఏపీడీ గాయత్రీదేవి తెలిపారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఆమె సిబ్బందితో సమీక్ష నిర్వహించి అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసి పండ్లతోటల సాగుకు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి పనులు కల్పించి కూలీల శాతం పెంచాలన్నారు. వేసవి దృష్ట్యా ప్రభుత్వం నిర్దేశించిన రూ.300 కూలీ గిట్టుబాటు అయ్యేలా కొలతల ప్రకారం పనిచేయించాలని.. పనుల వద్ద వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం 6నుంచి 11గంటల వరకు పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఏపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఉదయగిరి రూరల్ , మే 23: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు జరుగనున్న ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్ష కేంద్ర చీఫ్ సూపరింటెండ్ వాసుబాబు గురువారం తెలిపారు. కేంద్రంలో 144 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

వైభవంగా పాండురంగ విఠలేశ్వరుడి రథోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతారామపురం, మే 23: పండ్రంగి గ్రామ సమీపంలోని పాండురంగ విఠలేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలకేంద్రంలోని తోటవీధి, తూర్పువీధి వారు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవం, పారువేట కనులపండువగా సాగింది. ఈ సందర్భంగా పండరిభజన, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు అన్ని గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

సీతారాముల వసంతాల వేడుక

దేవిశెట్టిపల్లి ప్రసన్న కోదండ రామస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం సీతారాములకు వసంతాల వేడుకలు నిర్వహించారు. అందరు కలిసి వంతాలు చల్లుకుని ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామి రథోత్సవం, పారువేటలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు, ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనరసింహుడి కల్యాణం

అనంతసాగరం: ఉప్పలపాడులో వెలసిన లక్ష్మీనరసింహుని ఆలయంలో గురువారం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. స్వామి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో మూడురోజులుగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు



పప్పులవారిపల్లి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉదయగిరి రూరల్: పప్పులవారిపల్లిలో జరుగుతున్న కోదండ రామస్వామి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం, గ్రామోత్సవం, పారువేట కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమలకు భక్తులు అధికంగా పాల్గొని, మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో సయ్యద్ ఉస్మాన్ గంధం మహోత్సవం

ఉదయగిరి, మే 23: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని సయ్యద్ ఉస్మాన్ సాహెబ్ గంధం మహోత్సవం గురువారం రాత్రి దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫకీరు జరుబులు విద్యుత్ దీపాల నడుమ పురవీధుల్లో ఊరేగింపుగా గంధంను తీసుకుని దర్గాకు చేరుకున్నారు. అనంతరం గ్రంథాన్ని చదివి భక్తులకు వినిపించారు. ఈ సందర్భంగా దర్గా వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

కోడి పందెం స్థావరంపై పోలీసుల దాడి



పట్టుబడిన ద్విచక్ర వాహనాలు

వరికుంటపాడు, మే 23: విరువూరు గ్రామ శివారులో గురువారం నిర్వహించిన కోడి పందెంల స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురు వ్యక్తులు, 9 పందెం కోళ్లు, 20 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తిరుపతయ్య తెలిపారు. పందెం రాయుల వద్ద నుంచి రూ.5,700లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

నేలపైనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ఆనకట్ట సమీపంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఉదయగిరి, మే 23 : స్థానిక ఆనకట్ట సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేలపైనే ఉంది. ఆనకట్ట ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఆనకట్ట చుట్టూ మట్టికట్టను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు నేలపై ఉంచి విద్యుత్ సరఫరా కొనసాగిస్తున్నారు. అయితే ఉదయం, సాయంత్రం వాకింగ్ వెళ్లే ప్రజలు, పశువుల సంచారం అధికంగా ఉంటుంది. అలాగే నివాసాలకు సమీపంలో ఉండడంతో చిన్నారులకు సైతం దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కొరవడిన పారిశుధ్యం

అనంతసాగరం, మే 23: పాతదేవరాయపల్లిలోని తుమ్మలమ్మ ఆలయం వద్ద ఉన్న చేతిపంపు చుట్టూ మురుగునీరు చేరి స్థానికులకు ఇబ్బందులు కలుగుతోంది. పంపు నుంచి వచ్చే వృథా నీరు బయటకు పోయే వెసులుబాటు లేక చిత్తడిగా మారి పరిసరాల్లో దుర్వాసన వస్తుంది. అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పగిలిన పైపులైన్



చర్చి సమీపంలో పగిలిన మంచినీటి ప్రధాన పైపులైన్

- పట్టణంలో ఆగిన తాగునీటి సరఫరా
- ప్రజల అవస్థలు

కావలి, మే 23: పట్టణానికి మంచినీటి సరఫరా అయ్యే ప్రధాన పైపులైన్ గురువారం తెల్లవారుజామున ఆర్వోబీ వంతెన పక్కన చర్చి సమీపంలో పగిలి పోవటంతో పాటు సీసీ రోడ్డంతా ధ్వంసమైంది. దీంతో గురువారం ఉదయం నుంచి పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పగిలిన పైపులైన్ మరమ్మతులు పూర్తయ్యేసరికి రెండు రోజులు సమయం పట్టనుండడంతో అప్పటివరకు పట్టణ వాసులకు తాగునీటి కష్టాలు తప్పేట్లు లేదు. రైల్వేట్రాక్ నుంచి ఏరియా వైద్యశాల వరకు ఆ మార్గంలో ఉన్న ప్రధాన పైపులైన్ పూర్తిగా దెబ్బతిని రోడ్డు కూడా పాడైపోయింది. రోడ్డు మధ్యలో పైపులైన్ వేసి ఉండటం, దానిపైన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో తరచూ పైపులైన్ పగిలినపుడల్లా రోడ్డు పగులకొడుతుండడంతో రాకపోకలు కూడా స్తంభించిపోతున్నాయి. పావు కి.మీ దూరంలో సుమారు పది చోట్లకు పైగా పైపులైన్ పగిలి అతుకులు వేయడంతో ఆ మార్గంలో పైపులైన్ ద్వారా పట్టణానికి నీటిసరఫరా దినగండంగా మారింది. దీంతో ఐడీఎస్ఎంటీ ప్లాంట్ల నుంచి ట్రంకురోడ్డులోని కలికి యానాదిరెడ్డి విగ్రహం వరకు పాడైపోయిన పాత పైపులైన్ తొలగించి శాశ్వత ప్రాతిపదికన ఐరన్ పైపులైన్ వేసేందుకు మున్సిపల్ అధికారులు మూడేళ్ల కిందట ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినా నిధులు మంజూరు కాకపోవడంతో ఆ పైపులైన్‌కు మోక్షం లభించక తరచూ దెబ్బతిని నీటిసరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్‌కు శాశ్వత పరిష్కారం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సేంద్రీయ ఎరువుల వినియోగం శ్రేయస్కరం



కావలి రూరల్: మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి

కావలి రూరల్, మే 23: ఎరువులు, పురుగు మందుల అధిక వాడకం భూసారానికే ముప్పు అని, సేంద్రీయ ఎరువుల వినియోగం శ్రేయస్కరం అని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి పి సత్యవాణి పేర్కొన్నారు. కావలి మండలం తాళ్లపాలెంలో గురువారం భూసార పరి రక్షణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ భూసారాన్ని పరిరక్షించుకునేందుకు మట్టినమూనాలు చేయించుకుని వాటికి అనుగుణంగా ఎరువుల వాడకం చేపట్టాలన్నారు. కాగా, భూసారం పెంచుకునేందుకు రైతులకు రాయితీపై జీలగలు, పిల్లిపెసరలు అందుబాటులో ఉంచినట్లు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మద్దూరుపాడులోని విత్తన తయారీ కేంద్రంలోని నిల్వలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఏడీఏ నర్సోజీరావ్, కావలి డివిజన్ ఏడీఏ నాగరాజు, మండల వ్యవసాయశాఖ అధికారిణి ఏ లలిత, రైతులు పాల్గొన్నారు.

కందుకూరు: రైతులు నానో ఎరువుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలని కందుకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు పి అనసూయ సూచించారు. మండలంలోని విక్కిరాలపేట, కొండి కందుకూరు రైతు భరోసా కేంద్రాలలో భూసార పరిరక్షణకై రైతులకు అవ గాహన సదస్సు మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో గురు వారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ అనసూయ మాట్లా డుతూ నానో యూరియా, నానో డీఏపీ మార్కెట్లో అందుబాటులో ఉన్నాయని, వీటిని పైర్లకు పైపాటుగా పిచికారీ చేయడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని వివరించారు. నానో ఎరువుల వాడకంతో పాటు తొలకరిలో పచ్చిరొట్ట పైర్లు సాగుచేసి వాటిని పూతదశలో భూమిలో కలియ దున్నటం అలవాటు చేసుకుంటే అద్భుత ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు డి రోషిణి, కె చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



చిట్రగుంట: కొత్తూరు రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చిట్రగుంట, మే 23: బోగోలు మండలం నాగులవరం పంచాయతీ చెన్నారెడ్డిపాలెం కొత్తూరు కోదండరామస్వామి ఆలయంలో నరసింహ జయంతి సందర్భంగా గురువారం సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. సీతారాముల ఉత్సవాలలో భాగంగా ఉదయం సీతమ్మవారి గిన్నె గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం గ్రామస్థుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం జరిగింది. ఉభయ కర్తలుగా యర్రం శ్రీనివాసులురెడ్డి, ప్రభావతి దంపతులు వ్యవహరించారు. రాత్రి స్వామివారి పట్టాభిషేకం, గ్రామోత్సవం నిర్వహించారు.

కొండాపురం: మండలంలోని నేకునాంపేట గ్రామంలో భక్తులు సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు పండితులు తీర్థప్రసాదాలు అందచేశారు. గుడవళ్లూరు, పార్లపల్లి, కొమ్మి తదితర గ్రామాలలో ఉత్సవాల సందర్భంగా ఆలయాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటుచేశారు.

కలిగిరి: మండలంలోని కుమ్మరకొండూరు గ్రామంలో గురువారం సీతారామ కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పారువేట కార్యక్రమంలో భాగంగా సీతారాముల గ్రామోత్సవం నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- మాతినవారిపాలెంలో వైద్యశిబిరం ఏర్పాటు



వాటర్ ట్యాంక్ పరిసరాలు పరిశీలిస్తున్న డీపీవో

కావలి రూరల్, మే 23: కావలి మండలం సర్వాయపాలెం పంచాయతీ మాతినవారి పాలెంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టి నట్లు జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత పేర్కొన్నారు. మాతినవారిపాలెం గ్రామ పరిసరాలు, నీటి వనరులను, ఓవర్‌హెడ్ ట్యాంకును గురువారం డీపీవో పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడబడితే అక్కడ చెత్త వెయ్యరాదని, బహిరంగ మలవిసర్జన మాని మరుగుదొడ్లను వాడుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకు పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు సూచించారు. నీటి పరీక్షల నమూనాలు పరిశీలించి నీటితో ఇబ్బందులు లేవని పేర్కొన్నారు.

వైద్యశిబిరాన్ని పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

మాతినవారిపాలెం పాఠశాలలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత పరిశీలించారు. వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న వారికి వైద్యసేవలు అందించి రక్తనమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్లు, జేఈ క్రిష్ణచైతన్య, ఎంపీడీవో క్రిష్ణమోహన్, వైద్యులు ప్రమోద్, సర్వాయపాలెం పిహెచ్‌సీ వైద్యులు మాధురి, ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సృష్టించొద్దు : డీఎస్పీ



మాట్లాడుతున్న కావలి ఆర్డీవో శీనానాయక్, డీఎస్పీ

కావలి, మే 23: ఎన్నికల కౌంటింగ్ వేళ సమస్యలు సృష్టించి కేసులలో ఇరుక్కోవద్దని కావలి ఆర్డీవో శీనానాయక్, డీఎస్పీ ఎం వెంకటరమణ మత్స్యకారులకు సూచించారు. కావలి రూరల్ మండలం తుమ్మలపెంటలో గురువారం మత్స్యకారులతో రెవెన్యూ, పోలీస్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించి కేసులలో ఇరుక్కుంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రూరల్ మండలంలో తుమ్మలపెంట ప్రధానమైన గ్రామమని, ఇక్కడ ప్రశాంతతకు భంగం కలిగించకుండా చూడాలన్నారు. పోలింగ్ సమయంలో తాము స్పెషల్‌పార్టీ పోలీసులను పంపి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఇక్కడ గొడవలు జరిగాయని, దీంతో కేసులు పెట్టాల్సి వచ్చిందన్నారు. కౌంటింగ్ సందర్భంగా కాని, కౌంటింగ్ అనంతరం కాని ఎలాంటి ప్రదర్శనలు, ఊరేగింపులకు అనుమతులు లేవని, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని, కౌంటింగ్ రోజు 144 సెక్షన్ కూడా అలవుతుందని, అతిక్రమిస్తే కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసు కుంటామన్నారు. ఇప్పటికే తాము ఎలాంటి అల్లర్లకు పాల్పడమని మీ వద్ద బైండోవర్ రాయించుకున్నామని, దానిని అతిక్రమిస్తే బైండోవర్ మేరకు మీరు పెనాల్టీ చెల్లించాల్సి వస్తోందని, లేదంటే మీ ఆస్తులు వేలం వేసి అయినా వసూలు చేస్తామన్నారు. కనుక గొడవలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కావలి తహసీల్దార్ నగేష్, రూరల్ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలుగోళ్ల శాంభవికి లక్ష మల్లెల పూజ



లక్ష మల్లెల పూజ నిర్వహిస్తున్న మహిళలు

కావలి, మే 23: కావలి పట్టణం కలుగోళ్ల శాంభవి ఆలయంలో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం ఉదయం లక్ష మల్లెల పూజ 108 మంది ముత్తైదువులచే వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కలుగోళ్ల శాంభవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ గావించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

కావలి రూరల్, మే 23: జలదంకి మండలం లింగరాజు అగ్రహారానికి చెందిన విద్యార్థిని అదృశ్యంపై గురువారం రాత్రి ఆమె తండ్రి రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని ఒక ప్రయివేటు కళాశాలలో డిగ్రీ మెదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పట్టణంలోని జేబి కళాశాలలో పరీక్షలు రాయటానికి బుధవారం వచ్చినట్లు తెలిపారు. పరీక్ష అనంతరం పరీక్షా కేంద్రం నుండి స్నేహితులతో కలసి వచ్చిన విద్యార్థిని వెంగళరావు నగర్‌లోని తన అత్త ఇంటివద్ద ఉన్న చెల్లిని తీసుకువస్తానని తండ్రికి ఫోన్‌చేసి చెప్పినట్లు తెలిపారు. అనంతరం కొద్దిసేపటి తరువాత ఆమె అత్త ఫోన్ చెయ్యగా ఇంటికి వచ్చేందుకు ఆటో కోసం చూస్తున్నానని అత్తకు చెప్పిందన్నారు. తరువాత ఎంత సేపటికీ ఇంటికి రాకపోగా ఫోన్ చెయ్యగా స్విచ్‌ఆఫ్ రావటంతో బంధువుల ఇళ్లవద్ద, అక్కడక్కడ వెతికినా కనిపించక పోవటంతో విద్యార్థిని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు.

టీఆర్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఓరుగంటి వెంకటేశ్వరరావు

కందుకూరు, మే 23: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఓరుగంటి వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన నాగేశ్వరరావు ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ఇక్కడ పౌరశాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును పూర్తి అదనపు బాధ్యతలతో ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. దీంతో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలలో విద్యాప్రమాణాల మెరుగుకు కృషిచేస్తానన్నారు.

టీబీ నివారణకు టీకాలు



బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఉలవపాడు, మే 23 : టీబీ వ్యాధి నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 8 సచివాలయాల్లో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. కందుకూరు డిప్యూటీ డీఎంహెంచ్‌వో డాక్టర్ ప్రియంవధ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. టీబీ వ్యాధి సోకకుండా దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన 16 సంవత్సరాలు దాటినవారు ఈ టీకా తప్పకుండా వేయించు కోవా లని తెలిపారు. ప్రతి గురువారం ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో టీకా వేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరేడు వైద్యాధికారిణి డాక్టర్ రమ్య జ్యోతి, ఎంపీహెచ్‌వో లక్ష్మీనారాయణ, ఎన్ఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

అల్లూరు, మే 23 : అల్లూరు నగర పంచాయతీ పాలన అస్తవ్యస్తంగా తయారైందని, గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అల్లూరు పట్టణ పరిధితోపాటు మజరా గ్రామాల్లో వీధిలైట్లు లేక రాత్రి సమయాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీధుల్లో సిమెంటు రోడ్డులను పగలగొట్టి గుంతలను ఏర్పాటు చేశారని, ఆ గుంతలను పూడ్చకుండా అలానే వదిలేయడంతో పలువురు వాహనచోదకులు గాయాలపాలవుతున్నారన్నారు. పాతబస్టాండు కూడలిలో, రాయాజి వీధిలో ఇదే పరిస్థితి ఏర్పడిందని, అదేవిధంగా ఎక్కడి చెత్త అక్కడే రోజుల తరబడి ఉండడంతో దుర్వాసన వెదజల్లుతూ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్పందనలో ఫిర్యాదు చేస్తే మూడు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

కొండాపురం, మే 23: అతిగా మద్యంసేవించి వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం మండలంలోని కొమ్మి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన బండ్లమూడి ఏడుకొండలు (40) మద్యం తాగి మత్తులో పొలాలకు వెళ్లాడన్నారు. లింగసముద్రం మండలం ముత్తంవారిపాలెం అటవీప్రాంతంలో ఏడుకొండలు పడివుండగా పశువుల కాపరులు గమనించి దగ్గరకు వెళ్లగా అప్పటికే మృతిచెంది ఉండటాన్ని గుర్తించి కుటుంబసభ్యులకు తెలియచేయడంతో మృతదేహాన్ని ఇంటికి తీసువెళ్లారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఈవిషయంపై ఎస్‌ఐ మహేంద్రను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.